ప్రభాతనవ

SINGIDI తెలుగు దినపత్రిక

# సింగిడి

ప్రతి రంగూ ఓ నిజం

singidinews.com

ఆదివారం 6 సెప్టెంబర్ 2026 | సంపుటి: 1 సంచిక: 45 పేజీలు 12 వెల: 6.50


Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar

## కశ్మీర్‌లో ఎన్‌కౌంటర్..
## లష్కరే కమాండర్ హతం

- బుద్గాం జిల్లా యూస్‌మార్గ్‌లో ఎన్‌కౌంటర్
- పాకిస్థాన్‌కు చెందిన లష్కరే కమాండర్ యాసిర్ హతం
- నిఘా సమాచారంతో జాయింట్ ఆపరేషన్ చేపట్టిన బలగాలు
- కొంతకాలంగా యాసిర్ కదలికలపై భద్రతా సంస్థల నిఘా



2



2

## 7 నుంచి
## అసెంబ్లీ సమావేశాలు

అధికారులకు కీలక సూచనలు చేసిన స్పీకర్, ఛైర్మన్

# ఇప్పట్లో విస్తరణ లేనట్లే!

### కేబినెట్ విస్తరణపై మహేశ్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు

- ఢిల్లీ పర్యటనలో విస్తరణపై చర్చ జరగలేదన్న పీసీసీ చీఫ్
- కొండా సురేఖ బర్తరఫ్ ఏఐసీసీ నిర్ణయమని స్పష్టీకరణ
- కేబినెట్ విస్తరణకు హైకమాండ్ నుంచి సమాచారం లేదని వెల్లడి
- విస్తరణ ఎప్పుడు చేయాలనేది సీఎం నిర్ణయమన్న మహేశ్

2

కొండా సురేఖను మంత్రి వర్గం నుంచి తప్పించిన నేపథ్యంలో తెలంగాణ కేబినెట్ విస్తరణపై జోరుగా చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడిన ఆయన.. ప్రస్తుతం కేబినెట్ విస్తరణపై ఎలాంటి చర్చ జరగలేదని స్పష్టం చేశారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 5 (సింగిడి)



# రెండేళ్లు ఓపిక పట్టండి.. సమస్యలన్నీ పరిష్కరిస్తా

### ఉపాధ్యాయులకు సీఎం రేవంత్ రెడ్డి హామీ



- పెండింగ్ టీచర్ల పదోన్నతులు పూర్తి చేశామన్న రేవంత్
- బదిలీలపై జాగ్రత్తగా వ్యవహరిస్తున్నామన్న సీఎం
- సాంకేతిక విద్యకు ప్రభుత్వ సహకారం ఉంటుందన్న రేవంత్
- పాలిటెక్నిక్ విధానంలో మార్పులు లేవని స్పష్టీకరణ

వచ్చే రెండేళ్లు సహకరిస్తే అన్ని సమస్యలు పరిష్కరిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ఉపాధ్యాయులకు హామీ ఇచ్చారు. కొడంగల్ ప్రభుత్వ కాలేజీలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలలో రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తనకు రెండేళ్లు సమయం ఇస్తే.. ఇంక్రిమెంట్లు, పీఆర్సీ సహా ఉపాధ్యాయుల అన్ని సమస్యలను పరిష్కరిస్తామని మాట ఇచ్చారు. మాట తప్పితే వచ్చే ఎన్నికలలో తనకు మార్కులు వేసే నిర్ణయం కూడా ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉంటుందని గుర్తు చేశారు.

2

హైదరాబాద్, సెప్టెంబర్ 5 (సింగిడి)

# కల్వకుంట్ల కుటుంబమా...
# కాస్కోండి



ఏ విషయంపైనైనా చర్చించేందుకు తాను సిద్ధమన్న సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీకి రావాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు సవాల్ విసిరారు. నల్గొండ జిల్లా నకిరేకల్‌లో వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రిని ప్రారంభించిన అనంతరం, స్థానిక రాజీవ్‌గాంధీ మినీ స్టేడియంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్నారు.

### సిరిసిల్లపై కాంగ్రెస్ జెండా ఎగరవేస్తా.. సిద్దిపేటలోనూ కాంగ్రెస్ దే గెలుపు

- సీట్లు పెరిగితే 117 గెలుస్తాం... ఇప్పుడున్నవే అయితే 90 గెలుస్తాం
- వెయ్యి రోజుల్లో కేసీఆర్‌కు రూ.22 కోట్లు ఖర్చు.. ప్రభుత్వ సొమ్ము తీసుకొని అసెంబ్లీకి రావట్లేదు
- ప్రజా సమస్యలు కేసీఆర్ ప్రస్తావించరా... ఏడాదిలో 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం
- నకిరేకల్ బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి.. వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రి ప్రారంభం

హైదరాబాద్, సెప్టెంబర్ 5 (సింగిడి)

ప్రభుత్వ ఉద్యోగులు ఏడాదిపాటు రాకపోతే తొలగిస్తామని, వెయ్యి రోజుల్లో కేసీఆర్‌కు రూ.22 కోట్లు ఖర్చయ్యిందని, ప్రభుత్వ సొమ్ము తీసుకొని అసెంబ్లీకి రావట్లేదని అన్నారు. ప్రజల సొమ్ము తిని ప్రజా సమస్యలు ప్రస్తావించరా అని నిలదీశారు. బీఆర్ఎస్ అనే మొక్కను తెలంగాణలో మొలకెత్తనివ్వమని, సిరిసిల్ల, సిద్దిపేటలోనూ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుస్తోందని ఆశాభావం వ్యక్తం చేశారు. 'ఈ నెలఖరుకు వస్తా, సిరిసిల్లపై కాంగ్రెస్ జెండా ఎగరవేస్తా, వచ్చే నెలలో సిద్దిపేటకు వస్తా, కాస్కోండి కల్వకుంట్ల కుటుంబమా, సీట్లు పెరిగితే 117 సీట్లు గెలుస్తాం, ఇప్పుడున్న సీట్లే ఉంటే 90 సీట్లు గెలుస్తాం' అని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజాపాలన పోవాలి పాపాల భైరవుడు రావాలి అని వాళ్లు కోరుకుంటున్నారని, తమ ప్రభుత్వం వచ్చిన ఏడాదిలో 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని తెలిపారు. మీ జిల్లాకు ఒకేసారి 3 ఎమ్మెల్సీ పదవులను ఇచ్చామని, కేసీఆర్ సీఎం అయితే వాళ్ల కుటుంబసభ్యులకు పదవులు ఇచ్చారని, తమ ప్రభుత్వంలో ఉద్యమకారుల పిల్లలకు పదవులు ఇచ్చామని గుర్తు చేశారు.

అందరిలాగానే బీఆర్ఎస్ కార్యకర్తలకూ రేషన్‌కార్డులు, సన్నబియ్యం ఇస్తున్నామని గుర్తు చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తల ఇళ్లలో ఉచిత కరెంట్ వస్తోందంటే మా ప్రభుత్వం కాదా అని సీఎం ప్రశ్నించారు. మేం ఇచ్చిన రైతుభరోసా నిధులను ఎవరైనా బీఆర్ఎస్ కార్యకర్తలు వద్దన్నారా అని అడిగారు.

సంపాదన పోయిందని బావ, బామ్మర్ది ఏడుస్తున్నారని ఎద్దేవా చేశారు. నాకు చదువు లేదని బీఆర్ఎస్ నేతలు అంటున్నారు. చదువు లేకపోయినా నాకు సంస్కారం ఉంది. నాకు సంస్కారం ఉంది కాబట్టే మీరు రోడ్లపై తిరుగుతున్నారు. నాకు సంస్కారం ఉంది కాబట్టే కొండా సురేఖ, సీతక్కతో రాఖీ కట్టించుకున్నా. ఎక్కడ ఆస్తి ఇవ్వాల్సి వస్తుందోనని మీరు చెల్లిని బయటకు గెంటేశారు. చెల్లిని బయటకు గెంటేసిన వ్యక్తి ఆడబిడ్డల గురించి ఆలోచిస్తారా. నాలుగు ఇంగ్లీష్ ముక్కలు వస్తే సరిపోదు. ఆడబిడ్డను చూసుకోవాలి. నీ సంస్కారం ఏంటో నా సంస్కారం ఏంటో అసెంబ్లీకి రా చూసుకుందాం. నేను మంచిగా

...మిగతా 2లో



# కమీషన్ల కోసం కొట్టుకుంటున్న మంత్రులు

### లక్కీ లాటరీ సీఎం రేవంత్‌ను కూల్చే రోజులు త్వరలోనే ఉన్నాయి: కేటీఆర్

- రేవంత్ ఓటుకు నోటు కేసులో దొరికిన దొంగ అన్న కేటీఆర్
- 420 మోసాలకు గాను రేవంత్ 420 సార్లు రాజీనామా చేయాలని డిమాండ్

2

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణ యువతకు స్కిల్ లేదనడానికి రేవంత్ రెడ్డికి ఏ అర్హత ఉందని, ఆయన స్వయంగా ఓటుకు నోటు కేసులో దొరికిన దొంగ అని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో చేసిన మోసాలపై బీఆర్ఎస్ నిర్వహించిన 'యువభేరి' సభలో పాల్గొన్న కేటీఆర్, కేవలం లక్కీ లాటరీ తగలడం వల్లే రేవంత్ సీఎం అయ్యారని ఎద్దేవా చేశారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 5 (సింగిడి)

## ఏపీ నీటి దోపిడీకి రేవంత్ సర్కార్ సహకారం

### కేటీఆర్ ధ్వజం

- కేఆర్ఎంబీ ఆదేశాలు తెలంగాణకు గొడ్డలిపెట్టు..
- శ్రీశైలం విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేయాలని కేఆర్ఎంబీ ఆదేశాలు
- శ్రీశైలం, సాగర్ రిజర్వాయర్లను ఏపీకి రేవంత్ ధారాదత్తం చేస్తున్నారని విమర్శ

2

# ఫ్యూచర్ సిటీలో టీసీఎస్ భారీ పెట్టుబడి

### రేవంత్ రెడ్డితో టీసీఎస్ హైపర్‌వాల్ట్ ప్రతినిధుల బృందం భేటీ



హైదరాబాద్‌లో దేశంలోనే అత్యంత అధునాతన, అతిపెద్ద ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) డేటా సెంటర్ క్యాంపస్ ఏర్పాటు కావడం తెలంగాణకే కాకుండా దేశానికే చారిత్రాత్మక ప్రాజెక్టు అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విప్లవంలో హైదరాబాద్ ప్రపంచ స్థాయిలో అగ్రగామిగా ఎదుగుతోందని అభిప్రాయపడ్డారు. టీసీఎస్ అనుబంధ సంస్థ 'హైపర్ వాల్ట్' ప్రతినిధుల బృందం శనివారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో భేటీ అయింది. హైదరాబాద్‌లో 1 గిగావాట్ (1,000 మెగావాట్లు) సామర్థ్యంతో మెగా ఏఐ డేటా సెంటర్ క్యాంపస్‌ను ఏర్పాటు చేయడానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది.

హైదరాబాద్, సెప్టెంబర్ 5 (సింగిడి)

2

## రాజకీయాలకు అయ్యన్న గుడ్‌బై

- తన పుట్టినరోజు సందర్భంగా ఏపీ శాసనసభ స్పీకర్ సంచలన నిర్ణయం
- ఇకపై తాను రాజకీయాల నుండి శాశ్వతంగా తప్పకుంటున్నట్టు ప్రకటన



ఏపీ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తన పుట్టినరోజు సందర్భంగా సంచలన ప్రకటన చేశారు. ఇకపై తాను రాజకీయాల నుండి శాశ్వతంగా తప్పుకుంటున్నట్టు ప్రకటించారు.

- అమరావతి (సింగిడి)


2

## ఎస్సీ, ఎస్టీల రక్షణకు
# పటిష్ఠ వ్యవస్థ

### సీఎం చంద్రబాబు సమీక్ష

- అట్రాసిటీ నిరోధక చట్టం అమలుపై నాలుగంచెల కార్యాచరణ ప్రణాళిక
- 2023 నుంచి బాధితులకు రూ. 15.43 కోట్ల పరిహారం అందజేత
- రాష్ట్ర, జిల్లా, డివిజన్ స్థాయిలో విజిలెన్స్ కమిటీలు

2



రాష్ట్రంలో షెడ్యూల్ కులాలు (ఎస్సీ), షెడ్యూల్ తెగల (ఎస్టీ) రక్షణ, సంక్షేమం, అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం అమలును పటిష్ఠంగా పర్యవేక్షించేందుకు రూపొందించిన నాలుగంచెల కార్యాచరణ ప్రణాళికపై అధికారులు ఈ సమావేశంలో ముఖ్యమంత్రికి వివరించారు. అమరావతిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో శనివారం ఈ సమావేశం జరిగింది.

అమరావతి (సింగిడి)

## 12వ పీఆర్సీకి గ్రీన్ సిగ్నల్

ఉద్యోగులకు చంద్రబాబు తీపి కబురు

2

# మా పార్టీ డస్ట్ బిన్ కాదు

- బీజేపీలోకి కొండా సురేఖ అంటూ ప్రచారం..
- బీజేపీ సీనియర్ నేత మురళీధర్ రావు సంచలన వ్యాఖ్యలు

మంత్రి పదవి నుండి కొండాసురేఖను బర్తరఫ్ చేసిన తరవాత అనేక వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే కొండా సురేఖ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పి బీజేపీలో చేరతారంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. దీంతో కొందరు బీజేపీ నాయకులు ఆమె వస్తామంటే అడ్డుకునేది లేదని చెబుతుంటే మరికొందరు మాత్రం వ్యతిరేకిస్తున్నారు. తాజాగా బీజేపీ సీనియర్ నేత మురళీధర్ రావు కొండా సురేఖ బీజేపీలోకి వెళుతున్నారా అనే కథనంపై ఎక్స్ వేదికగా సంచలన వ్యాఖ్యలు చేశారు.

-హైదరాబాద్, సెప్టెంబర్ 5 (సింగిడి)



2



## నేపాల్‌లో విరిగిపడ్డ కొండచరియలు

### మళ్లీ వరదలు ముంచెత్తే ప్రమాదం!

హిమానీనదం విరిగిపడి భారీ వరదలతో అతలాకుతలమైన నేపాల్‌ను మరో ముప్పు వెంటాడుతోంది. తాజాగా జారీచేసిన వరద ప్రమాద హెచ్చరికలు ఆ దేశాన్ని తీవ్రంగా భయపెడుతున్నాయి.

ఖట్మండూ (సింగిడి)

2

## బీఎల్ఏ దాడిలో 25 మంది పాక్ సైనికులు మృతి

### స్పందించని పాక్

పాకిస్తాన్‌లో కొంతకాలంగా పాక్ సైన్యానికి, బెలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ)కు మధ్య భీకర పోరు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఇరుపక్షాలు పరస్పరం దాడి చేసుకుంటున్నాయి. తాజాగా బీఎల్ఏ జరిపిన దాడిలో 25 మంది పాకిస్తాన్ సైనికులు మరణించారు. ఈ విషయాన్ని బీఎల్ఏ తాజాగా వెల్లడించింది. పాక్ దాడులకు బదులుగా, బీఎల్ఏ జరిపిన వేర్వేరు దాడుల్లో పాక్ సైనికులు మరణించినట్లు తెలిపింది.

బెలూచిస్తాన్ (సింగిడి)

ప్రభాతనవ
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
ఆదివారం
6 సెప్టెంబర్ 2026

## కల్వకుంట్ల కుటుంబమా... కాస్కోండి

మొదటి పేజీ తరువాయి

ఉంటే మీరు ఏదో అనుకుంటున్నారు. బందిపోట్లలా తెలంగాణను దోచుకున్నారు. వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ప్రభుత్వమే వస్తుందన్న రేవంత్ రెడ్డి నకిరేకల్ గడ్డా కాంగ్రెస్ అడ్డా అని వేముల వీరేశం నిరూపించారని తెలిపారు. నకిరేకల్ నియోజకవర్గ అభివ ద్ధికి అండగా ఉండాలని వీరేశం కోరారని అన్నారు. గత ప్రభుత్వం అమలుచేసిన ఏ పథకాన్ని అయినా రద్దు చేశామా అని అడిగారు. మీరు ఇచ్చిన పథకాలను మరింత మెరుగ్గా ఇస్తున్నామని, బీఆర్ఎస్ ప్రభుత్వం వల్ల రైతులు అనేక రకాలుగా మోసపోయారని, చివరి విడత రైతుభరోసా నిధులు వేయకుండానే గద్దె దిగిపోయారని పేర్కొన్నారు. మీరు ఎగవేసిన రైతుభరోసా రూ.36 వేల కోట్లను రైతుల ఖాతాల్లో వేశామని, రాష్ట్రాన్ని అన్ని రకాలుగా ముంచి గద్దె దిగిపోయారని, వడ్ల కొనుగోలు, రైతుభరోసా, వడ్లకు బోనస్, ఉచిత కరెంట్ ఇస్తున్నామని వెల్లడించారు. మీకు ధైర్యం ఉంటే అసెంబ్లీకి రండి. అన్నీ చర్చిద్దాం. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కోసం రూ.11 వేల కోట్లు ఇచ్చాం. ఇవాళ కోటి మంది మహిళలు బస్సుల్లో ప్రయాణం చేస్తున్నారు. మహిళలకు ఉచిత బస్సు ఇవ్వడం చూసి కొందరు తట్టుకోలేకపోతున్నారు. మహిళలకు ఉచిత బస్సు రద్దు చేయాలంటూ ఆటో డ్రైవర్లను రెచ్చగొడుతున్నారు. సమస్యలు ఏంటో చెప్పాలని ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్నారు. వీలైన ప్రతిచోటా మహిళలను ప్రోత్సహిస్తున్నాం. కేసీఆర్ ఎప్పుడైనా మహిళల బాగు గురించి ఆలోచించారా. మహిళలకు పెట్రోల్ బంకులు, సోలార్ నిర్వహణ అప్పగించాం. నిరుద్యోగ యువత ఉసురు పోసుకుని ఇవాళ ఫామ్‌హౌస్‌కే పరిమితం అయ్యారు. పిల్లి శాపాలకు ఉట్లు తెగవని కేసీఆర్ గుర్తుపెట్టుకోవాలి. నల్గొండ జిల్లా నకిరేకల్‌లో రూ.32 కోట్లతో నిర్మించిన 100 పడకల ఆస్పత్రిని ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి ఆస్పత్రి మొత్తం తిరిగి పరిశీలించారు. ఆస్పత్రిలో అందించబోయే సేవలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. నకిరేకల్‌లో పలు అభివ ద్ధి పనులకు సీఎం శ్రీకారం చుట్టారు. రూ.345 కోట్లతో 12 రకాల అభివ ద్ధి పనులకు సీఎం శ్రీకారం చుట్టారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, సమీక త మండల కార్యాలయాల సముదాయ నిర్మాణాలకు సీఎం శంకుస్థాపన చేశారు.

## ఎస్సీ, ఎస్టీల రక్షణకు పటిష్ఠ వ్యవస్థ

ఎస్సీ, ఎస్టీ వర్గాల రక్షణ, సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ఈ కార్యాచరణను రూపొందించినట్లు అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా రాష్ట్రస్థాయిలో ప్రత్యేకంగా 'ఎస్సీ, ఎస్టీ ప్రొటెక్షన్ సెల్' ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. దీనితో పాటు రాష్ట్ర, జిల్లా, డివిజన్ స్థాయిల్లో విజిలెన్స్ కమిటీలను ఏర్పాటు చేసి, చట్టం అమలు తీరును నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు వివరించారు.

2026 సంవత్సరంలో ఇప్పటివరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం కింద 810 కేసులు నమోదు కాగా, వాటన్నింటినీ పరిష్కరించినట్లు అధికారులు సమావేశంలో వెల్లడించారు. ఈ కేసుల విచారణ కోసం రాష్ట్రవ్యాప్తంగా 14 ప్రత్యేక సెషన్స్ కోర్టులు, ఒక ప్రత్యేక కోర్టు పనిచేస్తున్నాయని తెలిపారు. 2023 నుంచి 2026 ఆగస్టు వరకు 1,478 కేసుల్లో బాధితులకు రూ. 15.43 కోట్ల పరిహారాన్ని అందించినట్లు వివరించారు.

ఈ ఉన్నతస్థాయి సమావేశంలో మంత్రులు డీబీవీ స్వామి, వి. అనిత, జి. సంధ్యారాణి, ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాల ఎంపీలు కృష్ణప్రసాద్, దగ్గుమళ్ల ప్రసాద్, పలువురు ఎమ్మెల్యేలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. హోంశాఖ కార్యదర్శి కుమార్ విశ్వజీత్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యనార్, న్యాయశాఖ అధికారులు హాజరయ్యారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల కోసం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల పర్యవేక్షణను మరింత బలోపేతం చేయడంపై కూడా సమావేశంలో చర్చించారు.

## ఇప్పట్లో విస్తరణ లేనట్లే!

ఇటీవల తాను ఢిల్లీ వెళ్లినప్పుడు మంత్రివర్గ విస్తరణ అంశం ప్రస్తావనకు రాలేదన్నారు. కొండా సురేఖ, చిన్నారెడ్డికి సంబంధించిన అంశాలపైనే అధిష్ఠానంతో చర్చ జరిగిందని తెలిపారు. కొండా సురేఖను మంత్రి వర్గం నుంచి తప్పించడం పూర్తిగా ఏఐసీసీ నిర్ణయమని మహేశ్‌కుమార్ గౌడ్ చెప్పారు. ఆమెపై చర్యలు తీసుకోకుండా ఆపేందుకు ప్రయత్నించినా.. ఏఐసీసీ ఈ విషయంలో సీరియస్‌గా ఉండటంతో నిర్ణయం జరిగిపోయిందన్నారు.

ప్రస్తుతం కేబినెట్ విస్తరణకు సంబంధించి హైకమాండ్ నుంచి తమకు ఎలాంటి సమాచారం లేదని పీసీసీ చీఫ్ తెలిపారు. రాష్ట్రంలో మంత్రివర్గాన్ని ఎప్పుడు విస్తరించాలనేది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయిస్తారని స్పష్టం చేశారు. తనకు మంత్రి పదవి దక్కుతుందంటూ జరుగుతున్న ప్రచారంపైనా మహేశ్‌కుమార్ గౌడ్ స్పందించారు. ఈ వార్తలపై తనకు ఎలాంటి సమాచారం లేదని తేల్చిచెప్పారు. దీంతో కొండా సురేఖ స్థానంలో ఎవరికి అవకాశం దక్కుతుందన్న చర్చకు ఇప్పటికైతే స్పష్టత రాలేదు.

## కశ్మీర్‌లో ఎన్‌కౌంటర్.. లష్కరే కమాండర్ హతం

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 5 (సింగిడి)**

జమ్ము కశ్మీర్‌లో ఉగ్రవాదుల ఏరివేత ప్రక్రియ కొనసాగుతోంది. శనివారం మధ్య కశ్మీర్‌లోని బుద్గాం జిల్లాలో భద్రతా బలగాలకు, ఉగ్రవాదులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో పాకిస్థాన్‌కు చెందిన లష్కరే తోయిబా (ఎల్ఈటీ) కమాండర్ యాసిర్ హతమయ్యాడు. యూస్‌మార్గ్ అటవీ ప్రాంతంలో ఈ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది.

యూస్‌మార్గ్ ప్రాంతంలో ఉగ్రవాదుల సంచారంపై నిఘా వర్గాల నుంచి అందిన కచ్చితమైన సమాచారంతో స్పెషల్ ఫోర్సెస్, 53 రాష్ట్రీయ రైఫిల్స్ దళాలు సంయుక్తంగా 'కార్డన్ అండ్ సెర్చ్' ఆపరేషన్ ప్రారంభించాయి. భద్రతా బలగాల రాకను గమనించిన ఉగ్రవాదులు కాల్పులకు తెగబడటంతో దళాలు ప్రతిదాడి చేశాయి. ఈ కాల్పుల్లో యాసిర్ అక్కడికక్కడే మృతి చెందినట్లు అధికారులు ధ్రువీకరించారు.

యాసిర్ గతంలో లష్కరే తోయిబాలోని సులేమాన్ మూసా గ్రూప్‌లో సభ్యుడిగా ఉండేవాడని, అయితే సుమారు ఏడాది క్రితం ఆ విభాగం నుంచి విడిపోయి సొంతంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు భద్రతా వర్గాలు వెల్లడించాయి. గత కొంతకాలంగా యూస్‌మార్గ్ పరిసర ప్రాంతాల్లో అతడి కదలికలపై నిఘా ఉంచినట్లు అధికారులు తెలిపారు.

యాసిర్ మృతి నేపథ్యంలో అతడి నెట్‌వర్క్, లష్కరే సభ్యులతో ఉన్న సంబంధాలు, అలాగే ఇటీవల జమ్ము కశ్మీర్‌లో జరిగిన ఉగ్ర దాడుల్లో అతడి ప్రమేయంపై దర్యాప్తు సంస్థలు విచారణ జరుపుతున్నాయి. కాగా, 2025 పహల్గాం ఉగ్రదాడికి సూత్రధారి అయిన సులేమాన్ మూసాను గతంలోనే భద్రతా బలగాలు హతమార్చిన సంగతి తెలిసిందే. కశ్మీర్‌లో ఉగ్రవాద నిర్మూలనకు చేపట్టిన ఆపరేషన్లలో యాసిర్ ఎన్‌కౌంటర్ కీలక విజయమని అధికారులు పేర్కొన్నారు.

## నేపాల్‌లో విరిగిపడ్డ కొండచరియలు

భారీ వర్షాల నేపథ్యంలో దార్చులా జిల్లాలోని భట్టార్ ప్రాంతంలో కొండచరియలు విరిగిపడి చౌలానీ నది ప్రవాహానికి అడ్డంకిగా మారాయి. కొండలపై నుంచి జారిపడిన రాళ్లు, మట్టితో నదీ ప్రవాహం పాక్షికంగా నిలిచిపోయింది. దాంతో అధికారులు అప్రమత్తమయ్యారు. రాళ్లు తొలగిపోతే ఒక్కసారిగా దిగువ ప్రాంతాలను వరద ముంచెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ క్రమంలోనే నదీ పరివాహక ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా యంత్రాంగం సూచించింది. పరిస్థితిని పర్యవేక్షించేందుకు పోలీసులను రంగంలోకి దించింది. సహాయక చర్యల కోసం అత్యవసర ఫోన్ నంబర్లనూ విడుదల చేసింది. వరదలతో తీవ్రంగా దెబ్బతిన్న ప్రాంతాలు ఇంకా కోలుకోకముందే ఈ కొత్త ముప్పు పొంచి ఉండటం ఆందోళనకరంగా మారింది.

## 7 నుంచి అసెంబ్లీ సమావేశాలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 5 (సింగిడి)**

సోమవారం నుంచి తెలంగాణ అసెంబ్లీ, శాసనమండలి వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో సభ లోపల, బయట ప్రశాంత వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ఆదేశించారు. సభ్యులు కోరిన సమాచారాన్ని సాధ్యమైనంత త్వరగా అందించాలని అధికారులకు సూచించారు. సమావేశాల నిర్వహణ, వసతులు, భద్రతా ఏర్పాట్లపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి శాసన వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆర్థిక శాఖ అధికారులు, డీజీపీ, పోలీసు ఉన్నతాధికారులు హాజరయ్యారు. గత సమావేశాల కంటే వేగంగా, సమన్వయంతో పనిచేయాలని అధికారులకు ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి సూచించారు.

# రెండేళ్లు ఓపిక పట్టండి.. సమస్యలన్నీ పరిష్కరిస్తా



రెండు సంవత్సరాలు సహకరిస్తే.. రాష్ట్రంలోని ఉపాధ్యాయులకు ఉన్న అన్ని సమస్యలను పరిష్కరిస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. రెండేళ్లు వెసలుబాటు కల్పిస్తే పీఆర్సీ, ఇంక్రిమెంట్ల వంటి సమస్యలను పరిష్కరిస్తామన్నారు.తెలంగాణ విద్యా వ్యవస్థను భారతదేశానికి ఒక దిక్సూచిలా నిలబెట్టడానికి ఉపాధ్యాయులంతా సహకరించాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. కొడంగల్‌లోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన రేవంత్ రెడ్డి.. ఆర్థిక వెసులుబాటును అనుసరించి ఉద్యోగుల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

మిగతా శాఖలతో పోల్చితే విద్యా శాఖ ఆదర్శంగా నిలబడాలన్న సీఎం.. రెండేళ్లు సమయం ఇస్తే సమస్యలన్నింటినీ సామరస్యంగా, అడక్కుండానే పరిష్కరించే బాధ్యత తనది స్పష్టం చేశారు. తెలంగాణ విద్యా వ్యవస్థను భారతదేశానికి ఒక రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుదామన్న రేవంత్ రెడ్డి.. అందుకు కథానాయకులు ఉపాధ్యాయులేనని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు ప్రభుత్వ సర్వీసులో 30 ఏళ్లకు పైగా సేవలందిస్తారని... రాజకీయ నాయకులుగా తాము ప్రతి ఐదేళ్లకు ఒకసారి వారి ముందుకు పరీక్షలు రాయాల్సిందేనని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం తాను చేయలేకపోతే.. ఎన్నికల పరీక్షల్లో తనకు మార్కులు వేసే నిర్ణయం కూడా ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందని అన్నారు.

ఉపాధ్యాయులే వీధుల్లోకి వస్తే ప్రభుత్వానికి మంచిది కాదన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. వారే ధర్నాలు చేస్తామంటే తప్పుడు సంకేతాలు వెళ్తాయని అభిప్రాయపడ్డారు. అందుకే ముఖ్యమంత్రిగా రెండేళ్లు సమయం ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నానని అన్నారు. గత ప్రభుత్వంలో విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేశారన్న రేవంత్ రెడ్డి.. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో 80 వేల అడ్మిషన్లు పెరిగాయంటే ఆ గొప్పతనం ఉపాధ్యాయులదేనని కొనియాడారు.

తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఎలాంటి వివాదం లేకుండా బదిలీల ప్రక్రియ పూర్తి చేశామని.. జీవో 317 కింద తలెత్తిన సమస్యలను పరిష్కరించినట్లు గుర్తు చేశారు. ఉత్తమ విధానాలను అధ్యయనం చేయడానికి ఉపాధ్యాయులను విదేశాలకు పంపించినట్లు రేవంత్ రెడ్డి వివరించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా విద్యా కమిషన్ నియమించి ఎడ్యుకేషన్ పాలసీని తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యా విధానంలో స్కిల్స్ నేర్పించడానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ఐటీఐలను ఏటీసీలుగా మార్చామని.. కార్పొరేట్ కంపెనీల సమన్వయంతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే విధానాలను ప్రారంభించినట్లు సీఎం రేవంత్ రెడ్డి వివరించారు.

# ఏపీ నీటి దోపిడీకి రేవంత్ సర్కార్ సహకారం



కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) శ్రీశైలం ప్రాజెక్టు నుంచి విద్యుత్ ఉత్పత్తిని తక్షణమే నిలిపివేయాలని జారీ చేసిన ఆదేశాలు తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలకు కోలుకోలేని గొడ్డలిపెట్టు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేఆర్ఎంబీ నిర్ణయం కాంగ్రెస్ ప్రభుత్వ చేతగానితనానికి, నిర్లక్ష్యానికి స్పష్టమైన నిదర్శనమని మండిపడ్డారు. ఎల్‌నినో పేరు చెప్పి కేఆర్ఎంబీ తెలంగాణ హక్కులను కాలరాస్తుంటే రేవంత్ రెడ్డి ప్రభుత్వం నోరు మెదపకపోవడం దారుణమన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏ నిబంధనల ప్రకారం, ఏ హక్కుతో వెలిగొండ ప్రాజెక్టుకు చట్టవిరుద్ధంగా నీటిని తరలిస్తోందో చెప్పాలని నిలదీసిన కేటీఆర్, ఏపీ నీటి దోపిడీ బోర్డు కళ్లకు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు.

అక్కడ ఏపీ ప్రభుత్వం తన రాష్ట్ర ప్రయోజనాల కోసం దర్జాగా వెలిగొండకు నీటిని తరలిస్తుంటే, ఇక్కడ తెలంగాణలోని రేవంత్ సర్కార్ మాత్రం పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పంపులను మూసివేసి ఏపీకి సహకరిస్తోందని కేటీఆర్ ఆరోపించారు. రేవంత్ రెడ్డి తన అసమర్థ పాలనతో శ్రీశైలం, నాగార్జున సాగర్ రిజర్వాయర్లను ఏపీకి దారాదత్తం చేశారని ధ్వజమెత్తారు. విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేస్తే నాగార్జున సాగర్ ఎడమ కాలువ, కల్వకుర్తి, జూరాల, నెట్టెంపాడు, భీమా ఎత్తిపోతల పథకాల కింద రైతుల పొలాలు ఎండిపోవడమే కాకుండా, బోర్ల కింద వ్యవసాయం చేసే రైతులకు కరెంట్ అందక తీవ్ర నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

శ్రీశైలంలో ఆగస్టు 21న 169 టీఎంసీలుగా ఉన్న నీటి నిల్వలు కేవలం 15 రోజుల్లోనే 139 టీఎంసీలకు పడిపోవడంపై స్పందిస్తూ, ఈ వ్యవధిలోనే 30 టీఎంసీల నీరు ఎలా మాయమయ్యిందో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కల్వకుర్తి వద్ద కేవలం మూడు మోటార్లు మాత్రమే నడుస్తున్నాయని, కృష్ణా జలాలను ఏపీ యథేచ్ఛగా తరలిస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వంలో చలనం కరవైందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను, రైతాంగానికి చేస్తున్న ద్రోహాన్ని ప్రజాక్షేత్రంలో ఎండగట్టి తీరతామని కేటీఆర్ హెచ్చరించారు.

# 12వ పీఆర్సీకి గ్రీన్ సిగ్నల్

**ఉద్యోగులకు చంద్రబాబు తీపి కబురు**

**ఉద్యోగ సంఘాలతో సీఎం చంద్రబాబు సమావేశం**


**పలు కీలక డిమాండ్లకు సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం**

**12వ పీఆర్సీ ఏర్పాటుకు, రెండు డీఏల విడుదలకు అంగీకారం**

**సరెండర్ లీవులు, అదనపు పెన్షన్ క్వాంటంపై కీలక నిర్ణయాలు**

**ప్రభుత్వంపై ఏటా రూ. 2880 కోట్ల అదనపు భారం**

**అమరావతి (సింగిడి)**



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగులకు ముఖ్యమంత్రి చంద్రబాబు శుభవార్త అందించారు. ఉద్యోగులు ప్రభుత్వంలో భాగమని, వారికి అన్ని విధాలా అండగా నిలుస్తామని స్పష్టం చేసిన ఆయన, వారి దీర్ఘకాలిక డిమాండ్లపై సానుకూలంగా స్పందించారు. శనివారం వివిధ ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో సమావేశమైన సీఎం, పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ నిర్ణయాల ద్వారా ప్రభుత్వంపై ఏటా రూ.2,880 కోట్ల అదనపు భారం పడనుందని సీఎం కార్యాలయం వెల్లడించింది.

**ఉద్యోగ సంఘాల నేతలతో జరిగిన చర్చల అనంతరం ప్రభుత్వం తీసుకున్న ముఖ్య నిర్ణయాలు ఇవే:**

12వ పీఆర్సీ (PRC): ఉద్యోగులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న 12వ వేతన సవరణ సంఘం (పీఆర్సీ) నియామకానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదం తెలిపారు.

డీఏల చెల్లింపు: 2024 జూలై 1, 2025 జనవరి 1 తేదీలకు చెందిన రెండు కరువు భత్యం (డీఏ) బకాయిలను 2026 అక్టోబర్ 1 నుంచి చెల్లించాలని నిర్ణయించారు.

సరెండర్ లీవులు: 2022 సంవత్సరానికి సంబంధించిన సరెండర్ లీవుల మొత్తాన్ని వచ్చే సంక్రాంతి నాటికి ఉద్యోగుల ఖాతాల్లో జమ చేయడానికి అంగీకరించారు.

పోలీసులకు అదనపు లీవ్: పోలీసు సిబ్బందికి ఒక అదనపు సరెండర్ లీవ్‌ను ఈ దసరా పండుగకు చెల్లించాలని నిర్ణయం తీసుకున్నారు.

అదనపు పెన్షన్: అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్‌ను 2027 జనవరి నుంచి అమలు చేయనున్నారు. దీని ప్రకారం, 70 ఏళ్లు దాటిన వారికి 10 శాతం, 75 ఏళ్లు దాటిన వారికి 15 శాతం అదనపు పెన్షన్ లభిస్తుంది.

ఉద్యోగుల ఆరోగ్య పథకం (EHS): ఈహెచ్ఎస్‌ను మరింత పటిష్ఠం చేయాలని, వచ్చే నెల నుంచే ప్రతినెలా బిల్లుల చెల్లింపులను ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్‌కు ప్రభుత్వం నేరుగా చెల్లించాలని నిర్ణయించారు.

ఈ సమావేశంలో ఉద్యోగ సంఘాల నేతలు తమ సమస్యలను సీఎం దృష్టికి తీసుకురాగా, ఆయన సానుకూలంగా స్పందించారు. ఉద్యోగుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. ఈ మేరకు తీసుకున్న నిర్ణయాలను ముఖ్యమంత్రి కార్యాలయం సోషల్ మీడియా ద్వారా అధికారికంగా ప్రకటించింది. దీంతో ప్రభుత్వ ఉద్యోగుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

# మా పార్టీ డస్ట్ బిన్ కాదు

బీజేపీ చెత్తకుప్ప కాదని ఓ రేంజ్ లో ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ పార్టీ సంక్షోభం ముదురుతున్న తరుణంలో, ప్రతి ఊహాజనిత రాజకీయ కథనంలోకి బీజేపీని లాగడానికి మీడియా ఎందుకంత ఆత్రుత చూపుతోందని ప్రశ్నించారు. ఇది కాంగ్రెస్ సమస్యలను మొగ్గలోనే తుంచేయడానికి సహాయపడే ప్రయత్నమా అంటూ మండిపడ్డారు. తెలంగాణ బీజేపీ అసంతృప్త నాయకులకు డంపింగ్ యార్డ్ గా మారకుండా సంస్కృతి, నైతికత మరియు రాజకీయ విషయాల్లో కాంగ్రెస్ మరియు బీజేపీ పార్టీలకు ప్రత్యామ్నాయంగా ఎదగాలని కోరుకుంటుందని తెలిపారు. మురళీధర్ రావు చేసిన కామెంట్స్ ఇప్పుడు హాట్ టాపిక్ గా మారాయి. మరోవైపు కొండా దంపతులు సైతం ఇప్పటి వరకు పార్టీ మార్పుపై ఎలాంటి ప్రకటన చేయలేదు. అయినప్పటికీ గతంలో వారు బీఆర్ఎస్ ను విభేదించి కాంగ్రెస్ పార్టీలోకి రావడంతో ఇప్పుడు బీజేపీలోకే వెళ్లే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## బీఎల్ఏ దాడిలో 25 మంది పాక్ సైనికులు మృతి



దీంతో బెలూచిస్తాన్ ప్రాంతంలో మరోసారి ఉద్రిక్తత నెలకొంది. ఈ ఘటనకు సంబంధించిన వీడియోను కూడా బీఎల్ఏ రిలీజ్ చేసింది. బీఎల్ఏకు చెందిన ఫతేహ్ స్క్వాడ్ ఈ దాడి చేసినట్లు ప్రకటించింది. శుక్రవారం జియారత్ క్రాస్ వద్ద పాక్ మిలిటరీ కాన్వాయ్‌కు చెందిన రెండు వాహనాలు వెళ్తుండగా బీఎల్ఏ దాడి చేసింది. ఈ ఘటనలో 18 మంది పాక్ సైనికులు మరణించగా, మరికొందరు గాయపడ్డారు. ఫతేహ్ స్క్వాడ్.. బీఎల్ఏలో చాలా బలమైన సాయుధ రెబల్ గ్రూప్. బెలూచిస్తాన్ పర్వత ప్రాంతాల్లో, గెరిల్లా తరహా మెరుపు దాడులు చేయగల సామర్థ్యం ఈ గ్రూప్ సొంతం. ప్రమాదకరమైన దాడుల్ని ఈ గ్రూప్ చేపడుతుంది. గత ఏడాది మార్చిలో జాఫర్ ఎక్స్‌ప్రెస్‌ను హైజాక్ చేసింది కూడా ఈ గ్రూపే. మరో ఘటన సూరబ్ పరిధిలోని హజికా ప్రాంతంలో జరిగింది. బీఎల్ఏకు చెందిన ఎస్టీఓఎస్ గ్రూపు పాక్ సైన్యంపై దాడి చేసింది. రిమోట్ కంట్రోల్ వాహనంతో దాడి చేయగా, ఏడుగురు సైనికులు మరణించారు. ఈ రెండు దాడులపై పాక్ నుంచి ఎలాంటి ప్రకటనా రాలేదు. ఈ ఘటనలు పాక్ సైన్యం వైఫల్యంగా అక్కడి విశ్లేషకులు చెబుతున్నారు. ముఖ్యంగా పాక్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ వైఫల్యంగా స్థానికులు ఆరోపిస్తున్నారు.

పాక్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బెలూచిస్తాన్‌లో కొంతకాలంగా ఆందోళనలు జరుగుతున్నాయి. బలూచ్ పౌరులు తమను తాము స్వతంత్ర దేశంగా ప్రకటించుకున్నారు. పాక్ ప్రభుత్వం నుంచి విముక్తి కావాలని కోరుకుంటూ పోరాటం చేస్తున్నారు. అయితే, పాక్ ప్రభుత్వం మాత్రం ఈ ఉద్యమాన్ని తీవ్రంగా అణిచివేస్తోంది.

# ఫ్యూచర్ సిటీలో టీసీఎస్ భారీ పెట్టుబడి

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ఏఐ మోడల్స్, కంప్యూటింగ్ సామర్థ్యం భవిష్యత్తులో కీలక ప్రజా మౌలిక వసతులుగా మారనున్న తరుణంలో ఆ సామర్థ్యం తెలంగాణలోనే అందుబాటులో ఉండటం రాష్ట్రానికి గొప్ప ప్రయోజనమని అన్నారు. తెలంగాణలో భారీ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన టీసీఎస్ ప్రతినిధులను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అభినందించారు. ప్రభుత్వం తరఫున తగిన సహాయ సహకారాలు అందిస్తామని ప్రకటించారు. టీసీఎస్ తీసుకున్న ఈ నిర్ణయంతో తన కల నెరవేరిందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఆశించిన విధంగా ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి బలమైన పునాది పడిందని అన్నారు. తెలంగాణ రైజింగ్ విజన్-2047 ప్రకారం 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యాన్ని సాధించే దిశగా ఈ ప్రాజెక్టు కీలక ముందడుగు అని అభివర్ణించారు.

**రూ.70 వేల కోట్ల ఇన్వెస్ట్ మెంట్.. 7 వేల ఉద్యోగాలు:**

హైదరాబాద్‌లో 250 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో 1 గిగావాట్ సామర్థ్యంతో ఈ అత్యాధునిక ఏఐ డేటా సెంటర్ క్యాంపస్‌ను అభివృద్ధి చేయనున్నారు. హైపర్ వాల్ట్ తో పాటు భాగస్వామ్య సంస్థలు ఈ ప్రాజెక్టు నిర్మాణం, నిర్వహణకు దాదాపు రూ.70 వేల కోట్లు పెట్టుబడి పెట్టనున్నాయి. ఈ ప్రాజెక్టుతో ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 7 వేల ఉద్యోగాలు అందుబాటులోకి రానున్నాయి. ప్రపంచంలోని అగ్రశ్రేణి ఏఐ కంపెనీలు, హైపర్‌స్కేలర్లు, గ్లోబల్ ఎంటర్‌ప్రైజెస్‌కు అవసరమైన భారీ కంప్యూటింగ్ మౌలిక వసతులను ఈ క్యాంపస్ అందించనుంది. అధిక సామర్థ్యమున్న కంప్యూటింగ్ వ్యవస్థలు, లిక్విడ్ కూలింగ్ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఈ కేంద్రాన్ని తీర్చిదిద్దనున్నారు. దేశంలోని అత్యంత అధునాతన, అతిపెద్ద ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ క్యాంపస్‌లలో ఇది ఒకటిగా నిలవనుంది.



**దావోస్ లో చర్చల ఫలితం:**

ఈ భారీ పెట్టుబడి ద్వారా ఏఐ, డేటా సెంటర్ల రంగంతో పాటు విద్యుత్, కూలింగ్, నెట్‌వర్కింగ్, నిర్మాణం, ఇంజినీరింగ్, ఆపరేషన్స్ వంటి అనుబంధ రంగాల్లో కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయి. పర్యావరణానికి అనుకూలంగా గ్రీన్ ఎనర్జీ, వాటర్-న్యూట్రల్ డిజైన్‌తో ఈ క్యాంపస్‌ను అభివృద్ధి చేయనున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన చర్చలకు 2026 జనవరిలో దావోస్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టాటా సన్స్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ మధ్య జరిగిన సమావేశం నాంది పలికింది. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం, టీసీఎస్ ప్రతినిధులతో పలుమార్లు చర్చలు జరిపి కొద్ది నెలల్లోనే ప్రాజెక్టును కార్యరూపంలోకి తీసుకొచ్చాయి. దేశంలోని మరో ఐదు రాష్ట్రాల నుంచి పోటీ ఉన్నప్పటికీ తెలంగాణ ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును సాధించింది. ఈ ప్రాజెక్టుతో హైదరాబాద్‌ను గ్లోబల్ ఏఐ, డేటా సెంటర్ హబ్‌గా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యం మరింత చేరువైంది.

ఈభేటీలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, టీసీఎస్ సీఈఓ కె. కృతివాసన్, సీఓఓ ఆర్తి సుబ్రమణియన్, హైపర్ వాల్ట్ ప్రెసిడెంట్ వి. రాజన్న, హైపర్ వాల్ట్ సీఈఓ, ఎండీ దీపేష్ నందా సమావేశంలో పాల్గొన్నారు. అమెరికా నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఓపెన్ ఏఐ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ ఉదయ్ రుద్రరాజు సమావేశంలో పాల్గొన్నారు.



## కమీషన్ల కోసం కొట్టుకుంటున్న మంత్రులు

ప్రధాని మోదీనే గడగడలాడించిన తెలంగాణ యువశక్తికి రేవంత్ రెడ్డి ఓ లెక్కే కాదన్నారు. ఎన్నికల ముందు యూత్ డిక్లరేషన్ పేరిట పెద్ద పెద్ద మాటలు చెప్పిన కాంగ్రెస్ నేతలు, అధికారంలోకి వచ్చాక ఉద్యోగాలు ఇవ్వడం మానేసి లూటీ ఫికేషన్‌లు నడుపుతున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే పదవికి కేసీఆర్ రాజీనామా చేయాలంటున్న కాంగ్రెస్ నేతలకు కేటీఆర్ కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చిన కేసీఆర్ రాజీనామా చేయాలా, లేక ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను వంచించిన రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలా అని ప్రశ్నించారు. ప్రజలకు చేసిన 420 రకాల మోసాలకు గానూ రేవంత్ రెడ్డి 420 సార్లు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేవలం ఒక్క మంత్రిని బర్తరఫ్ చేయడం కాదని, త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వాన్నే బర్తరఫ్ చేసే రోజులు రాబోతున్నాయని హెచ్చరించారు. మంత్రులు కమీషన్ల కోసం కొట్టుకుంటున్నారని, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తమ ప్రభుత్వం 2.32 లక్షల ఉద్యోగాలు ఇస్తే, ఈ వెయ్యి రోజుల్లో కాంగ్రెస్ ఇచ్చినవి కేవలం 16 వేల ఉద్యోగాలేనని చెప్పారు. ఉద్యోగాల కల్పనపై బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు.

## రాజకీయాలకు అయ్యన్న గుడ్‌బై

ఏపీ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తన పుట్టినరోజు సందర్భంగా సంచలన ప్రకటన చేశారు. ఇకపై తాను రాజకీయాల నుండి శాశ్వతంగా తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో తాను పోటీ చేయబోనని స్పష్టం చేశారు. నర్సీపట్నంలో జరిగిన తన పుట్టినరోజు వేడుకల సందర్భంగా ఆయన మాట్లాడారు. తనకు 70ఏళ్ల వయసు వచ్చిందని, ఇకపై రాజకీయాల్లో తిరగలేనని అన్నారు. భవిష్యత్తులో ఎన్నికల్లో పోటీ చేయనని స్పష్టం చేశారు. వయసు పెరిగిపోయిందని ఇకపై విశ్రాంతి తీసుకుంటానని చెప్పారు. తన పదవీ కాలం మరో మూడేళ్లు మాత్రమే ఉందని అన్నారు. ఈ మూడేళ్ల కాలంలో నియోజకవర్గంలో పనులు, అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేయడానికి ప్రాధాన్యమిస్తానని ప్రకటించారు. ఇదిలా ఉంటే ఏపీ రాజకీయాల్లో అయ్యన్నపాత్రుడు కీలకనేతగా ఎదిగారు. నర్సీపట్నం అసెంబ్లీ నియోజకవర్గం నుండి ఏడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. 1983లో మొదటిసారి అసెంబ్లీ ఎన్నికల్లో చేసి గెలిచారు. అంతేకాకుండా రాజకీయాల్లోకి వచ్చిన తరవాత టీడీపీలో చేరిన ఆయన ఇప్పటికీ అదే పార్టీలో కొనసాగుతున్నారు.

## రేవంత్ రెడ్డి ఇంటికి ఒక న్యాయం.. ప్రజలకు మరో న్యాయమా?

**రఘునందన్ రావు**

**హైదరాబాద్, సెప్టెంబర్ 5 (సింగిడి)**

రూపాయి రూపాయి కూడబెట్టుకుని నిర్మించుకున్న ఇళ్లను రాత్రికి రాత్రి 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడం రేవంత్ రెడ్డి ప్రభుత్వ దారుణ నిర్ణయమని మెదక్ ఎంపీ రఘునందన్ రావు మండిపడ్డారు. పటాన్‌చెరు నియోజకవర్గంలోని సింఫనీ పార్క్ హోమ్స్ కాలనీలో 22ఏ భూముల సమస్యపై ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. అన్ని ప్రభుత్వ శాఖల అనుమతులతో 55 ఎకరాల్లో 1,500 ఇళ్ల నిర్మాణం జరిగి 12 ఏళ్లు గడుస్తోందని... ఇప్పుడు ఉన్నట్టుండి ఆ ఇళ్లను నిషేధిత జాబితాలో పెట్టడంపై కాలనీవాసులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని చెప్పారు. బాధితుల పక్షాన పోరాడతానని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన నివాసాన్ని ఏ దరఖాస్తు ఆధారంగా 22ఏ జాబితా నుంచి తొలగించారో, అదే నిబంధనలను సామాన్య ప్రజల ఆస్తులకు కూడా వర్తింపజేసి వెంటనే తొలగించాలని ఎంపీ రఘునందన్ రావు సూటిగా నిలదీశారు. కేవలం సాంకేతిక తప్పు జరిగిందని రెవెన్యూ మంత్రి క్షమాపణలు చెబితే సరిపోదని, తక్షణమే ఆ తప్పును సరిదిద్ది ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

ప్రభాతనవ సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
ఆదివారం 06-9-2026

## రోడ్డును ఆక్రమిస్తే ఊరుకునేది లేదు: ఎమ్మెల్సీ డాక్టర్ చిన్నమైల్ అంజిరెడ్డి



**రామచంద్రాపురం, సెప్టెంబర్ 5 (సింగిడి):** ప్రజా రహదారులను ఆక్రమిస్తే సహించే ప్రసక్తే లేదని ఎమ్మెల్సీ డాక్టర్ చిన్నమైల్ అంజిరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సంగారెడ్డి జిల్లా బీహెచ్ఈఎల్ పరిధిలోని మాక్స్ సొసైటీ రోడ్డు ఆక్రమణ వివాదంపై ఆయన ఘాటుగా స్పందించారు. 1999లో బీహెచ్ఈఎల్ రిటైర్డ్ ఉద్యోగులు ఏపీఐఐసీ నుంచి కొనుగోలు చేసిన ఇళ్ల స్థలాలకు సంబంధించి, హెచ్ఎండీఏ ఆమోదంతో 60 అడుగుల రోడ్డును కేటాయించారు. గత మూడు దశాబ్దాలుగా ప్రజలు రాకపోకలు సాగిస్తున్న ఈ మార్గంలో, ఇటీవల బీహెచ్ఈఎల్ అధికారులు హఠాత్తుగా రోడ్డు మధ్యలో ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. దీంతో స్థానిక కాలనీవాసులకు రాకపోకలు నిలిచిపోయి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమస్యను స్థానికులు ఎమ్మెల్సీ డాక్టర్ చిన్నమైల్ అంజిరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం జీహెచ్ఎంసీ డీసీ ప్రదీప్ కుమార్‌తో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు. ప్రజల రాకపోకలకు కేటాయించిన ప్రభుత్వ రోడ్డును ఆక్రమించడం చట్టవిరుద్ధమని, వెంటనే అధికారులు చర్యలు చేపట్టి ఆ స్థలాన్ని ప్రజలకు అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. అంతేకాకుండా రోడ్డు ఆక్రమణకు పాల్పడిన బాధ్యులపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని స్థానికులకు సూచించారు.

## అభివృద్ధిలో సంక్షేమ సంఘాలకు సహాయ సహకారాలు ఉంటాయి

- బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే వివేకానంద



**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 5(సింగిడి):** కుత్బుల్లాపూర్ డివిజన్ శ్రీనివాస్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన సంక్షేమ సంఘం సభ్యులు బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీ అభివృద్ధిలో సంక్షేమ సంఘాలకు నా సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు ఈశ్వర్ గౌడ్, కమిటీ సభ్యులు విలాస్ రావు, నర్సాగౌడ్, కృష్ణయ్య, ప్రభు, కృష్ణమోహన్, సత్తిరెడ్డి, వెంకటేష్, మురళి, శంకర్, మల్లికార్జున్, రామకృష్ణంరాజు పాల్గొన్నారు.

## ధర్మ పరిరక్షణకు ప్రతీక శ్రీకృష్ణుడు

నీలం మధు ముదిరాజ్



**పటాన్చెరు, సెప్టెంబర్ 5(సింగిడి):** ధర్మ పరిరక్షణకు, సత్యానికి ప్రతీక శ్రీకృష్ణ పరమాత్ముడని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్ అన్నారు. శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ఇస్నాపూర్ మున్సిపాలిటీ తో పాటు పటాన్ చెరు పట్టణంలో మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, కాంగ్రెస్ నాయకుడు దేవరాజ్ నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొని భక్తులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల ప్రాంగణంలో శ్రీ కృష్ణ నామస్మరణలు, భజనలు, భక్తుల సందడితో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ సందర్భంగా నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ, భగవద్గీతలో శ్రీకృష్ణుడు బోధించిన జీవన విలువలు ప్రతి ఒక్కరికీ మార్గదర్శకమని పేర్కొన్నారు. ప్రేమ, సేవాభావం, పరస్పర గౌరవం వంటి విలువలను పెంపొందించే పండుగలు సమాజంలో ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు ఈ కార్యక్రమాలలో కౌన్సిలర్లు నారాయణదాసు, మన్నె రాఘవేంద్ర, సంపత్, సంగన్నగారి గోపాల్,సందీప్ గౌడ్, దస్తగిరి, నాయకులు రవి, శ్రీను, మెట్టు రాజు ,భరత్, అత్తర్ , సాయి, ఉత్సవ నిర్వాహకులు, భక్తులు, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకృష్ణుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలి

మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్





**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 5(సింగిడి):** శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదిన వేడుకలు కుత్బుల్లాపూర్ నియోజక వర్గం గణేష్ నగర్ డివిజన్‌లోని చెరుకుపల్లి కాలనీ, పాపయ్య నగర్ ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. కృష్ణాష్టమి వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. చెరుకుపల్లి కాలనీలో వంశీకృష్ణ యాదవ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 32 సంవత్సరాలు నుండి నిర్వహిస్తున్న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం శ్రీకృష్ణ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పాపయ్య యాదవ్ నగర్ లో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకల్లోనూ కూన శ్రీశైలం గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై శ్రీకృష్ణ స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకృష్ణ పరమాత్మ ఆశీస్సులు ప్రతి కుటుంబంపై ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, శాంతియుతమైన జీవితం గడపాలని ఆకాంక్షించారు. సమాజంలో ఐక్యత, సోదరభావం, పరస్పర సహకారం మరింత బలపడాలని, సంస్కృతి సాంప్రదాయాన్ని భవిష్యత్తు తరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ దైవభక్తి మార్గంలో నడవాలని సూచించారు. శ్రీకృష్ణుడి రూపంలో వేషధారణ ధరించిన బాలలతో పాటు కూచిపూడి నృత్యాలు ప్రదర్శించిన చిన్నారులను కూన శ్రీశైలం గౌడ్ ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యేను ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక కాంగ్రెస్ నాయకులు గడ్డం రాజేందర్ రెడ్డి, కృష్ణ యాదవ్, వెంకటేష్ యాదవ్, లింగం యాదవ్, ఉత్సవ కమిటీ సభ్యులు కోటేశ్వరరావు,ఎంవీ రావు, జెపి కుమార్, కిషోర్,సురేష్ మరియు పాపయ్య నగర్ కమిటీ సభ్యులు రంగనాథ్, వెంకట్ రావు శ్రీనివాస్ రావు, తిరుమల రాజ్, గాజుల శ్రీనివాస్ లతో పాటు భక్తులు, మహిళలు పాల్గొన్నారు.



# అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం

- ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి





**వికారాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 5(సింగిడి):** కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా పరిగి నియోజకవర్గంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పరిగిలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ ఎమ్మెల్యే డా. టి. రామ్మోహన్ రెడ్డి వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేదలు, రైతులు, మహిళలు, యువత, మైనారిటీలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ ప్రజా పాలన కొనసాగిస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. పరిగి నియోజకవర్గంలో ఇప్పటికే 3,500 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తికాగా, మరో 2,500 ఇళ్లు మంజూరయ్యాయని, మొత్తం 6,000 ఇళ్ల ద్వారా పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేస్తున్నామని చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని ఇందిరమ్మ ఇళ్లు తీసుకువచ్చేందుకు ముఖ్యమంత్రి గారిని కోరుతున్నట్లు తెలిపారు. రైతులకు ఇచ్చిన హామీ మేరకు రూ 2 లక్షల వరకు రుణమాఫీ అమలు చేసి, పరిగి నియోజకవర్గ రైతులకు సుమారు రూ 300 కోట్ల రుణమాఫీ జరిగిందని పేర్కొన్నారు. అదేవిధంగా రేషన్ కార్డుల ద్వారా పేద కుటుంబాలకు నాణ్యమైన సన్నబియ్యం అందించడం, అర్హులైన వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు పెన్షన్లు అందించే కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. నియోజకవర్గంలో సాగునీటి ప్రాజెక్టులు, రహదారులు, రైల్వే, విద్యుత్, వైద్యం, విద్య, పరిశ్రమలు వంటి అన్ని రంగాలను సమగ్రంగా అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. కొందుర్గ్, పరిగి, లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు భూసేకరణకు రూ 587 కోట్లు, పరిగి ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి సుమారు రూ 28 కోట్లు, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు రూ 200 కోట్లు, పరిగి పట్టణ అభివృద్ధికి, రహదారులకు భారీగా నిధులు మంజూరయ్యాయని తెలిపారు. పరిగి, వికారాబాద్, పరిగి, షాద్‌నగర్ రహదారుల అభివృద్ధి, హ్యాం రోడ్ల పనులు, వివిధ గ్రామాల్లో డబుల్ రోడ్లు, బ్రిడ్జిలు, కల్వర్టుల నిర్మాణం కొనసాగుతున్నాయని చెప్పారు. నియోజకవర్గంలో భవిష్యత్ తరాలకు విద్యుత్ సమస్యలు లేకుండా 220 కేవి, 33/11 కే వి సబ్‌స్టేషన్ల నిర్మాణానికి చర్యలు తీసుకున్నామని తెలిపారు. జాఫర్‌పల్లి, తుంకులగడ్డ, నస్కల్, పరిగి తదితర ప్రాంతాల్లో విద్యుత్ మౌలిక వసతుల పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. పరిగి ప్రజల చిరకాల కోరిక అయిన రైల్వే లైన్ కోసం సర్వే పనులు పూర్తయ్యాయని, వికారాబాద్, నస్కల్, పరిగి, కొడంగల్, నారాయణపేట రైల్వే మార్గాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. అదేవిధంగా రీజినల్ రింగ్ రోడ్, శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు మెరుగైన రహదారి అనుసంధానం ద్వారా పరిగి ప్రాంతానికి రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడతాయని చెప్పారు. పరిగి నియోజకవర్గంలో సుమారు రూ 3,000 కోట్ల నేవీ ప్రాజెక్టు రావడం గర్వకారణమని, దీనివల్ల ప్రాంత అభివృద్ధితో పాటు యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. తనను పరిగి ప్రజలు ఒక అన్నగా, తమ్ముడిగా భావించి అందిస్తున్న ప్రేమ, గౌరవం, సహకారాన్ని మరువబోనని అందుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు నాపై ఉంచిన నమ్మకాన్ని ఎప్పటికీ వమ్ము చేయను. ప్రజలకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా, ఎలాంటి సమస్య ఉన్నా నా వంతు సహాయం అందించడానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాను. పరిగి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, రాబోయే తరాలకు మంచి భవిష్యత్తును అందించడమే నా లక్ష్యమని ఆయన తెలిపారు.

## కాంగ్రెస్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయి

మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి



**వికారాబాద్ సెప్టెంబర్ 5(సింగిడి):** కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని అందుకు ప్రజలు ప్రతీకారం తీర్చుకునే అవకాశం కోసం నిరీక్షిస్తున్నారని మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే పి సబితా ఇంద్రారెడ్డి, తాండూర్ మాజీ ఎమ్మెల్యే ఫైలెట్ రోహిత్ రెడ్డి, పరిగి మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డి, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ తదితర నాయకులు అన్నారు. బి ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే టి ఆర్ ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమాలు శుక్రవారం కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని ఆయా పట్టణాలలో నిర్వహించిన కార్యక్రకమాల్లో వారు మాట్లాడుతూ. అధికారంకోసం అమలు కానీ హామీలు గుప్పించి అన్ని వర్గాలను ఆకట్టుకున్న కాంగ్రెస్ పార్టీని నమ్మిన ప్రజలు అధికారం కట్టబెడితే హామీలను తుగలొ తొక్కి 420 హామీలను ఆటక కేక్కించారని వారు విమర్శించారు. మహిళలకు 2500 రూపాయలు ఆర్థిక సహాయం, యువతులకు స్కూటీలు అందిస్తామని నమ్మించి వారిని ప్రభుత్వం మోసం చేసిందనారు. ఫ్రీబస్సు పేరిట మహిళకు ఇచ్చి చార్జిలను పెంచి ఇద్దరి చార్జీ లను పురుషుల వద్ద వాసులు చేస్తున్నట్లు వారు చెప్పారు. 500 రూపాయలకేవంట గ్యాస్ అందిస్తామని నమ్మబలికి వెయ్యి రూపాయలకు పైగా వసూలు చేస్తున్నారని అన్నారు. మహిళలకు అంధించే కే సీ ఆర్ కిట్టులో ఏ లోపమున్నదని రద్దు ప్రభుత్వం రద్దు చేసిందో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. న్యూట్రిసియాన్ పథకం విషయంలో అదే జరిగిందని అన్నారు. మహిళలకు గత ప్రభుత్వం చేస్తున్న సేవలను రద్దు చేయడం సిగ్గుచేటని అన్నారు. ప్రజలందరూ అన్ని గమనిస్తున్నారని తగిన మూల్యం చెల్లించడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఆసరా పింఛన్ల ను పెంచి ఇస్తమని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నవాటిని సక్రమంగా ఇవ్వలేని దుస్థితిలో ఉందని వారు దుయ్యాబట్టారు. ఆడబిడ్డల కోసం దేశంలో ఎక్కడ లేనివిధంగా కల్యాణ లక్ష్మీ, షాదీ ముబార్ పథకం ద్వారా అదనంగా తులం బంగారం అందించనున్నట్లు ప్రజలను మభ్యపెట్టి నేడు ప్రభుత్వం నోరు ఎల్లబెట్టిందని వారు ఎద్దేవాచేశారు. రైతుల విషయంలో ప్రభుత్వం ఘోరంగా ఫిలమైయిందని అన్నారు. ఎరువుల కోసం అన్నదాతలు మరోసారి రోడ్డు ఎక్కాల్సిన దుస్థితిని కాంగ్రెస్ ప్రభుత్వం పునఃరానావృతం చేసిందని అన్నారు. గత ప్రభుత్వం రైతులకు కావాల్సిన ఎరువులను ఎక్కగట్టి ముందస్తుగానే నిలువలు ఏర్పాటు చేసిన ఘనత ఉన్నదని అన్నారు. నేడు బస్తా యూరియాకోసం నరకయాతన పడుతున్న దైనంధిత పరిస్థితిలో ఉన్నారని అన్నారు. రైతులకు రైతు భరోసా అధికంగా అందిస్తామని నమ్మించి గతంలో అందించిన సహాయాన్ని కూడా సమయానికి అందించలేని దీనస్థితి ప్రభుత్వానిదని వారు అన్నారు. ఇటీవల రాష్ట్ర రాజకీయాల్లో చోటు చేసుకున్న మంత్రి కొండా సురేఖ విషయాన్ని విలేకరులు మర్పల్లి సమావేశంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డితో ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో ఆమె స్పందిస్తూ మహిళా నాయకులను గౌరవించి ముందు వరుసలో కూర్చోబెడతానని నమ్మబలికిన ముఖ్యమంత్రి రాఖీ కట్టించుకున్న కొండా సురేఖకు భర్తరాఫ్ గిఫ్ట్ ఇచ్చారని అన్నారు. ఈ పర్యవసానం కూడా ఊరికే పోదని ఆమె అన్నారు. ఈ కార్యక్రమాల్లో బి ఆర్ ఎస్ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గం, మండల, గ్రామ, బూత్ స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెలంగాణ రాబిన్ హుడ్ పండగ సాయన్న

నీలం మధు ముదిరాజ్..



**పటాన్చెరు, సెప్టెంబర్ 5(సింగిడి):** తెలంగాణ రాష్ట్ర రాబిన్ హుడ్, పేద ప్రజల ఆకలి తీర్చిన మహానుభావుడు పండగ సాయన్న అని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ ఇంచార్జ్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రం నుంచి విచ్చేసిన నాయకులు, నాగర్‌కర్నూల్ పట్టణంలో పండగ సాయన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలనే ముదిరాజ్ సమాజం చిరకాల కోరికను ఆయన దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించిన ఆయన 5,00,000/- (ఐదు లక్షల) విరాళం ప్రకటించి ఈ రోజు రెండు లక్షల రూపాయల విలువచేసే చెక్కును నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా నీలం మాట్లాడుతూ పండుగ సాయన్న ఆశయాలు, పోరాట స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లేందుకు అందరూ కృషి చేశానని ఆయన పేర్కొన్నారు,అలాగే, ముదిరాజ్ సమాజం చిరకాలంగా కోరుతున్న బీసీ--ఏ వర్గీకరణ సాధన కోసం అందరం ఐక్యంగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ముదిరాజ్ సమాజం న్యాయమైన డిమాండ్ల సాధనకు తన పూర్తి సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని నీలం మధు ముదిరాజ్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ మల్లికార్జున్, సుంకరబోయిన మహేష్, వాకిటి ఆంజనేయులు, ధనంజయ్, తిరుపతయ్యా, బాబు, నర్సయ్య, నిరంజన్, నరసింహ, లక్ష్మయ్య, రుద్రయ్య, శంకర్, చెనకేశువులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నోటీసులు కాదు.. మౌలిక వసతులు కల్పించాలి

- అసెంబ్లీలో సమస్యలు ప్రస్తావిస్తా
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- ప్రజల పక్షాన పోరాటం ఆగదు
- నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి




**రామచంద్రపురం, సెప్టెంబర్ 5(సింగిడి):** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు, కొల్లూరు కేసీఆర్ నగర్ ఒకటి, రెండు, మూడు విడతల ఆవాసాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని కొల్లూరు కేసీఆర్ నగర్ రెండవ విడత రెండు పడకల గదుల (డబుల్ బెడ్‌రూమ్) ప్రధాన ద్వారం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ వెన్నవరం ఆదర్శ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెన్నవరం ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ, నివాసితులకు నోటీసులు జారీ చేసి వేధించడం మానుకొని రోడ్లు, మురుగునీటి కాల్వలు, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి కనీస వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. చిరు వ్యాపారుల జీవనోపాధిని దెబ్బతీయకుండా 'మా దుకాణాలు మాకే' అన్న న్యాయమైన విజ్ఞప్తిని పరిష్కరించాలన్నారు. కేసీఆర్ నగర్‌లో పాఠశాల, జూనియర్ కళాశాల, అంగన్‌వాడీ కేంద్రాలు, 200 పడకల ఆసుపత్రి, రైతు బజారు, బస్ భవన్, శ్మశాన వాటిక వంటి సదుపాయాలు సమకూర్చాలని, మురుగునీటి శుద్ధి కేంద్రం నిర్వహణ బాధ్యతను ప్రభుత్వమే చేపట్టాలని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలు పరిష్కరించకపోతే బీఆర్ఎస్ పార్టీ తరఫున ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ, కేసీఆర్ నగర్ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను రానున్న శాసనసభ సమావేశాల్లో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి గట్టిగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే ప్రజలపై పడిన మంచినీటి పన్నుల భారాన్ని రద్దు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ నిరసన కార్యక్రమంలో అమీన్పూర్ మాజీ ఎంపీపీ దేవానంద్, మాజీ జెడ్పీటీసి సుధాకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శ్రీపాల్ రెడ్డి, వెంకట్ రెడ్డి,కోటి హర్ష, కొల్లూరు గోపాల్, కార్యకర్తలు, స్థానిక కాలనీల ప్రజలు, చిరు వ్యాపారులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను పరిశీలించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**కొడంగల్, సెప్టెంబర్ 5(సింగిడి):** కొడంగల్ నియోజకవర్గ పర్యటనలో భాగంగా గోకాఫస్లాబాద్ లో 25 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మాణం చేపడుతున్న బీ.సీ. రెసిడెన్షియల్ పాఠశాల, దౌల్తాబాద్ మండల కేంద్రంలో 4.80 కోట్ల రూపాయల వ్యయంతో చేపడుతున్న జూనియర్ కళాశాల పనులను క్షేత్రస్థాయిలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పరిశీలించారు. ముందుగా రాష్ట్ర ముఖ్యమంత్రికి గోకాపస్లాబాద్ హెలిపాడ్ వద్ద ... జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, డిఐజి చందన దీప్తి, ఇన్చార్జ్ ఎస్పి పారితోష్ పంకజ్, అడిషనల్ ఎస్పీ రాజేష్ మీనా, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టూరు, కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి లు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. బీ.సీ. రెసిడెన్షియల్ పాఠశాల, జూనియర్ కళాశాల పనులను పరిశీలించే క్రమంలో నిర్మాణ పనుల్లో ఎలాంటి లోపాలు లేకుండా నాణ్యవంతంగా పటిష్టంగా పనులను చేపట్టాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనలో తాండూర్ శాసనసభ్యులు బుయ్యాని మనోహర్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతితులు ఉన్నారు.

## కొరివి కృష్ణస్వామి జయంతి ఉత్సవాలు



**కొల్చారం, సెప్టెంబర్ 5(సింగిడి):** మండల కేంద్రమైన కొల్చారంలో కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ 133వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. దేశంలో అట్టడుగు స్థాయిలో ఉన్న ముదిరాజులను అభివృద్ధి చెందే విధంగా కృషి చేసిన వ్యక్తి పరువు స్వామి. 1893 సికింద్రాబాద్‌లో జన్మించడం జరిగింది. కొరివి స్వామి హైదరాబాద్ పట్టణంలోని చాదర్ఘట్లో తన విద్యాభ్యాసాన్ని పూర్తి చేశారు. తదనంతరం నిజాం కాలంలో ఇంటర్మీడియట్ విద్యాభ్యాసాన్ని పూర్తి చేసుకుని హెడ్ కానిస్టేబుల్ గా బాధ్యతలు నిర్వహిస్తూ, ప్రజలకు వివిధ సేవా కార్యావ కామాలు కూడా నిర్వహించారు. కొరి స్వామి బహుముఖ ప్రజ్ఞాశాలి మన హైదరాబాద్ రాష్ట్ర తొలి మేయర్ గా కొరివి స్వామి ముదిరాజ్ బాధ్యతలు నిర్వహించారు. దేశ ముదిరాజు లందరికీ ఆదర్శప్రాయకుడిగా మన కొరవి కృష్ణ స్వామి ముదిరాజ్ నిలిచారు. ఈ కార్యక్రమం లో సంతోష్ కుమార్ అంశాన్ని పల్లి సర్పంచ్ రమేష్, వెంకటాపూర్ ముదిరాజ్ సభ్యుడు మహిపాల్, ఎండుగుల యాదగిరి, టీచర్ యాదగిరి, చింతల యాదగిరి, ఎండుకుల శ్రీశైలం, ఎండుగుల రేనేందర్ ,రాజు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ దగా పాలనకు "వంటా వార్పుతో " సెగ పుట్టించిన బిఆర్ఎస్ శ్రేణులు

- ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మహిళలు బొంద పెట్టడం ఖాయం
- ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే వివేకానంద్





**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 5(సింగిడి):** కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం 1000 రోజుల దగా పాలనపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో వారం రోజులపాటు బిఆర్ఎస్ శ్రేణులు చేపట్టనున్న నిరసన కార్యక్రమంలో భాగంగా మూడవరోజు చేపట్టిన నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన గ్యారెంటీలను విస్మరించడానికి నిరసిస్తూ జగద్గిరిగుట్ట లాస్ట్ బస్టాప్ వద్ద మహిళా నాయకులు "వంటా వార్పు" కార్యక్రమం నిర్వహించి ప్రభుత్వానికి తమ నిరసనను తెలిపారు. ఈ వంట వార్పు కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ బిఆర్ఎస్ శ్రేణులతో కలిసి పాల్గొని మహిళలకు ఇచ్చిన గ్యారెంటీలను అమలు చేయకుండా ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్య ధోరణి, మోసపూరిత డొల్లతనాన్ని ఎండగట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారమే లక్ష్యంగా సాధ్యం కాని హామీలు, మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన రేవంత్ సర్కార్ మహిళలకు ఇచ్చిన గ్యారంటీలను విస్మరించి మహిళా లోకాన్ని మోసం చేసిందన్నారు. మహిళలకు నెలకు రూ. 2500 రూపాయలు, కళ్యాణ లక్ష్మితో పాటు తులం బంగారం, విద్యార్థినులకు స్కూటీలు అందిస్తామని చెప్పి నమ్మించి మహిళలను మోసం చేశారు. మహిళలకు ఇస్తామన్న గ్యారెంటీలను విస్మరించడమే కాక వృద్ధులకు ఇస్తామన్నా 4000/- పెన్షన్, వికలాంగులకు ఇస్తామన్న 6000/- పెన్షన్ ఏమైందని ప్రశ్నించారు. మహిళలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో మహిళలు బొంద పెట్టడం ఖాయమని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ వంటావార్పు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ అధ్యక్షులు, నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సంక్షేమ సంఘాల నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

## ఇబ్రహీంపట్నం కేంద్రంలోనే ఈఎస్ఐ వైద్య చికిత్స కేంద్రం ఏర్పాటు చేయాలి

- డిఆర్ఓకు వినతిపత్రం అందజేసిన సీపీఎం నాయకులు



**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 5(సింగిడి):** ఇబ్రహీం పట్నం నియోజకవర్గంలోని కార్మికులు, ఉద్యోగులు మరియు వారి కుటుంబ సభ్యుల వైద్య అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఈ ఎస్ ఐ వైద్య చికిత్స కేంద్రాన్ని కర్నగూడలో కాకుండా ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కేంద్రంలోనే ఏర్పాటు చేయాలని కోరుతూ రంగారెడ్డి జిల్లా డిఆర్ఓకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య మాట్లాడుతూ.. ఇబ్రహీంపట్నం నియోజక వర్గ పరిధిలో వేలాది మంది పారిశ్రామిక కార్మికులు, నిర్మాణ కార్మికులు, హమాలీలు, అసంఘటిత రంగ కార్మికులు, వివిధ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ఈ ఎస్ ఐ వైద్య సేవలపై ఆధారపడి ఉన్నారని నాయకులు తెలిపారు. ప్రస్తుతం ఈ ఎస్ ఐ వైద్య సేవల కోసం కార్మికులు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుండటంతో పనిదినాలు, వేతనాలు, సమయం కోల్పోవడంతో పాటు ప్రయాణ ఖర్చులు కూడా భరించాల్సి వస్తోందని పేర్కొన్నారు. ఈ ఎస్ ఐ డిస్పెన్సరీ ఏర్పాటు కోసం కర్నగూడలో భవనం వినియోగించే ప్రతిపాదన ఉన్నప్పటికీ, నియోజక వర్గంలోని అన్ని ప్రాంతాల ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండే ఇబ్రహీంపట్నం పట్టణంలోనే వైద్య చికిత్స కేంద్రాన్ని ఏర్పాటు చేయడం సముచితమని వారు అన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కేంద్రంలో ప్రభుత్వ ఆధీనంలో ఉన్న అనువైన భవనం లేదా స్థలాన్ని గుర్తించి ఈ ఎస్ ఐ డిస్పెన్సరీకి కేటాయించాలని కోరారు. ఈకార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి సామెల్, ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి సిహెచ్ బుగ్గరాములు జిల్లా కమిటీ సభ్యులు జగన్ పోల్కంపల్లి, సిపిఎం నాయకులు వెంకన్న, వీరన్న పాల్గొన్నారు.

ప్రభాతనవ సింగిడి ప్రతి రంగూ ఓ నిజం
Singidi
ఆదివారం 6-9-2026

# ఎడిటోరియల్

Editorial



## సర్కారు బడులకు నయా లుక్..

ప్రభుత్వ బడి గేటు దాటే ప్రతి అదనపు విద్యార్థి వెనుక ఒక కుటుంబం తీసుకున్న నిర్ణయం ఉంటుంది. తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలల పట్ల తల్లిదండ్రుల దృక్పథం మారుతోందా? అనే ప్రశ్నకు ఒక జిల్లా ఇచ్చిన సమాధానం ఆసక్తికరంగా ఉంది. అక్కడ నమోదు పెరుగుదల కేవలం సంఖ్యల విషయం కాదు. ప్రభుత్వ విద్యపై నమ్మకం పెరుగుతున్న సంకేతంగా కనిపిస్తోంది. తాజా నివేదికల ప్రకారం 2024--25లో 41,349గా ఉన్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సంఖ్య 2026--27లో 45,626కు చేరింది. 4,277 మంది పెరుగుదలతో సుమారు 10.34 శాతం వృద్ధి నమోదైంది. ఇదే కాలంలో ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ పాఠశాలలకు 4,346 మంది విద్యార్థులు మారారు. ఒక జిల్లాలోనే ఇంత మార్పు కనిపించడం, రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ విద్యపై జరుగుతున్న చర్చకు కొత్త కోణాన్ని అందిస్తోంది.

ప్రభుత్వ పాఠశాలలపై పరిపాలనా చొరవ

మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌కు 2026 సంవత్సరానికి 'విద్యా పరిపాలనలో ప్రతిభ' పురస్కారం లభించడం ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సాగిన కృషికి లభించిన ముఖ్యమైన గుర్తింపు. ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో ఆయన ఈ పురస్కారాన్ని అందుకున్నారు. విద్యార్థుల నమోదును పెంచడం, తల్లిదండ్రులను ప్రభుత్వ విద్య వైపు ఆకర్షించడం, పాఠశాలల పనితీరుపై నిరంతర పర్యవేక్షణకు ప్రాధాన్యం ఇవ్వడం వంటి అంశాలపై ఆయన చూపిన చొరవ ఫలితమిచ్చింది. ఇది ఒక వ్యక్తి విజయం కాదు. దిశానిర్దేశం ఒకరి నుంచి, అమలు అనేక చేతుల నుంచి, ఫలితం విద్యార్థుల రూపంలో కనిపించిన సమిష్టికృషి. తెలంగాణలో ప్రభుత్వపాఠశాలలను బలోపేతం చేయాలన్న లక్ష్యానికి ఇటువంటి జిల్లాస్థాయి చొరవలు ఎంత కీలకమో ఈ ఉదాహరణ స్పష్టం చేస్తోంది.

జెన్ అల్ఫా తరం.. కొత్త ప్రశ్నలు

'జెన్ అల్ఫా' అనేది అధికారిక విద్యా వర్గీకరణ కాదు. మారుతున్న సాంకేతిక, సామాజిక ప్రపంచంలో పెరుగుతున్న కొత్త తరాన్ని సూచించే పేరు. ఈ తరానికి ప్రభుత్వ బడి అంటే కేవలం ఉచిత విద్య, పుస్తకాలు, భోజనం, సదుపాయాలకే పరిమితం కాకూడదు. పిల్లలు ఏమి నేర్చుకుంటున్నాడు? ఎలా ఆలోచిస్తున్నారు? తన ఆలోచనను ఎంత స్పష్టంగా వ్యక్తీకరిస్తున్నారు? సాంకేతికతను ఎంత బాధ్యతగా ఉపయోగిస్తున్నారు? సమస్యలను పరిష్కరించే సామర్థ్యం ఎంత పెరుగుతోంది? ఇవే రేపటి విద్యా ప్రమాణాలు. దేశవ్యాప్తంగా, అలాగే తెలంగాణలో కూడా పాఠశాల విద్యపై జరుగుతున్న చర్చ ఇప్పుడు కేవలం ప్రవేశంతో ఆగడం లేదు. అభ్యసన ఫలితాలు, సమానత్వం, మౌలిక వసతులు, ఉపాధ్యాయుల లభ్యత, డిజిటల్ అనుసంధానం వంటి అంశాల వైపు విస్తరిస్తోంది.

నమ్మకం పెరిగింది.. నాణ్యతే అసలు పరీక్ష

ప్రభుత్వ పాఠశాలల వైపు విద్యార్థుల సంఖ్య పెరగడం సానుకూల పరిణామం. కానీ నమోదు పెరగడం విజయానికి తొలి సంకేతం మాత్రమే. దాన్ని నిలకడైన విద్యా ఫలితంగా మార్చడమే అసలు బాధ్యత. కొత్తగా చేరిన ప్రతి విద్యార్థి పాఠశాలలో కొనసాగుతున్నాడా? తరగతి స్థాయికి తగిన చదవడం, రాయడం, గణిత ప్రాథమికాలు సాధిస్తున్నాడా? భవిష్యత్ నైపుణ్యాలు ఎంతగా అభివృద్ధి చెందుతున్నాయి? ఇవే ఇకపై అడగాల్సిన అసలు ప్రశ్నలు. మంచిర్యాల జిల్లా నేడు తెలంగాణ సమాజానికి ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తోంది. "నమోదు సంఖ్య ప్రాథమిక తలుపు తెరిచింది.. తల్లిదండ్రుల నమ్మకం ఆ తలుపు దాటించింది.. నాణ్యమైన అభ్యసన ఫలితాలే ఆ ఎంపికను శాశ్వతంగా నిలబెట్టాలి" అప్పుడే ప్రభుత్వ బడికి అసలైన విజయసూచిక దక్కుతుంది. ఒక జిల్లాలో పరిపాలనా సంకల్పంతో సాధ్యమైన ఈ నమూనాను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించి, విజయవంతం చేయవచ్చని నిరూపించాల్సిన సమయం ఆసన్నమైంది.

**ఫిరోజ్ ఖాన్, సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ 9640466464**

# కాళోజీ రచన ప్రపంచం తెలంగాణ ఆత్మగౌరవ మణికిరీటం

పదాలకు పోరాటం నేర్పిన చైతన్యమే కాళోజీ ప్రతిక్షణం పడిన ఆరాటం. అక్షరాలను అవపోసన పట్టిన కాళోజీ నైజం. ఓరుగల్లు గడ్డకు దొరికిన అరుదైన కవి ఆణిముత్యం. జాగృతం చేసే మాటల తూటలతో జనాలను ముందుకు నడిపించిన కవి సంచలనం. యావత్తు కవి ప్రపంచాన్ని తన వైపుకు చూసేలా చేసిన అక్షరాల మహిమాణిత్వం. కాళోజీ మది నుండి జనించిన ప్రతిపదం ఎగిసిపడే సామాజిక చైతన్యపు కెరటం. ప్రశ్నించే తత్వాన్ని నేర్పే నిశ్శబ్దపు విప్లవం కాళోజీ అంతరంగం.

కాళోజీ కలం అన్యాయానికి గురైన సామాన్య ప్రజల గళం.

కాళోజీ రాసిన ప్రతి పదం అభాగ్యులకు అండదండ నిచ్చే అస్త్రం.

కాళోజీ ఆలోచన తీరు నవ సమాజ నిర్మాణానికై జరిగే పోరు.

కాళోజీ మది అంతులేని అభ్యుదయ భావాల నిధి.

కాళోజీ జీవితం అన్ని వర్గాల గురించి ఆలోచన చేసే ప్రజాక్షేత్రం.

కాళోజీ అక్షర సత్యాలు నేటి తరానికి ఆచరణీయమైన ఆదర్శాలు.

కాళోజీ చెప్పిన మాటలు అణగారిన వర్గాల ఉన్నతికి మార్గదర్శకాలు. నిరక్షరాస్యులకు సైతం సులువుగా అర్థమయ్యే మాటల చతురతకు నిలువెత్తు నిదర్శనం కాళోజీ కవిత గుణం.

కాళోజీ కవిత్వాల లక్ష్యం తెలంగాణ ప్రజల ఆత్మగౌరవ ప్రభంజనం.


నా గొడవతో నడుంబిగించి ముందుకు నడిపించిన నవయుగ వైతాళికుడు. తెలంగాణ యాస, భాషల బలమేంతో చూపిన బహుముఖ ప్రజ్ఞాశాలి.


తెలంగాణ యాస తన శ్వాసగా ప్రతి క్షణం పరితపించిన భాషా ప్రేమికుడు. కాళోజీ మాటలు అర్థం చేసుకునే విధానం ఎవరికి వారు ఆత్మ విమర్శన చేసుకునే జ్ఞానబీజం. కాళోజీ రచనలు, స్వరాష్ట్ర సాధన ఉద్యమానికి ప్రేరణ శక్తులు.

నేడు గోడలపై ఉన్న కాళోజీ సూక్తులు భావితరాల భవితకు పునాదులు.

కాళోజీ రచన సౌశీల్యం నేటి యువ రచయితల పాలిట జ్ఞానమార్గం.

కాళోజీ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకం.






**-వంశీకృష్ణ గౌడ్ బండి**
**రంగయ్యపల్లి, రేగొండ జయశంకర్ భూపాలపల్లి జిల్లా**
**8688063096**

# తెలుగు గీత కవితకు జీవశైలి ఇచ్చిన వడ్డేపల్లి

## .గేయ గంధర్వుడు వడ్డేపల్లి కృష్ణ వర్ధంతి

తెలుగు భాషా సాహిత్యంలో గేయ సాహిత్యానికి విలక్షణ శైలి, హృదయాన్ని తాకే భావ వృద్ధి, సంగీతానికి తగిన పద సౌందర్యాన్ని అందించిన అరుదైన రచయిత వడ్డేపల్లి కృష్ణ (ఆగస్టు 5, 1948 -- సెప్టెంబర్ 6, 2024). లలిత గీతాల నుంచి భక్తి గీతాల వరకు, జానపద గేయాల నుంచి చలనచిత్ర పాటల దాకా అన్ని రంగాలలో తనదైన ముద్ర వేసిన వారు. ఆయన రచనలు వినిపించడమే కాదు, హృదయాన్ని పరవశింప జేసే శక్తిని కలిగి ఉన్నాయి.

1948 ఆగస్టు 5న ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని సిరిసిల్లలో ఒక చేనేత కుటుంబంలో జన్మించిన వడ్డేపల్లి కృష్ణ గారికి చిన్ననాటి నుంచి సాహిత్యం, సంగీతంపై మక్కువ ఉండేది. తల్లిదండ్రులు లక్ష్మమ్మ, లింగయ్యల అనుసంధానంలో పెరిగిన ఆయన చిన్ననాటి నుంచే కవిత్వానికి ఆకర్షితులయ్యారు. సినారె ప్రభావం స్పష్టంగా కనిపించే ఆయన పదబంధాలు, భావవ్యక్తీకరణ నైపుణ్యం కాలక్రమేణా గేయసాహిత్యానికి సజీవ ముద్రగా మారాయి.

1968లో "స్రవంతి", "కృష్ణా పత్రిక"లలో పద్యాలు, గేయాలు ప్రచురితమవడం ద్వారా ఆయన రచనా జీవితం మొదలైంది. 'కవికల్యాణం', 'గడ్డిపువ్వు', 'గాంధీ', 'మూడుపూలు ఆరుకాయలు', 'సంక్రాంతి లక్ష్మి', 'స్వదేశీయం', 'వివేకానంద విజయం', 'ఆమ్రపాలి', 'బతుకమ్మ', 'జయజయహే తెలంగాణ', 'రమణీయ రామప్ప' వంటి అనేక సంగీత నృత్యరూపకాలు వ్రాసిన ఆయన, జాతీయ, ప్రాంతీయ నేపథ్యాలను భావప్రధానంగా మలచగల గుణాన్ని కలిగి ఉన్నారు.



ఆకాశవాణి ద్వారా ప్రసారమైన ఆయన లలిత గీతాలు సామాన్య శ్రోతల నుండి సాహిత్య ప్రియుల దాకా విశేష ఆదరణ పొందాయి. "ఎందుకో ఈ కళ్లలో", "వచ్చే సాయంకాలం మౌనమే పలుకేలా", "తల్లి నీ చూపే దేవుడయ్యేను" వంటి పాటలు శ్రోతల మధుర జ్ఞాపకాల్లో నిలిచి పోయాయి. 'చిత్రాలకు గీతాలు రచించిన ఆయన, చలన చిత్ర గేయ సాహిత్యంలో సాహిత్య విలువను నిలబెట్ట గలిగిన అరుదైన రచయితగా గుర్తింపు పొందారు. ఆయన టెలివిజన్ సీరియల్స్ కూడా రూపొందించారు, వాటిలో "భక్త కవి పోతన", "భారతీయ సంస్కృతీ శిఖరాలు" ముఖ్యమైనవి. "గోభాగ్యం" లఘు చిత్రానికి జాతీయ స్థాయిలో స్పెషల్ జ్యూరీ అవార్డు కూడా అందుకున్నారు.

అవగాహనతో కూడిన పద వినియోగం, శ్రావ్యమైన పద బలంతో కూడిన రచనలు ఆయన శైలికి ప్రధానంగా నిలిచాయి. ఆయన భక్తి గీతాలు ఆలయాల్లో, భజనల్లో ప్రతిరోజూ వినిపించేవే. ఆయన రచనలు కేవలం వినోదం గానీ, ఆధ్యాత్మిక అనుభూతికే పరిమితం కాకుండా, భావ వ్యక్తీకరణకు, తాత్వికతకు ఆవిష్కారంగా నిలిచాయి. సంగీతం, పద సౌందర్యం రెండింటికీ సమాన ప్రాముఖ్యత ఇస్తూ రచించగల శక్తి ఆయనకు ప్రత్యేకత నిచ్చింది.

సాహిత్య సేవలకు గుర్తింపుగా ఆయనకు 'నంది అవార్డు', 'తెలుగు యూనివర్శిటీ గౌరవ సత్కారం', సినారె అవార్డు, మల్లాది' స్మారక పురస్కారం, దాశరథి మెమోరియల్ అవార్డు, ఆత్రేయ అవార్డు, వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ పురస్కారం, రవీంద్రభారతి' లో గవర్నర్ సమక్షంలో అక్కినేని నాగేశ్వరరావుచే కవి సత్కారం వంటి అనేక పురస్కారాలు లభించాయి. ఆయనకు "గేయ కిరీటి", "లలితశ్రీ", "కవన ప్రజ్ఞ" వంటి బిరుదులు లభించాయి. నంది అవార్డ్స్ కమిటీ చైర్మన్‌గా, ఇంటర్నేషనల్ చిల్డ్రెన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ జ్యూరీ సభ్యునిగా, "పాడుతా తీయగా" లాంటి కార్యక్రమాల జడ్జిగా కూడా ఆయన సేవలు అందించారు. వెయ్యికి పైగా లలిత గీతాలను రచించిన ఆయన, "కరీంనగర్ క్షేత్రాలు" అనే ఆడియో సీడీ ద్వారా భక్తి పరంగా ప్రాంతీయ క్షేత్రాలకు విశిష్టతను చాటారు. "వెలుగచ్చింది" అనే నాటకంలో తెలంగాణ భాష, యాస పట్ల ఆయనకు ఉన్న మక్కువను చాటి చెప్పారు. తెలంగాణ భూమికి సంగీతార్పణంగా "జయజయహే తెలంగాణ" అనే నృత్యరూపకం ద్వారా తన చారిత్రక భావనను ప్రతిబింబించారు.

ఆఖరి దశలో అనారోగ్యంతో బాధ పడుతున్న కృష్ణ హైదరాబాదులోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 2024 సెప్టెంబరు 6న మరణించారు. ఆయన మరణం తెలుగు గేయ సాహిత్య ప్రపంచానికి తీరని లోటు. కానీ ఆయన రచనలు, గీతాలు, పదాల సుగంధం పుస్తకాలుగా, ఆల్బములుగా, జ్ఞాపకాలుగా జీవించి ఉంటాయి.

వడ్డేపల్లి కృష్ణ ఒక గేయ రచయితగా మాత్రమే కాక, భావ వేదనకు నిలయమైన కవిగా, సమాజ స్పందనలకు ప్రతిరూపమైన సృజన కర్తగా, సంగీతానికి సాహిత్య గంభీరతను నూరిన ప్రకాశమయమైన ప్రతిభావంతుడిగా నిలిచి పోతారు. ఆయన రచనలన్నీ భావితరాలకు శ్రావ్యమైన ఆదర్శంగా నిలవడం ఖాయం.

**రామ కిష్టయ్య సంగన భట్ల**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...**
**9440595494**

# లక్షలాది మందికి దృష్టిని ప్రసాదించిన శివారెడ్డి

## ... పద్మశ్రీ పెరుగు శివారెడ్డి వర్ధంతి

రెండు లక్షల యాభై వేలకు పైగా కంటి శుక్లాల ఆపరేషనులు చేసి అత్యధిక కంటి శుక్లాల ఆపరేషనులు చేసిన డాక్టరుగా గిన్నీస్ ప్రపంచ రికార్డులకు ఎక్కిన అసమాన కంటి శస్త్ర చికిత్స నిపుణుడు శివారెడ్డి. ఆంధ్రప్రదేశ్ గవర్నర్ సలహా దారుగా, భారత రాష్ట్రపతి లి గౌరవ నేత్ర చికిత్సకులుగా పని చేసిన డాక్టర్ పెరుగు శివారెడ్డి (సెప్టెంబర్ 12, 1920 – సెప్టెంబర్ 6, 2005) ఆంధ్రప్రదేశ్‌లోని ఒక ప్రఖ్యాత



నేత్రవైద్య నిపుణుడు. పెరుగు శివారెడ్డి కర్నూలు జిల్లా దిన్నెదేవర పాడు గ్రామంలో 1920, సెప్టెంబరు 12న జన్మించారు. ఈయన తండ్రి పి. హెచ్. రెడ్డి. (పెరుగు హుస్సేన్ రెడ్డి – దర్గా దగ్గర జన్మించటంతో ఈ పేరు పెట్టడం జరిగినది). ఆయన 1946లో మద్రాసు విశ్వ విద్యాలయం నుండి ఎం.బి.బి.యస్. (డాక్టరు) పట్టా పొంది 1952లో నేత్ర వైద్యంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి ఎం.యస్. పట్టాను స్వీకరించారు.

ప్రారంభ ఉద్యోగం మద్రాసు మెడికల్ సర్వీసెస్ లో అసిస్టెంట్ సర్జన్ (1949–53) ఆంధ్ర మెడికల్ కాలేజి, కె.జి (కింగ్ జార్జి) హాస్పిటల్, విశాఖ పట్టణంలో ఆఫ్తాల్మోలజీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా, అసిస్టెంట్ సర్జన్ గా (1953–56) పనిచేశారు. ఉస్మానియా మెడికల్ కాలేజీ, హైదరాబాద్ (1958 – 61) సరోజినీ ఐ హాస్పటల్ ఆహ్వానం మీద అక్కడ సూపరింటెంట్ గా, అఫ్తాల్మాలజీ ప్రొఫెసర్ గా పదవీ బాధ్యతలు నిర్వర్తించారు. 1961–75 కాలంలో రాష్ట్ర ప్రభుత్వ సర్వీసులో చేరారు. అప్తాల్మాలజీ డైరక్టరుగా (1978–81) పోస్టు గ్రాడ్యుయేషన్ స్టడీస్ కు ప్రొఫెసరుగా (1975–78) వ్యవహరించారు.

ఆంధ్రప్రదేశ్ గవర్నర్ సలహా దారుగా, దేశ ప్రథమ పౌరుడి (రాష్ట్రపతి) కి గౌరవ నేత్ర చికిత్సకులుగా నియమితు లయ్యారు. ఉస్మానియా మెడికల్ కాలేజీ అఫ్తాల్మాలజీ విభాగానికి ఎమెరిటస్ ప్రొఫెసర్ గా, చైనా లోని సన్–యట్ సెన్ యూనివర్శిటీ ఆఫ్ మెడిసన్ సంస్థకు విజిటింగ్ ప్రొఫెసర్ గా రాణించారు. గుండె పోటుతో మరణించే వరకు ఆయన హైదరాబాదులోని సరోజినీదేవి కంటి ఆసుపత్రికి డైరెక్టరుగా ఉన్నారు. అనేక దేశాలు పర్యటించారు. అమెరికా అకాడమీ ఆఫ్ ఆప్తల్మోలజీ వారు కొంతకాలం తమతో ఉండేందుకు ఆహ్వానించి, అపూర్వ గౌరవ మర్యాదలు అందించారు. అనేక దేశాల్లోని సన్నిహిత మిత్రులు తమ దేశాలు వచ్చి, స్థిరపడాలని కోరి ఒత్తిడి చేసినా ఈయన యిష్టపడలేదు.

డాక్టర్ శివారెడ్డి ఆంధ్రప్రదేశ్ స్టేట్ అఫ్తాల్మోలాజికల్ అసోషియేషన్ అధ్యక్షులుగా; ఆల్ ఇండియా అఫ్తాల్మోజాలికల్ సొసైటీ అధ్యక్షులుగా; ఆసియా ఫసిఫిక్ అకాడమీ ఆఫ్ ఆఫ్తాలజీ ఉపాధ్యక్షులుగా; స్థాపక సభ్యులుగా; అమెరికన్ అకాడమీ ఆఫ్ అఫ్తాల్మాలజీ గౌరవ సభ్యులుగా; ఇండియన్ నేషనల్ ప్రోగ్రాం ఫర్ ప్రివెన్సన్ ఆఫ్ బ్లయిండ్‌నెస్ గౌరవ సభ్యులుగా; ఇంటర్నేషనల్ ఏజన్సీ ఫర్ ఫ్రివెన్షన్ ఆఫ్ బ్లైండ్‌నెస్ మొదలగు పదవులను నిర్వహించారు.

మద్రాసు యూనివర్శిటీలో గ్రాడ్యుయేషన్ (1946), ఆంధ్ర యూనివర్శిటీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ (1952) పూర్తయిన తర్వాత కూడా మూడు దశాబ్దాల పాటు నేత్ర వైద్య చికిత్సను బోధించారు. 500 మందికి పైగా పోస్ట్ గ్రాడ్యుయేట్లకు శిక్షన అందించారు. దేశ, విదేశాలలో ఈయన శిష్యులు అఫ్తాల్మోజిక్ సర్జన్ లుగా అనేకమంది కీర్తి ప్రతిష్ఠలు పొందుతున్నారు. అనేక గ్రామాలలో కాటరాక్ట్ సమస్యలతో బాధపడే వారున్నారని, ఊరూరా క్యాంపులు నిర్వహించి ప్రజలను ఎడ్యుకేట్ చేశారు. ఆపరేషన్లు నిర్వహించారు. మన దేశంలో ఈ తరహాగా కంటి క్యాంపులు, నిర్వహించడం తొలిసారి. 500 క్యాంపులు, దాదాపు మూడు లక్షల కాటరేక్ట్ ఆపరేషన్లు చేశారు. సొంత డబ్బు చాలా ఖర్చు చేశారు. మొబైల్ సర్వీస్ కూడా ఆర్గనైజ్ చేశారు. రిటైర్ అయిన తర్వాత కూడా రెండు శతాబ్దాల పాటు క్యాంపులు నిర్వహించారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలలోకూడా క్యాంపులు నిర్వహించి, తద్వారా చికిత్సతో పాటు మందులు కూడా యిచ్చేవారు. ఫుడ్ కూడా పెట్టేవారు. అద్దాలు కూడా యిచ్చేవారు. స్వంత డబ్బు కూడా వ్యయ పరిచేవారు. దేశంలో అత్యున్నత హోదాలలో ఉన్న చాలామందికి చికిత్స చేసి, "విజన్" కల్పించారు.

రెండు లక్షల యాభై వేలకు పైగా కంటి శుక్లాల ఆపరేషనులు చేసి అత్యధిక కంటి శుక్లాల ఆపరేషనులు చేసిన డాక్టరుగా గిన్నీస్ ప్రపంచ రికార్డుల కెక్కారు. భారత ప్రభుత్వం నుండి 1971లో పద్మశ్రీ, 1977లో పద్మభూషణ్ పురస్కారాలను పొందారు. ఈయన విశాఖపట్నం, వరంగల్, కర్నూలులలో ప్రాంతీయ నేత్ర వైద్యశాలల యేర్పాటుకు చాల కృషి చేశారు. 1990లో కర్నూలులో స్థాపించబడిన ప్రభుత్వ నేత్ర వైద్యశాల ఆయన పేరున స్థాపింప బడింది. ప్రఖ్యాత తెలుగు హీరో మెగాస్టార్ చిరంజీవి తన పేరున స్థాపించిన చిరంజీవి నేత్ర వైద్యశాల కొరకు శివారెడ్డి గారి సలహాలను కోరి, ఆయన సూచనలను పాటించారు.

కంటి చికిత్సలతో పాటు సోషల్ యాక్టివిటీస్ కూడా అనేకం చేశారు. గ్రంథ రచనలు చేశారు. దేశ, విదేశీ ప్రత్రికల్లో సైంటిఫిక్ ఆర్టికల్స్ అనేకం రాసారు. 1985 నుంచి భారతీయ విద్యాభవన్ కు ఛైర్మన్ గా యున్నారు. సిబిఐటి బోర్డులో ఉన్నత పదవులను అలంక రించారు. అళాసాగర్ సాంస్కృతిక సంస్థకు అధ్యక్షులుగా కొంతకాలం ఉన్నారు. ఈ విధంగా పలు సోషల్ ఏక్టివిటీస్ లో ఉండేవారు.

దేశంలోనే పేరెన్నిక గన్న సరోజినీ దేవి కంటి హాస్పటల్ కీర్తి ప్రతిష్ఠలను ఈయన సారథ్య నైపుణ్యం, మార్గదర్శకత్వాలే ప్రధాన కారణాలు. కార్నియల్ గ్రాఫ్టింగ్ రంగంలో ప్రత్యేకంగా ఘనకీర్తి నార్జించటనికి గల కారణం కూడా ఈయన ప్రతిభే. అంతర్జాతీయ మెడిసన్ జర్నల్స్ లో దాదాపు 30 పరిశోధనా పత్రాలను వెలువ రించారు. 1973 లో జర్మనీ దేశంలోని మ్యూనిచ్ లో జరిగిన ఇంటర్నేసహ్నల్ కాన్ఫరెన్స్ ఆఫ్ ఆఫ్తాల్మోలజీలో ఈయన కనుగొన్న చాలా అరుదైన క్రిమికి (అకసేరుక జీవి) సంబంధించిన సమాచారం అందించారు. తర్వాతి కాలంలో దానికి ఈయన పేరు మీదనే +శీతీఎఖు =వఎఎఎ అని నామకరణం చేశారు.

డాక్టర్ శివారెడ్డికి అనేక ప్రతిష్ఠాత్మక గౌరవాలు, అవార్డులు అందాయి. 1970 లో పద్మశ్రీ; 1977 లో పద్మభూషణ్; వెంకటేశ్వర యూనివర్శిటీ వారిచే డి.ఎస్.సి. (1980); 1981 లో అమెరికన్ అకాడమీ ఆఫ్ అఫ్తాల్మోలజీ వారి గెస్ట్ ఆఫ్ హానర్; 1981 లో డాక్టర్ బి.సి.రాయ్ నేషనల్ అవార్డు; లక్ష కాటరేక్ట్ ఆపరేషన్లు పూర్తిచేసిన సందర్భంగా దేశ ప్రధానిచే మెమెంటో బహూకరణ; 1985 లో ఆసియా–పసిఫిక్ అకాడమీ ఆఫ్ అఫ్తాల్మోలజీ వారి జీన్ రిజాల్ మెడల్ (ఆసియా – పసిఫిక్ అకాడమీ ఆఫ్ ఆఫ్తాల్మొకజీ వారిచే) ఆడెన్ వాలా ఓరేషన్ గోల్డ్ మెడల్ మొదలగునవి. ఈయన 2005 ఆగస్టులో పార్కిన్‌సన్స్ వ్యాధికి గురై, సెప్టెంబరు 6న గుండెపోటుతో మరణించారు. 85 ఏళ్లు జీవించి, స్ఫూర్తిదాతగా నిలిచిన డాక్టర్ శివారెడ్డి తెలుగు వారికి గర్వకారకులు, చిరస్మరణీయులు.

**రామ కిష్టయ్య సంగన భట్ల,**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...**
**9440595494**

ప్రభాతవన సింగిడి ప్రతి రంగూ ఓ నిజం
Singidi
ఆదివారం 06-9-2026

# దళితుడిపై అగ్రవర్ణాల దాడి..

- కులదూషణ, దాడికి పాల్పడ్డారని ఆరోపణ
- నిందితుడిని వెంటనే అరెస్టు చేయాలి
- దళిత సంఘాల డిమాండ్



**కరీంనగర్, సెప్టెంబర్ 5(సింగిడి):** కరీంనగర్ పట్టణానికి చెందిన లింగంపల్లి సత్యనారాయణపై కులదూషణకు పాల్పడి, రాళ్లతో దాడి చేశారని ఆరోపిస్తూ అంబేడ్కర్ యువజన సంఘం, ఎమ్మార్పీఎస్ నాయకులు నిరసనకు హెచ్చరించారు. నిందితుడిని వెంటనే అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సంఘాల నాయకులు గోస్కి శంకర్, గాలిపెల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, ఓ వివాహ వేడుకకు హాజరైన సత్యనారాయణను దావూరి గంగారెడ్డి కులం పేరుతో దూషించి అవమానించారని ఆరోపించారు. అక్కడున్నవారు వారించినప్పటికీ, అనంతరం ఇంటికి వెళ్తున్న సత్యనారాయణను వెంబడించి ఇటుకలు, రాళ్లతో దాడి చేశారని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా కుల వివక్ష కొనసాగడం బాధాకరమని, రాజ్యాంగం కల్పించిన సమానత్వ హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి, నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించాలని డిమాండ్ చేశారు. నిందితుడిపై చర్యలు తీసుకోకపోతే దళిత సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో లింగంపల్లి రాజు, సిద్ధు, తరుణ్, శివ తదితరులు పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం...

## మాచనపల్లి సర్పంచ్ పర్లపల్లి విజయ్

## ఇందిరమ్మ లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీల పంపిణీ



**జమ్మికుంట,, సెప్టెంబర్ 5 (సింగిడి) :** పేదల సొంతింటి కల నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తుందని మండలంలోని మాచనపల్లి సర్పంచ్ పర్లపెల్లి విజయ్ తెలిపారు. శనివారం అర్హులైన లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి ప్రొసీడింగ్ కాపీలను ఆయన అందించారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను నిస్పాక్షికంగా అందిస్తుందని అర్హులైన లబ్ధిదారులను గుర్తించి ప్రభుత్వం అందించే ప్రతి సంక్షేమ పథకం వారి ఇంటికి చేరుతుందని ఎవరు అధైర్య పడద్దని ఆయన పేర్కొన్నారు. ఇండ్లు రాని అర్హులైన లబ్ధిదారులు ఎవరైనా ఉంటే తప్పకుండా వారికి కూడా ఇండ్లను అందించే ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాసనపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు ఓరుగంటి రవీందర్రావు వేల్పుల ప్రశాంత్ గుర్రపు సంపత్ రెడ్డి ముష్కి సదానందం ఇటికల సదానందం వేల్పుల గణేష్ రంజిత్ అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఏబీవీపీ ఆధ్వర్యంలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



**జమ్మికుంట,, సెప్టెంబర్ 5 (సింగిడి) :** డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 5వ తేదీన నిర్వహించుకునే ఉపాధ్యాయ దినోత్సవం వేడుకలను శనివారం ఏబీవీపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ జమ్మికుంట శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవం వేడుకలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ కాలేజ్ ప్రిన్సిపాల్ బి. రమేష్‌ను శాలువాతో సన్మానించడం జరిగిందని విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు పునాదులు వేసేది ఉపాధ్యాయులు అని అలాంటి అధ్యాపకులను గౌరవించడం మన సాంప్రదాయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట నగర కార్యదర్శి బోగం శశాంక్, పాలికని రూప్, మోయిజ్, సల్మాన్ , నికిత్, విష్ణు మరియు ఇతరులు పాల్గొన్నారు.

# వికాస్ ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్‌కు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం

## జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఆర్. శారదకు సత్కారం



**కరీంనగర్, సెప్టెంబర్ 5(సింగిడి):** ఆసిఫ్‌నగర్‌లోని వికాస్ ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీమతి ఆర్. శారదకు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం లభించింది. ఉపాధ్యాయ దినోత్సవం, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని కలెక్టరేట్ సభామందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందజేశారు. జిల్లా కలెక్టర్, మేజిస్ట్రేట్ చిత్రా మిశ్రా, జిల్లా విద్యాశాఖ అధికారి చైతన్య జైనీ, జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ట్రాస్మా ఛైర్మన్ యాదగిరి శేఖర్‌రెడ్డి తదితరుల సమక్షంలో కలెక్టర్ చిత్రా మిశ్రా చేతుల మీదుగా ఆర్. శారద పురస్కారాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా 26 ఏళ్లుగా విద్యారంగంలో సేవలందిస్తున్న వికాస్ ఉన్నత పాఠశాల కృషిని కలెక్టర్ అభినందించారు. అనంతరం పాఠశాలలో కూడా సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రథమ తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్, పాఠశాల ఛైర్మన్ పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# బంగారు భవిష్యత్‌కు బాటలు వేసేది గురువులే

- ఉపాధ్యాయులు చూపిన దారిలో నడవాలి
- ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్‌కుమార్





**జమ్మికుంట,, సెప్టెంబర్ 5 (సింగిడి) :** విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేది ఉపాధ్యాయులే అని వారు చూపిన దారిలో నడిచి బంగారు భవిష్యత్తు ఏర్పాటు చేసుకోవాలని జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ తెలిపారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జమ్మికుంట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపేది వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేది ఉపాధ్యాయులే అని వారు చూపిన బాటలో నడిచి మీ భవిష్యత్తును బంగారు మయం చేసుకోవాలని సూచించారు. ఎంతోమంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్ది ఉన్నత స్థాయికి చేరుకునే విధంగా వారికి విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను గౌరవించాలని వారి ఆశీస్సులు ఉంటే ఏదైనా సాధిస్తామని ఈ సందర్భంగా అన్నారు. వారి ఆశీస్సులతో తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని గురువు నేర్పిన విద్యను సరైన పద్ధతిలో వినియోగించుకుంటూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని విద్యార్థుల సంక్షేమం కోసం ప్రతి ఉపాధ్యాయుడు నిరంతరం కృషి చేస్తారని అలాంటి గురువులను ఈ సందర్భంగా మనం గౌరవించుకోవడం సంతోషంగా ఉందని అన్నారు. అనంతరం అధ్యాపక బృందాన్ని శాలువాలతో ఘనంగా సన్మానించి సత్కరించారు. అనంతరం అధ్యాపక బృందం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు కాంపౌండ్ వాల్ కావాలని మున్సిపల్ చైర్మన్‌ను కోరగా తప్పకుండా సహకరించి కాంపౌండ్ వాల్ నిర్మిస్తానని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎం కుమార్ ఎన్ఎస్ఎస్ ఆఫీసర్స్ కే తిరుపతి ఈ జోష్న దేవకి అధ్యాపకులు సిహెచ్ విశ్వనాథరెడ్డి జి ప్రభాకర్ బి మహేష్ ఎం శ్రీధర్ ఎస్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడిగా పాతకాల అనిల్

## నియామక పత్రం అందించిన ప్రణవ్



**జమ్మికుంట,, సెప్టెంబర్ 5 (సింగిడి) :** కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జమ్మికుంట పట్టణ అధ్యక్షుడిగా పట్టణంలోని 15వ వార్డుకు చెందిన పాతకాల అనిల్ ను టీపీసీసీ రాష్ట్ర ఎస్సీ విభాగం చైర్మన్ మానకొండూరు శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో నాకు ఈ అవకాశం కల్పించిన డిసిసి అధ్యక్షులు మేడిపల్లి సత్యం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రణవ్ బాబుకు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు అరుణ్ మానకొండూరు శాసనసభ్యులు డాక్టర్ సత్యనారాయణకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని ఎస్సీ వర్గాల సంక్షేమ కోసం ప్రజా సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తానని ఈ సందర్భంగా తెలిపారు.

**మండల అధ్యక్షుడిగా దొగ్గల భాస్కర్**

జమ్మికుంట మండల ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా మండలంలోని వెంకటేశ్వర పల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దొగ్గల భాస్కర్ ను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు అరుణ్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం కరీంనగర్ లో టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మానకొండూరు శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ చేతుల మీదుగా నియామక పత్రాన్ని భాస్కర్కు అందించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ నాకు ఈ అవకాశం కల్పించిన నియోజకవర్గ ఇన్చార్జి ప్రణవ్ బాబుకు జిల్లా అధ్యక్షులు మేడిపల్లి సత్యం కు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం నిరంతరం కృషి చేస్తానని ఎస్సీ సామాజిక వర్గ సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పరశు రామారావు ఇల్లంతకుంట దేవస్థానం మాజీ చైర్మన్ దేశిని కోటి గిరవేన శ్రీనివాస్ యాదవ్ యూత్ కాంగ్రెస్ నాయకులు రాచపల్లి సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి

## ఉద్యోగుల న్యాయమైన హక్కుల సాధనకు ఐక్య పోరాటం



**కరీంనగర్, సెప్టెంబర్ 5(సింగిడి):** ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, గెజిటెడ్ అధికారుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర జేఏసీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 10న హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్‌రెడ్డి, కన్వీనర్ మడిపల్లి కాళీచరణ్‌గౌడ్ పిలుపునిచ్చారు. శనివారం కరీంనగర్‌లో కార్యక్రమ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సెప్టెంబర్ 8న కరీంనగర్ టీఎన్జీవోల కమ్యూనిటీ భవన్‌లో నిర్వహించే ఉమ్మడి జిల్లా సన్నాహక సమావేశానికి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, గెజిటెడ్ అధికారులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ఎంప్లాయీస్ హెల్త్ స్కీం అమలులో నెలకొన్న లోపాలను సరిదిద్ది సమర్థవంతంగా అమలు చేయాలని, పెండింగ్ బకాయిలు, పీఆర్సీ తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. 2004 సెప్టెంబర్ 1 తర్వాత నియమితులైన ఉద్యోగులకు అమలవుతున్న సీపీఎస్‌ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్న ఎన్నికల హామీని ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు ప్రభుత్వానికి వ్యతిరేకం కాదని, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తూ పాలనలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. తాము కోరుతున్నవి గొంతెమ్మ కోరికలు కాదని, రాజ్యాంగబద్ధంగా, న్యాయబద్ధంగా తమకు రావాల్సిన హక్కులేనని స్పష్టం చేశారు. 'పెన్షన్ భిక్ష కాదు.. ఉద్యోగి హక్కు' అని పేర్కొన్నారు. కార్యక్రమంలో జేఏసీ కార్యదర్శి సంగెం లక్ష్మణరావుతో పాటు వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# జెడ్పి డిప్యూటీ సీఈవో పవన్ కుమార్‌ను సన్మానించిన పింగళి రమేష్



**జమ్మికుంట,, సెప్టెంబర్ 5 (సింగిడి) :** కరీంనగర్ జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో పవన్ కుమార్ ఇటీవల పదవి విరమణ పొందగా శనివారం వారి నివాసంలో ఆయనను కలిసి శాలువాతో ఘనంగా సన్మానించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ పింగళి రమేష్. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ, జిల్లా పరిషత్ లో విశేష సేవలు అందించిన పవన్ కుమార్ ఉద్యోగ విరమణ పొందారని వారి శేష జీవితం ప్రశాంతంగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ అనేది తప్పనిసరిగా ఉంటుందని తన అనుభవాలను ఇతరులకు తెలుపుతూ శేష జీవితం కుటుంబ సభ్యులతో పిల్లాపాపలతో సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. గతంలో పవన్ కుమార్ తో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ తన అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి జిల్లా మాజీ అధ్యక్షులు గూడేల్లి తిరుపతి బిట్ల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# మాచనపల్లిలో ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

- భారీగా తరలివచ్చిన ప్రజలు
- బహుమతి ప్రధానం చేసిన డాక్టర్ కనవేన తిరుపతి





**జమ్మికుంట, సెప్టెంబర్ 5 (సింగిడి):** జమ్మికుంట మండలం మాచనపల్లి గ్రామంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. శ్రీ కృష్ణాష్టమి ఉత్సవ కమిటీ నాయకులు కనవేన నాగరాజు పర్యవేక్షణలో కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పట్టణానికి చెందిన ప్రముఖ వైద్య నిపుణులు సురక్ష మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి డాక్టర్ దంపతులు కనవేన స్వర్ణలత తిరుపతి దంపతులు హాజరయ్యారు. గ్రామంలో ఏర్పాటు చేసిన ఉట్టి కొట్టే కార్యక్రమానికి వందలాదిమంది ప్రజలు హాజరై కార్యక్రమాన్ని వీక్షించారు. సుమారు రెండు గంటల పాటు జరిగిన పోటీలో ఎంతోమంది యువకులు ఉత్సాహంగా పాల్గొని ఉట్టికొట్టే కార్యక్రమాన్ని సంతోషంగా నిర్వహించగా ఈ కార్యక్రమంలో గెలుపొందిన వారికి 18116 రూపాయలను డాక్టర్ తిరుపతి దంపతుల చేతల మీదుగా అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ దంపతులు మాట్లాడుతూ, యాదవ్ కులస్తుల దైవమైన శ్రీకృష్ణాష్టమి జన్మదిన వేడుకలను గత పది సంవత్సరాలుగా మాచనపల్లి గ్రామంలో గ్రామస్తులు ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహించడం సంతోషంగా ఉందని భవిష్యత్తులో ఇలాంటి ఉత్సవాలు మరిన్ని జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఉట్టి కొట్టే కార్యక్రమం ప్రశాంతంగా జరుపుకోవడం సంతోషంగా ఉందని ఎలాంటి గొడవలకు తావు లేకుండా కులమతాలకు అతీతంగా కలిసి మెలిసి గ్రామస్తులందరూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం మంచి అనుభూతిని కలిగించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు. కన్నవేన రాయమల్లు. బండారు తిరుపతి. ఉద్యమ నాయకుడు



పులవేన పోచ మల్లు యాదవ సంఘం పెద్దలు కావట్టి సారయ్య. వేల్పుల సమ్మయ్య వేల్పుల ప్రశాంత్ ముష్క క్రాంతి వేల్పుల శ్రీకాంత్ వేల్పుల గణేష్ కనవేన సాయి. మూటిక ఉమేష్ జక్కుల ప్రశాంత్ పాల్గొన్నారు.

# విజయోత్సవ సభలో ప్రణవ్ జోష్

## భారీగా తరలివెళ్లిన నియోజకవర్గ నేతలు



**జమ్మికుంట, సెప్టెంబర్ 5 (సింగిడి):** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా కరీంనగర్ పట్టణంలోని ఇందిరా చౌక్ వద్ద కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, చొప్పదండి శాసన సభ్యుడు మేడిపల్లి సత్యంఆధ్వర్యంలో నిర్వహించిన విజయోత్సవ వేడుకల్లో పాల్గొన్న హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్.. ఈ కార్యక్రమంలో సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, నగర అధ్యక్షుడు అంజన్ కుమార్, ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డిమాజీ శాసన సభ్యులు ఆరేపల్లి మోహన్, పురమల్ల శ్రీను జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు. హుజురాబాద్ నియోజవర్గం నుండి భారీగా తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులు జై కాంగ్రెస్ నినాదాలతో ఇందిరా చౌక్ ను మారుమ్రోగించారు... కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ఫ్లకార్డుల రూపంలో ప్రదర్శించారు. తీన్మార్ స్టెప్పులతో కార్యకర్తల్లో జోష్ పెంచారు. అనంతరం భారీ కేక్ కట్ చేశారు.

# బ్లూ బెల్స్ హైస్కూల్‌లో ఘనంగా కృష్ణాష్టమి, ఉపాధ్యాయ దినోత్సవం

## కృష్ణుడి బోధనలు, ఉపాధ్యాయుల విలువలను విద్యార్థులకు వివరించిన ప్రిన్సిపాల్ జంగా సునీత మనోహర్‌రెడ్డి



**కరీంనగర్, సెప్టెంబర్5(సింగిడి):** హనుమాన్‌నగర్‌లోని బ్లూ బెల్స్ హైస్కూల్‌లో శనివారం కృష్ణాష్టమి, ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధ వేషధారణలో అలరించగా, కృష్ణుడి జీవిత విశేషాలు, భగవద్గీత సందేశం, ధర్మం, నైతిక విలువలపై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్రను వివరిస్తూ విద్యార్థులు ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. పాఠశాల ప్రిన్సిపాల్ జంగా సునీత మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీకృష్ణుడి బోధనలు స్ఫూర్తిదాయకమని, విద్యార్థులు ఉపాధ్యాయులను గౌరవిస్తూ క్రమశిక్షణ, నైతిక విలువలను అలవరచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# న్యూ మిలీనియం స్కూల్లో ఘనంగా టీచర్స్ డే వేడుకలు

## ఉపాధ్యాయులకు ఘన సన్మానం









**జమ్మికుంట, సెప్టెంబర్ 5 (నినాదం) :** జమ్మికుంట పట్టణంలోని న్యూ మిలీనియం స్కూల్స్ లో శనివారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. న్యూ మిలీనియం స్కూల్స్ చైర్మన్ ముసిపట్ల తిరుపతిరెడ్డి ఆదేశాల మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు విశ్వనాథ్ రెడ్డి వరుణ్ రెడ్డిలు అట్టహాసంగా నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ పుట్టినరోజు సందర్భంగా ప్రతి సంవత్సరం నిర్వహించే ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించినట్లు విద్యాసంస్థల చైర్మన్ ముసిపట్ల తిరుపతిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని ఎంతోమంది మేధావులను తయారు చేసే శక్తి ఒక ఉపాధ్యాయుడికి ఉందని అన్నారు. సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి ఎనలేని గౌరవం ఉందని ప్రతి ఒక్కరు గౌరవించేది తల్లిదండ్రుల తర్వాత గురువు నే అని అలాంటి గురువులను గుర్తుంచుకొని సత్కరించే రోజు ఉపాధ్యాయ దినోత్సవం అని పేర్కొన్నారు. అనంతరం ఉపాధ్యాయులకు ధన సన్మానం చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు విశ్వనాథ్ రెడ్డి వరుణ్ రెడ్డిలు మాట్లాడుతూ, సమాజంలో బాధ్యతతో కూడిన ఉద్యోగం ఉపాధ్యాయ వృత్తి అని అలాంటి వృత్తిని అంకితభావంతో చేస్తూ మెరుగైన విద్యాబోధన విద్యార్థులకు అందించాలని అప్పుడే మనపై ఉన్న నమ్మకం మరింత పెరుగుతుందని తెలిపారు. సమాజంలో ఉపాధ్యాయులపై ఉన్న గౌరవం మరే ఉద్యోగస్తుడికి ఉండదని దానిని గౌరవిస్తూ మనల్ని నమ్మి పాఠశాలకు పంపే విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందిస్తూ తల్లిదండ్రుల కలను సాకారం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
ఆదివారం
06-9-2026

# కాంగ్రెస్‌లో చేరిన కోర్కల్ గ్రామ సర్పంచ్, వార్డుసభ్యులు

- కడుపు నింపిన కాంగ్రెస్ పార్టీకే మా మద్దతు
- 1000 రోజుల ప్రజాపాలనకు ఇదే నిదర్శనం
- నియోజకవర్గ ఇన్చార్జి ప్రణవ్



**జమ్మికుంట,, సెప్టెంబర్ 5 (సింగిడి) :** వీణవంక మండలంలో కాంగ్రెస్ పార్టీ దూకుడు కొనసాగుతుంది. శనివారం రోజున వీణవంక మండలం కోర్కల్ గ్రామ సర్పంచ్ రమ్యకృష్ణ-అనిల్,వార్డు సభ్యులు,కుల సంఘాల అధ్యక్షులు,వివిధ పార్టీలకు చెందిన 150 మంది నాయకులు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు ప్రణవ్. అనంతరం వారు మాట్లాడుతూ ఇసుక మీద ఆధారపడి జీవనం సాగిస్తున్న మాకు సాండ్ టాక్స్ కల్పించి జీవనోపాధి కల్పించారని,కాంగ్రెస్ పార్టీ అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేరి వారు సంతోషంగా ఉన్నారని,ఆ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. గ్రామంలోని కొన్ని సమస్యలు ప్రణవ్ దృష్టికి తీసుకురాగా వాటిని పరిష్కరిస్తానని తెలిపారు.

**అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలు అందిస్తా...ప్రణవ్..**

నియోజకవర్గ వ్యాప్తంగా అర్హులైన ప్రతి లబ్ధిదారునికి కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తామని వొడితల ప్రణవ్ అన్నారు. సంక్షేమం,అభివృద్ధి రెండు ప్రధానంగా ముందుకు వెళ్తున్నామని,అధికారంలోకి వచ్చి 1000 రోజులు అయిన సందర్భంగా పార్టీలో చేరడం శుభపరిణామమని అన్నారు. కోర్కల్ గ్రామ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని నిధులు,కేటాయించి అభివృద్ధి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో వీణవంక మండల ప్రజాప్రతినిధులు,మండల అధ్యక్షుడు,మండల నాయకులు,మైనారిటీ నాయకులు,వివిధ గ్రామాల సర్పంచులు,ఉప సర్పంచులు,వార్డు సభ్యులు,సీనియర్ కాంగ్రెస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## గార్డియన్ పాఠశాలలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



- ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది
- పట్టణ సీఐ రామకృష్ణ గౌడ్ చేతుల మీదుగా ఘన సన్మానం

**జమ్మికుంట,, సెప్టెంబర్ 5 (సింగిడి) :** డా. సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం కొత్తపల్లిలోని గార్డియన్ స్కూల్ నందు ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమం ప్రిన్సిపాల్ మహమ్మద్ అంకూస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగింది ఇట్టి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జమ్మికుంట పట్టణ సీఐ రామకృష్ణ గౌడ్ హాజరై ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించటం జరిగింది. తరువాత కార్యక్రమాన్ని ఉద్దేశించి సీఐ మాట్లాడుతూ ప్రపంచంలో అన్ని వృత్తులను సృష్టించే ఏకైక వృత్తి ఉపాధ్యాయ వృత్తి అని ఉపాధ్యాయులు ప్రపంచానికి మార్గదర్శకులుగా ఉంటారని పిల్లలంతా ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు విని క్రమశిక్షణతో ఉత్తమ పౌరులుగా ఎదగాలని సమాజంలో పేరు ప్రతిష్టలు పొందాలని తెలిపారు. పాఠశాలలోని ఉపాధ్యాయ బృందాన్ని శాలువా, పూల బొకే తో ఘనంగా సన్మానించారు. ఇట్టి కార్యక్రమంలో టిపిటిఎల్ఏ ప్రెసిడెంట్ రహమాన్, సీనియర్ జర్నలిస్ట్ లు నసిరుద్దీన్, యూసుఫ్,ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవం

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

పాల్గొన్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



**మిర్యాలగూడ సెప్టెంబర్ 5(సింగిడి):** పేదవాడి సొంత ఇంటి కల కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందని మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మిర్యాలగూడ మండలం కాల్వపెల్లి తండాలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభోత్సవం చేశారు. గ్రామంలోని అర్హులైన వారందరికీ స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన అనంతరం మాట్లాడుతూఅర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదల అభ్యున్నతి కోసం అహర్నిశలు కురిసేస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు, మహిళలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా కాంగ్రెస్ 1000 రోజుల ప్రజాపాలన సంబరాలు

- ఏడాది రోజుల్లోనే 7 లక్షల ఇందిరమ్మ ఇళ్లు, 15 లక్షల కొత్త రేషన్‌కార్డులు అందించాం
- డిసిసి అధ్యక్షులు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**కరీంనగర్, సెప్టెంబర్ 5(సింగిడి):** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల ప్రజా పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా కరీంనగర్ ఇందిరాచౌక్‌లో జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సంబరాలు నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్‌కుమార్, హుజురాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఒడితెల ప్రణవ్‌బాబు, కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారీ కేక్ కట్ చేసి, బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం పేదలకు ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, పదేళ్ల బీఆర్ఎస్ పాలనకు ముగింపు పలికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడి 1000 రోజులు పూర్తయ్యాయని అన్నారు. ఈ కాలంలో 7 లక్షల ఇందిరమ్మ ఇళ్లు, 15 లక్షల కొత్త రేషన్ కార్డులు మంజూరు చేశామని తెలిపారు. 53 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 43 లక్షల కుటుంబాలకు చేయూత పింఛన్లు అందిస్తున్నామని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, 25 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ, సన్న వడ్లకు రూ.500 బోనస్ వంటి పథకాలను అమలు చేస్తున్నామని వివరించారు. బీఆర్ఎస్ పదేళ్లలో రెండు లక్షల ఉద్యోగాలు ఇచ్చామని చెబుతుండగా, కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల్లోనే 70 వేలకు పైగా ఉద్యోగాలు భర్తీ చేసిందన్నారు. మిగిలిన ఖాళీలకు కూడా నోటిఫికేషన్లు జారీ చేస్తామని తెలిపారు. ప్రజలకు దూరంగా ఉంటున్న కేసీఆర్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. వచ్చే ఎన్నికల్లోనూ ప్రజలు కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తారని ధీమా వ్యక్తం చేశారు. మంత్రుల తొలగింపుపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ, మంత్రివర్గ వ్యవహారం ముఖ్యమంత్రి, పార్టీ అధిష్ఠానం పరిధిలో ఉంటుందని, గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఈటల రాజేందర్, రాజయ్యల విషయంలో జరిగిన పరిణామాలను గుర్తుంచుకుని మాట్లాడాలని మేడిపల్లి సత్యం సూచించారు.

## కొండా సురేఖ బర్తరఫ్‌ను వెనక్కి తీసుకోవాలి



- చింతపల్లి మున్నూరుకాపు సంఘం డిమాండ్

**చింతపల్లి, సెప్టెంబర్ 5(సింగిడి):** కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ మంత్రి కొండా సురేఖను బర్తరఫ్ చేసిన నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని స్థానిక మున్నూరుకాపు సంఘం డిమాండ్ చేసింది. కొండా సురేఖ కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుని జరిగిన పరిణామాల నేపథ్యంలోనే ఆమెపై చర్యలు తీసుకున్నారని సంఘం నాయకులు ఆరోపించారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన కొండా సురేఖను రాజకీయంగా అణిచివేయాలని చూస్తే తెలంగాణలోని బీసీ, మున్నూరుకాపు సమాజం ఊరుకోదని వారు పేర్కొన్నారు. కొండా సురేఖ బర్తరఫ్ నిర్ణయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం పునఃపరిశీలించి వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ బీసీల హక్కులు, ఆత్మగౌరవం కోసం ఐక్యంగా పోరాడుతామని తెలిపారు. బీసీలను అంచివేయాలని చూస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం విధానాలను వ్యతిరేకిస్తామని, బీసీల ఐక్యత వర్ధిల్లాలి, మున్నూరు కాపు ఐక్యత వర్ధిల్లాలి అంటూ స్థానిక ఎక్స్ రోడ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహ వద్ద నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కుకుడపు సదానందం, ఎల్లంకి అశోక్, ఉప్పల యాదయ్య, కుకుడపు రామకృష్ణ, మోర వెంకటరమణ, గునుకుల హరీష్, సోమరాజు ప్రదీప్, కంచుకట్ల వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

పాల్గొన్న టిపిసిసి ప్రధాన కార్యదర్శి



**మహాదేవపూర్ సెప్టెంబర్ 5(సింగిడి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను అఖిలభారత యాదవ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వేడుకలకు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిల శ్రీనుబాబు ముఖ్యఅతిథిగా పాల్గొని శ్రీకృష్ణుని విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన శ్రీకృష్ణుడి బోధనలు సమాజానికి స్ఫూర్తిదాయకమని ధర్మం సత్యం న్యాయం కోసం ఆయన చూపించిన మార్గం ప్రతి ఒక్కరికి ఆదర్శమని అన్నారు. శ్రీకృష్ణుని ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. జన్మాష్టమి వేడుకల్లో నిర్వహించిన ఉట్టి కొట్టే కార్యక్రమంలో ఆయన ఉత్తమంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ కోట రాజబాపు, స్థానిక సర్పంచ్ హసీనాబాను, పిఎసిఎస్ చైర్మన్ చల్ల తిరుపతిరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్కం అశోక్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

## సంస్కృతిని ప్రతిబింబించేవే పండుగలు

ఎమ్మెల్యేలు నవీన్ యాదవ్, లక్ష్మారెడ్డి



**మిర్యాలగూడ సెప్టెంబర్ 5(సింగిడి):** సంస్కృతిని ప్రతిబింబించేవే పండుగలు అని జూబ్లీహిల్స్ శాసనసభ్యులు నవీన్ యాదవ్, మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, మాజీ రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్ అన్నారు. మిర్యాలగూడ యాదవ సంఘం భవనంలో శ్రీకృష్ణ జన్మాష్టమి పంచమా వార్షికోత్సవ వేడుకలు పాల్గొని మాట్లాడుతూ పండుగలు సాంప్రదాయానికి ప్రతీక అని శ్రీకృష్ణ జన్మాష్టమి యొక్క ఘనత భవిష్యత్ తరాలకు తెలియజేయవలసిన బాధ్యత నేటి తరం మీద ఉన్నదని, ఉట్లు కొట్టే కార్యక్రమంలో కుండ చీకటికి ప్రతీక అయితే అందులో వేసే నెయ్యి, వెన్న, పాలు, పెరుగు వెలుగుకు జ్ఞానానికి ప్రతీక అని దిగంతాల చీకటి నుండి యుగాంతల వెలుగులోకి తీసుకురావడమే ఉట్లు కొట్టే సాంప్రదాయమని అన్నారు. యాదవులు శ్రీకృష్ణుని యొక్కవారసులుగా ధర్మ పరిరక్షణకు దుష్ట శిక్షణకు కట్టుబడి ఉంటారని అన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు గుడిపాటి కోటయ్య యాదవ్, కట్టబోయిన శ్రీనివాస్ యాదవ్ పగిడి రామలింగయ్య కట్టబోయిన రామలింగయ్య, యాదవ్ కౌన్సిలర్లు మలగం రమేష్ గంగుల బిక్షం పుట్టపాక శ్రీనివాస్ పొదిల నిక్షిత్ పట్టణ ప్రధాన కార్యదర్శి పిన్ని బోయిన శ్రీనివాస్ యాదవ్, సర్నాల వెంకయ్య యాదవ్, గాలం వెంకన్న చిమట మదార్, పొదిల వెంకన్న, వార్త లక్ష్మణ్ నడ్డి శివకృష్ణ, జొన్నలగడ్డ సాయి, రమాదేవి వెంకట్, మహేష్ యాదవ్, జడ రాములు, చిర్ర మల్లయ్య దొంకల వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, గుడిపాటి లలిత, నాగేంద్ర, మంగ, వివేక్ , తదితరులు పాల్గొన్నారు.

# అన్ని రంగాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- వంటా వార్పుతో హోరెత్తించిన బీఆర్ఎస్ శ్రేణులు
- ఎమ్మెల్సీ, ఎంసి కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే భాస్కరరావు



**మిర్యాలగూడ, సెప్టెంబర్ 5(సింగిడి):** కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనలో ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, హామీలు అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా మిర్యాలగూడ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు ఆధ్వర్యంలో వృద్ధులు, వికలాంగులు, మహిళలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వంట వార్పు చేసిన మహిళలు, బాకీ కార్డుల ఫ్లెక్సీతో పట్టణంలోని సాగర్ రోడ్డుపై భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎంసి కోటి రెడ్డి హాజరై మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, వృద్ధులు, వికలాంగులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూనినాదాలు చేశారు. ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి అని, హామీలు నెరవేర్చాలి ప్రజలకు న్యాయం చేయాలి అంటూ నినాదాలతో సాగర్ రోడ్డును హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో తిప్పన విజయసింహ రెడ్డి,ఎడవెల్లి శ్రీనివాస్ రెడ్డి,అన్నబీమోజు నాగార్జునచారి,ఎండి. యూసుఫ్, పెండ్యాల పద్మావతి, కుర్ర చైతన్య, షహనాజ్ బేగం, ధూళిపాల కళావతి, కోదాటి రమ, పెరుమాళ్ళ ధనమ్మ, చిత్రం ఉమా, గడ్డం దీపిక, గుడిసె జానకమ్మ, లావూరి అరుణ, సందేశ్ రజిని, జనపాల సునీత, పద్మశెట్టి లక్ష్మి, తీరంశెట్టి సీత, రేబిల్లి శ్రీజ, నూనె మమత, బంటు కాత్యాయని, నక్క సంధ్య, బల్లెం దేవకమ్మ, కమటాలస్వరూప,ఎండి. ఇలియాస్ ఖాన్,ఎండి. మగ్దుం పాషా, ఎండి. మాజీద్, ఎండి. షోయబ్, నామిరెడ్డి కరుణాకర్ రెడ్డి, కట్టా మల్లేష్ గౌడ్,అంగోతు హతిరాం నాయక్, కుందూరు వీరకోటి రెడ్డి, పూనాటి లక్ష్మీనారాయణ, శ్రీనివాస్ యాదవ్, షోయబ్, గుడిసె దుర్గాప్రసాద్, తుమ్మల ఫణి, బీఆర్ఎస్ వార్డు ఇంచార్జ్ లు రాంబాబు నాయక్, గయాస్, మస్తాన్, అలీమ్, మహిళలు, వృద్ధులు, వికలాంగులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పేదల వైద్యానికి అండగా సీఎం సహాయ నిధి



**భూపాలపల్లి, సెప్టెంబర్ 5(సింగిడి):** పేదల వైద్యానికి ప్రభుత్వం అండగా నిలుస్తుంది అని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. భూపాలపల్లి నియోజకవర్గంలో 27వ విడత ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ విడతలోని నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన 248 మంది లబ్ధిదారులకు రూ. 1,25,54,050 విలువైన చెక్కులను అందజేశారు. ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని వైద్య చికిత్సలకు సొంత డబ్బులు ఖర్చు చేసిన పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సుమారు 60 మందికి 70 రోజుల్లో ఆర్థిక సహాయం అందజే చర్యలు తీసుకున్నామని ఎమ్మెల్యే తెలిపారు. వైద్య ఖర్చులు భరించలేని వారు నిమ్స్ తదితర ఆసుపత్రుల నుంచి అంచనా వ్యయ పత్రం తీసుకొస్తే, అవసరాన్ని బట్టి రూ. 50వేల మంది రూ. 50లక్షల వరకు సీఎంఆర్ఎఫ్ ద్వారా సహాయం మంజూరు చేయించి చికిత్స తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఇప్పటికే సుమారు1,400 మందికి ముందస్తు ఆర్థిక సహాయం అందించి చికిత్స చేయించినట్లు గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. ముఖ్యమంత్రి సహాయనిధి, కళ్యాణ లక్ష్మి, రేషన్ కార్డులు తదితర ప్రభుత్వ పథకాలను పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి పేదవాడికి అందిస్తున్నామని పేర్కొన్నారు. పథకాల అమరులు అవినీతికి తావు లేకుండా పారదర్శకంగా వ్యవహరిస్తున్నామని అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గత ప్రభుత్వం దెబ్బతీసింది అని విమర్శించిన ఆయన ప్రస్తుత ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూ సంక్షేమ పథకాలను కొనసాగిస్తుందన్నారు. అక్టోబర్ 15 నుంచి అర్హులకు పెన్షన్ అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని తెలిపారు. బీసీలకు స్వయం ఉపాధి కోసం కుట్టుమిషన్లు, పేదలకు ఇందిరమ్మ ఇల్లు తదితర సంక్షేమ కార్యక్రమాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ శ్రీనివాస్, టౌన్ అధ్యక్షులు దాట్ల శ్రీనివాస్, కౌన్సిలర్లు అప్పం కిషన్, శ్రీనివాస్, వివిధ మండలాల ప్రజా ప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.


# వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలన విఫలం

- మహిళలు, వృద్ధులు, దివ్యాంగులతో బీఆర్ఎస్ వంటావార్పు నిరసన
- మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి



**నల్లగొండ ప్రతినిధి సెప్టెంబర్ 5(సింగిడి):** కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అన్ని వర్గాలను మోసం చేసిందని నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఆరోపించారు. నల్లగొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద మహిళలు, దివ్యాంగులు, వృద్ధులతో వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మహిళా నాయకులు, కార్పొరేటర్లు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ మహిళలకు నెలకు రూ. 2,500, వృద్ధులకు రూ. 4,000, దివ్యాంగులకు రూ. 6,000 పింఛన్, విద్యార్థినులకు స్కూటీలు ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, అయితే హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. ప్రభుత్వ తీరుపై వారు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కంచర్ల భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ "రేవంత్‌రెడ్డి నకిరేకల్‌కు ఎందుకు వస్తున్నారు? మా ప్రభుత్వ హయాంలో మంజూరైన ఆసుపత్రిని ప్రారంభించేందుకు వస్తున్నారు" అని అన్నారు. నకిరేకల్ పర్యటనకు వచ్చే ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళలకు నెలకు రూ. 2,500, వృద్ధులకు రూ. 4,000, దివ్యాంగులకు రూ. 6,000, మహిళలకు కళ్యాణలక్ష్మి కింద తులం బంగారం, రైతులు, కౌలు రైతులకు ఎకరాకు రూ. 15 వేల రైతుభరోసా, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి హామీలను అమలు చేసి నకిరేకల్‌కు రావాలని కోరారు. లేనిపక్షంలో ప్రజల నుంచి తీవ్ర నిరసనను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల ఆశలను నీరుగార్చిందని ఆరోపించారు. షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి పథకాలను నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, కేసీఆర్ కిట్, గ్యాస్ సిలిండర్ పథకాల విషయంలోనూ ప్రజలకు అన్యాయం చేసిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ నాయకులు కంచర్ల కృష్ణారెడ్డి, మాజీ కార్పొరేషన్ అధ్యక్షుడు కటికం సత్తయ్యగౌడ్, మాజీ ఆర్ఓ మాలే శరణ్యరెడ్డి, గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు రెగట్టే మల్లికార్జున్‌రెడ్డి, నల్లగొండ మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, బక్క పిచ్చయ్య, సింగం రామ్మోహన్, కంచనపల్లి రవీంద్రరావు, అభిమన్యు శ్రీనివాస్, పలువురు సింగిల్ విండో చైర్మన్లు, మాజీ ఎంపీపీలు, మాజీ జడ్పీటీసీలు, కార్పొరేటర్లు, మండల మహిళా అధ్యక్షులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మహిళలు తదితరులు హాజరయ్యారు.

## ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి మంత్రి పదవి?



**హన్మకొండ, సెప్టెంబర్ 5(సింగిడి):** కొండా సురేఖను క్యాబినెట్ నుంచి తొలగించాలని సీఎం రేవంత్‌రెడ్డి గవర్నర్‌కు సిఫార్సు చేయడంతో, ఆ ఖాళీ స్థానం కోసం వరంగల్ వెస్ట్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పేరు బలంగా వినిపిస్తోంది. సురేఖ కూతురు కొండా సుస్మితా పటేల్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అనుచిత వాఖ్య లు చేయదంతో నాయిని బహిరంగంగానే సురేఖ తొలగింపును సమర్థించారు. పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడిన వారెవరైనా క్రమశిక్షణా చర్య లు తప్ప వంటు వ్యాఖ్యలతో ఆయన సీఎం గుడ్ బుక్ లో పడ్డారు. ప్రస్తుతం ప్రభుత్వం బీసీ మహిళను తొలగించారనే విమర్శను ఎదుర్కోవడానికి స్పాట్ నిర్ణయంతో ముగ్గురు బీసీ మహిళలకు కీలక పదవులను అప్పగించింది. గద్వాల్ విజయలక్ష్మికి క్యాబినెట్ ర్యాంక్, నీరెల్ల శారదకు మహిళా కమిషన్, జి. సుధా రాణి (పద్మశాలి) కి కూడా చైర్ పర్సన్ పదవులను అప్పగించారు. సురేఖ తన మంత్రి పదవి స్థానాన్ని భర్తీ చేయాల్సి ఉంది. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో మంత్రి వర్గంలో వరంగల్ కు ప్రాతినిధ్యం లేనిపక్షంలో పార్టీకి మరింత వ్యతిరేకత వస్తుందనే నెపంతో జిల్లా నుండి, సీనియర్ నేత ప్రస్తుత పశ్చిమ ఎమ్మెల్యే అయిన నాయినిని మంత్రి వర్గంలోకి తీసుకుంటే బాగుంటుందనే ఊహగానాలు. వెలువడుతున్నాయి. నాయిని 2023లో బీ ఆర్ ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ ను ఓడించి గెలిచారు. గతంలో పార్టీ ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా ప్రస్తుతం ఎమ్మెల్యేగా హన్మకొండ, వరంగల్, కాజీపేట ట్రై సిటీలతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆయనకు మంచి ఫాలోయింగ్ ఉంది. కొండా కుటుంబానికి ప్రత్యామ్నాయంగా ఆయనను నియమించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యూహంగా తెలుస్తోంది. సురేఖ తొలగింపు నేపథ్యంలో విజయలక్ష్మి, శారద, సుధా రాణి నియామకాలు తక్షణమే అధికారికంగా జరిగిపోయాయి. కానీ మంత్రివర్గ విస్తరణలో వరంగల్ కోటాలో నాయిని పేరు దాదాపు ఖాయమైనట్లు కాంగ్రెస్ వర్గాల్లో ప్రచారం జరుగుతుంది. ఒకవేళ నాయినికి మంత్రి పదవి వస్తే, వరంగల్ జిల్లా కాంగ్రెస్ లో కొండా శకం ముగిసి, నాయిని – రేవూరి – నాగరాజు అనే కొత్త త్రయం మొదలైనట్లేనని పలువురి నేతలు భావిస్తున్నారు.

# ఆరు గ్యారంటీలలో ఎనభై శాతం హామీలు అమలు చేశాం

- హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఒడితెల ప్రణవ్




**కమలాపూర్, సెప్టెంబర్ 5(సింగిడి):** కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఎన్నికల హామీల ఆరు గ్యారంటీలలో ఎనభై శాతం హామీలు హమలు చేశామని హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఒడితెల ప్రణవ్ తెలిపారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం పై విమర్శలు చేస్తున్నారని మీ ప్రభుత్వ హయాంలో చేయలేని పనులను మేము ప్రజలకు చేసి చూపిస్తున్నామని అన్నారు. పేదలకు సన్నబియ్యం, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇండ్లు, రైతులకు ఉచిత కరంటు, ప్రతి గృహానికి రెండు వందల యూనిట్ల ఉచిత కరంటు బిల్లు ఇవన్నీ కూడా కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలనలో అమలు చేస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలనలో చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డికి అగుపిస్తా లెవా అని ప్రశ్నించారు. కమలాపూర్ మండలానికి వచ్చి వెయ్యి రోజుల పాలనపై ఇష్ట మచ్చినట్లు మాట్లాడావు కదా నీవు మీ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్సీ గా వెయ్యి రోజులు పని చేసావు కదా,నేను మా ప్రభుత్వం వెయ్యి రోజుల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ గా ఉండి ఎన్ని అభివృద్ధి పనులు చేసానో చర్చకు వస్తావా అని ఎమ్మెల్యే కు సవాల్ విసిరారు. నియోజకవర్గ పరిధిలో మొదటి విడతలో పేదలకు మూడు వేల ఐదు వందల ఇందిరమ్మ ఇండ్లు కట్టించామని మీ ప్రభుత్వ అయాంలో పేద వారికి ఒక్క ఇల్లు కూడా నిర్మించ లేని నీవు మా ప్రభుత్వాన్ని విమర్శించడం సిగ్గని పించడం లేదా కౌశిక్ రెడ్డి హెద్దేవా చేశారు. మండలంలో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పేదవారికి అందిస్తామని అందులో ఎవరైనా అనర్హులు ఉన్నట్లయితే అధికారులతో మాట్లాడి పేదవారికి న్యాయం చేస్తామని తెలిపారు. అదేవిధంగా రెండో విడతలో నియోజకవర్గానికి మరో రెండు వేల ఇండ్లు వస్తున్నాయని పేదలకు కట్టిస్తామని తెలిపారు. నియోజకవర్గంలో పేదలకు సంక్షేమ పథకాలు ప్రజా పాలనలో అందిస్తున్నామని తెలిపారు. కమలాపూర్ బస్టాండ్ నిర్మాణము పూర్తి చేసే బాధ్యత మా ప్రభుత్వం దే అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు వాసాల శ్రీనివాస్,వ్యవసాయ మార్కెట్ చైర్మన్ తౌటం ఝాన్సీరవిందర్,డైరెక్టర్లు,డిసిసి కార్యదర్శి మాట్ల రమేష్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలసాని రమేష్,వివిధ గ్రామాల సర్పంచ్ లు,ఉప సర్పంచులు,వార్డు సభ్యులు,మాజీ మండల అధ్యక్షుడు బొల్లం రాజిరెడ్డి,సీనియర్ నాయకులు తడక శ్రీకాంత్,కెత్త రవి,పాక చంద్రమౌళి,ఆకునూరి సాంబయ్య, ఎల్కటి అనిల్ ,మాట్ల కళ్యాణ్,గంధశ్రీ అనిల్,మండేద్దుల నాగరాజు,కమలాపూర్ ఉపసర్పంచి శ్రీనివాస్,యూత్ కాంగ్రెస్ నాయకులు ధర్మూల శ్రీకాంత్,నవీన్,పైసా శరత్,పలువురు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఈ హెర్బల్ టీలు తాగితే

# సూపర్ ఇమ్యూనిటీ చార్జ్



చినుకులు పడుతుంటే వేడివేడిగా ఏదైనా తాగాలనిపించడం అందరికీ సహజమే. అయితే, ఈ వర్షాకాలంలో సాధారణ చాయ్, కాఫీలకు బదులుగా మన ఆరోగ్యానికి మేలు చేసే హెర్బల్ టీలను ఎంచుకోవడం చాలా ఉత్తమం. వర్షాలు పడే సమయంలో గాలిలో తేమ శాతం పెరిగి బ్యాక్టీరియా, వైరస్‌లు వేగంగా వ్యాప్తి చెందుతాయి. దీనివల్ల రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు చాలా త్వరగా జలుబు, ఫ్లూ, గొంతు ఇన్ఫెక్షన్ల బారిన పడుతుంటారు. ఈ కాలానుగుణ వ్యాధుల నుండి మన శరీరాన్ని రక్షించుకోవడానికి మన వంటగదిలో దొరికే సహజసిద్ధమైన మూలికలతో తయారుచేసుకునే 3 రకాల హెర్బల్ టీలు అద్భుతంగా సహాయపడతాయి.



మొదటిది అల్లం – పసుపు హెర్బల్ టీ . అల్లం , పసుపు రెండింటిలోనూ శక్తివంతమైన యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ ఆక్సిడెంట్ గుణాలు పుష్కలంగా ఉన్నాయి. ఒక గ్లాసు నీటిలో కొద్దిగా అల్లం ముక్క, పావు చెంచా పసుపు వేసి బాగా మరిగించాలి. ఆ నీటిని వడకట్టి, కొద్దిగా నిమ్మరసం, తేనె కలుపుకుని తాగాలి. ఇది శరీరంలో చేరిన హానికరమైన టాక్సిన్లను బయటకు పంపడమే కాకుండా, గొంతు నొప్పి మరియు దగ్గు నుండి తక్షణ ఉపశమనాన్ని ఇస్తుంది.

రెండవది తులసి – మిరియాల కాషాయం టీ . ఆయుర్వేదంలో తులసికి ఉన్న ప్రాధాన్యత అంతా ఇంతా కాదు. గుప్పెడు తులసి ఆకులు, నాలుగు దంచిన మిరియాలు, చిన్న ముక్క దాల్చినచెక్కను నీటిలో వేసి సగం అయ్యే వరకు మరిగించాలి. ఈ టీ తాగడం వల్ల శ్వాసకోశ వ్యవస్థ క్లియర్ అవుతుంది. ముఖ్యంగా వర్షాకాలంలో వచ్చే వైరల్ జ్వరాలను నివారించడంలో ఈ టీ రక్షణ కవచంలా పనిచేస్తుంది.

మూడవది పుదీనా – (గ్రీన్ టీ). గ్రీన్ టీ ఆకులతో పాటు కొన్ని తాజా పుదీనా ఆకులను వేసి ఈ టీ తయారుచేసుకోవాలి. పుదీనాలో ఉండే మెంతాల్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. వర్షాకాలంలో వచ్చే కడుపు ఉబ్బరం, గ్యాస్ సమస్యలను దూరం చేయడంతో పాటు, ఇందులోని యాంటీ మైక్రోబయాల్ గుణాలు ఇన్ఫెక్షన్ల నుండి ఉపశమనాన్ని ఇస్తాయి. రోజుకు ఒక్కసారైనా ఈ హెర్బల్ టీలను మీ దినచర్యలో భాగం చేసుకోవడం వల్ల ఈ వర్షాకాలాన్ని ఎలాంటి అనారోగ్యాలు లేకుండా హాయిగా ఆస్వాదించవచ్చు.



## ఫ్యాన్ వేసుకుని

# యోగా చేస్తున్నారా..?

### ఇది మస్ట్‌గా తెలుసుకోండి!

ఈరోజుల్లో చాలా మంది ఫిట్‌నెస్ కోసం, మానసిక ప్రశాంతత కోసం ప్రతిరోజూ యోగా, ప్రాణాయామం వంటివి చేస్తున్నారు. అయితే యోగాను ప్రశాంతమైన ఆరుబయట వాతావరణంలో (బాల్కనీ లేదా మేడ పైన) చేసుకుంటే చాలా మంచిది.

కానీ నగరాల్లో ఉండే స్థలాభావ పరిస్థితులు, లేదా దోమల భయం వల్ల చాలా మంది తమ ఇళ్ల లోపలే యోగా చేయాల్సి వస్తోంది.



అలా గదిలో యోగా చేసేటప్పుడు ఉక్కపోతగా అనిపించడమో లేదా చెమటలు పట్టడమో జరుగుతుందని చాలా మంది ఫ్యాన్ లేదా ఏసీ వేసుకుంటారు. అయితే ఫ్యాన్ లేదా ఏసీ వేసుకుని యోగా చేయడానికి ప్రముఖ ప్రకృతి వైద్య నిపుణులు డాక్టర్ మంతెన సత్యనారాయణ రాజు తప్పుబడుతున్నారు. ఇలా యోగా చేయడం వల్ల ఆరోగ్యానికి ప్రయోజనాల కంటే నష్టాలే ఎక్కువంటున్నారు.

**ఫ్యాన్ కింద యోగా చేయడం వల్ల జరిగే నష్టం ఏమిటి?**

మనం యోగా లేదా ప్రాణాయామం చేసేటప్పుడు శరీరం లోపల వేడి పుడుతుంది. ఈ వేడి వల్ల శరీరంలోని వ్యర్థాలన్నీ చెమట రూపంలో బయటకు విసర్జించబడతాయి. ఇది ఒక సహజమైన డీటాక్స్ ప్రక్రియ. మీరు ఫ్యాన్ వేసుకోవడం వల్ల వచ్చే గాలికి చర్మం చల్లబడుతుంది. దీనివల్ల శరీరానికి పట్టాల్సిన చెమట పట్టదు.. వ్యర్థాలు లోపల నుండి బయటకు పోయే ప్రక్రియ చాలా స్లో అయిపోతుంది.

మనం ఉద్యోగాలు, వ్యాపారాల వల్ల రోజంతా ఏసీలు లేదా ఫ్యాన్ల కిందే కూర్చుంటాం. కనీసం యోగా చేసే ఆ అరగంట, గంట సేపైనా శరీరానికి చెమట పట్టక పోతే లోపలి వ్యర్థాలు బయటకు వెళ్లే పరిస్థితి ఉండదు.

మీరు గదిలో యోగా చేస్తున్నప్పుడు ఫ్యాన్ వేసుకోకుండా గది కిటికీలు, తలుపులు తెరిచి ఉంచడం మంచిది. దీనివల్ల గాలి లోపలికి, బయటికి ప్రవహిస్తూ ఉంటుంది.

ఫ్యాన్ లేకుండా యోగా చేసినప్పుడు చాలా చెమట పడుతుంది. ఈ చెమట వల్ల బాడీ డీటాక్స్ అయి, శరీరం లోపల పరిశుభ్రత పెరుగుతుంది. ఫలితంగా మీ ఒంటి దుర్వాసనలు తగ్గి, రోజంతా చాలా ఫ్రెష్‌గా, యాక్టివ్‌గా అనిపిస్తుంది.

శరీరం లోపలి వ్యర్థాలు బయటకు పోవాలంటే శరీరానికి చెమటలు పట్టాలి. కాబట్టి, ఇకపై యోగా లేదా ప్రాణాయామం చేసేటప్పుడు ఫ్యాన్లు వేసుకోకుండా చేసేందుకు ప్రయత్నించండి.



# అమ్మమ్మల కాలం నాటి ఆకుల స్నాక్స్ ..

### ఇలా చేసి పిల్లలకు పెడితే బయట జంక్ ఫుడ్ జోలికే వెళ్లరు!

**కావాల్సిన పదార్థాలు:**

ఒక కప్పు గోధుమ పిండి , ఒక కప్పు మెంతికూర , రెండు టేబుల్ స్పూన్స్ బియ్యపు పిండి, రెండు టేబుల్ స్పూన్స్ నెయ్యి, ఒక టేబుల్ స్పూన్ పచ్చిమిర్చి పేస్ట్ , ఒక టేబుల్ స్పూన్ జీలకర్ర , రుచికి సరిపడా ఉప్పు, అర టేబుల్ స్పూన్ కారం పొడి , అర టీ స్పూన్ నువ్వులు , తగినన్ని నీరు కూడా తీసుకోవాలి

**గోధుమ పిండి, మెంతి కూర బిస్కెట్స్ తయారీ విధానం:**

ముందుగా మెంతికూరను కూరను తీసుకుని వాటిని శుభ్రంగా కడిగి తరిగి పక్కన పెట్టుకోవాలి. ఒక గిన్నెలో ఒక టేబుల్ స్పూన్ గోధుమ పిండి, ఒక టేబుల్ స్పూన్ బియ్యపు పిండి, రుచికి సరిపడా ఉప్పు, ఒక టేబుల్ స్పూన్ కారం, అర టేబుల్ స్పూన్ జీలకర్ర, నువ్వులు వేసి బాగా కలుపుకోవాలి

గోధుమ పిండి, మెంతి కూర బిస్కెట్స్ స్టెప్ – 1: ఇప్పుడు దీనిలో తరిమిన మెంతికూర, ఇంకా దీనిలో నెయ్యి లేదా వెన్నె వేసి



చేత్తోనే మంచిగా కలుపుకోవాలి. ఇంకా దీనిలో కొద్దిగా నీరు పోస్తూ చపాతీ పిండిలాగా కలుపుకుని పక్కన పెట్టుకోవాలి. ఈ పిండిని ఇలాగే 10 నిమిషాలు మూతపెట్టి పక్కన పెట్టుకోవాలి. ఆ తర్వాత పిండిని తీసుకుని బిస్కెట్ లాగా చేసుకోవాలి.

**గోధుమ పిండి, మెంతికూర బిస్కెట్స్ స్టెప్ – 2 :**

ఇంకా మీ ఇంట్లో ఓవెన్ ఉంటే 180ీజ వద్ద 15–20 నిమిషాలు బేక్ చేయాలి. ఇంకా ఈ ఓవెన్ లేకపోతే పాన్‌లో మీడియం మంటపై రెండు వైపులా కాల్చుకోవాలి. ఇంకా ఈ బిస్కెట్లు గోల్డ్ కలర్లోకి మారిన తర్వాత బయటకు తీసి దీనిని చల్లారనివ్వాలి. పూర్తిగా చల్లారిన తర్వాత ఒక డబ్బాలో నిల్వ చేసుకుంటే కనీసం 10 నుంచి 15 రోజుల వరకు ఫ్రెష్‌గా ఉంటాయి. ఇంకా కొంచెం కసూరి మెంతి, మిరియాల పొడి దీనిలో కలిపితే ఈ బిస్కెట్లకు మంచి రుచి, వాసన వస్తుంది. ఇంకా వీటిని సాయంత్రం టీతో తింటే చాలా టేస్టీగా ఉంటాయి. ఇలా చేసి పిల్లలకు పెడితే బయట జంక్ ఫుడ్ జోలికే వెళ్లరు.

## పిక్సెల్ ఫోన్లకు నేటి నుంచే

# ఆండ్రాయిడ్ 17.. ఏయే ఫోన్లకంటే

గూగుల్ ఆండ్రాయిడ్ 17 (Android 17)ను విడుదల చేసింది. డివైజ్ సెక్యూరిటీ, ప్రొడక్టివిటీ, క్రియేటివ్ టూల్స్‌పై ప్రధానంగా ఫోకస్ చేసింది. ఈ వెర్షన్‌ను పిక్సెల్ ఫోన్లలో నేటి నుంచే అందుబాటులోకి తెచ్చింది. అదేవిధంగా పిక్సెల్ వాచ్‌ల కోసం వేర్ ఓఎస్ 7ను తీసుకొచ్చింది. పిక్సెల్ ఫోన్లకు నేటి నుంచి అందుబాటులోకి వచ్చిన ఆండ్రాయిడ్ 17 శాంసంగ్, ఒప్పో, వివో, వన్‌ప్లస్ వంటి ఇతర స్మార్ట్‌ఫోన్ కంపెనీలు ఈ ఏడాది చివరికల్లా ఆండ్రాయిడ్ 17ను విడుదల చేయనున్నాయి.

**ఆండ్రాయిడ్ 17 ఫీచర్లు ఏంటంటే..**

**బబుల్స్ ఫర్ మల్టీ టాస్కింగ్:** ఒక యాప్ రన్ అవుతుండగానే మరో యాప్‌ను స్క్రీన్‌పై భాగంలో ఫ్లోటింగ్ విండో మాదిరి సెట్ చేసుకోవచ్చు. అంటే ఒకేసారి రెండు యాప్‌లు వాడొచ్చన్నమాట. ఫోల్డబుల్, ట్యాబ్స్ కోసం ప్రత్యేకంగా రూపొందించింది.

**స్క్రీన్ రియాక్షన్స్:** థర్డ్ పార్టీ యాప్స్ అవసరం లేకుండానే సెల్ఫీ వీడియోతో పాటు స్క్రీన్ రికార్డింగ్ చేయొచ్చు.

**పోల్డబుల్ గేమింగ్ మోడ్:** ఫోల్డబుల్ ఫోన్ల కోసం ప్రత్యేకంగా ఈ ఫీచర్‌ను రూపొందించింది. 50:50 లేఅవుట్‌లో స్క్రీన్ పై భాగంలో గేమ్ రన్ అవుతుండగా కింది భాగంలో కంట్రోల్స్‌ను చూపిస్తుంది.

**సెక్యూరిటీ:** టెంపరరీ లొకేషన్ యాక్సెస్, సెలక్టివ్ కాంటాక్ట్ షేరింగ్‌ను కొత్తగా గూగుల్ తీసుకొచ్చింది. ఫోన్లు దొంగతనం జరిగిన సమయంలో డివైజ్ ప్రొటెక్షన్ ఫీచర్‌ను మరింత




మెరుగుపరిచింది. ఫింగర్ ప్రింట్ లేనిదే ఫోన్ లాక్ ఓపెన్ అవ్వదు.

వీటితో పాటు పిక్సెల్ ఫోన్లలోని జెమినై యాప్‌తో ఓమ్ని మోడల్ ఉపయోగించి ఫొటో, వీడియో రీమిక్స్, కస్టమ్స్ ఏఐ అవతార్‌ను క్రియేట్ చేయొచ్చు. ఇమేజ్‌లకు తగ్గ లిరిక్స్, ఒరిజినల్ మ్యూజిక్ ట్రాక్‌లను సృష్టించవచ్చు. మాన్యువల్ కాల్ స్క్రీనింగ్ తీసుకొచ్చింది. తెలియని నంబర్ల నుంచి వచ్చే కాల్స్‌ను ఆన్సర్ చేయకముందే స్క్రీన్‌కాల్ బటన్ నొక్కొచ్చు. గూగుల్ అసిస్టెంట్ మీ బదులు అవతలి వ్యక్తి పేరు, కాల్ చేయడానికి గల కారణాన్ని అడిగి తెలుసుకుంటుంది. త్వరలో జెమినై ఇంటెలిజెన్స్ ఫీచర్‌ను యాడ్ చేస్తామని గూగుల్ తెలిపింది.

పిక్సెల్ ఫోన్లు ఇవే

గూగుల్ పిక్సెల్ 6, 6 Pro, 6a, పిక్సెల్ 7, 7 Pro, 7a, పిక్సల్ ట్యాబ్, పిక్సెల్ ఫోల్డ్, పిక్సెల్ 8, 8 Pro, 8a, పిక్సెల్ 9, 9 Pro, 9 Pro XL, 9 Proఫోల్డ్, 9a, పిక్సెల్ 10, 10 Pro, 10 Pro XL,10 Pro ఫోల్డ్, 10 a మోడళ్లకు అందుబాటులోకి వచ్చింది.


గూగుల్ పిక్సెల్ వాచ్ 2, 3, 5 మోడళ్ల కోసం ప్రత్యేకంగా వేర్ ఓఎస్ 7 వెర్షన్ గూగుల్ అందుబాటులోకి తెచ్చింది. మ్యాచ్ స్కోర్స్, డెలివరీలు వంటి లైవ్ అప్‌డేట్స్‌ను సులువుగా తెలుసుకోవచ్చు. హెడ్‌ఫోన్స్, స్పీకర్స్, స్మార్ట్ టీవీలను సులువుగా కంట్రోల్ చేయొచ్చు. అదేవిధంగా వేర్‌ఓఎస్ 6తో పోలిస్తే బ్యాటరీ లైఫ్‌ను 10 శాతం వరకు మెరుగుపరిచింది.

## ఒక్క రోజులో మస్క్ షేర్ల లాభం..

# అంబానీ మొత్తం సంపదకు రెట్టింపు..!

ప్రపంచ ట్రిలియనీర్ ఎలాన్ మస్క్ సంస్థ స్పేస్ ఎక్స్ షేర్ల ధరలు రాకెట్‌లా దూసుకెళ్తున్నాయి. పబ్లిక్ ఇష్యూలో షేరు ధర 135 డాలర్లు కాగా.. ఇప్పటికే అది 200 డాలర్లు దాటేసింది. దీంతో ఆయన సంపదను ఇతర కుబేరుల సంపదతో పోలిక తెస్తూ నెటిజన్లు లెక్కలేస్తున్నారు. ఆ గణాంకాలు షాక్‌కు గురిచేస్తున్నాయి.

పబ్లిక్ ఇష్యూ అనంతరం భారీగా పెరుగుతోన్న మస్క్ కంపెనీ షేర్లు.. ఒక ట్రేడింగ్ రోజులో 14.71 శాతం ర్యాలీ అయ్యాయి. దాంతో ఆయన సంపద ఏకంగా 164.8 బిలియన్ డాలర్లు పెరిగింది. ఆ ఒక్కరోజు పెరుగుదలే భారతదేశ కుబేరుడు ముకేశ్ అంబానీ సంపద (వి89.7 ఎఅశ్రీశ్రీఱశీఅ) కంటే రెట్టింపు కావడం గమనార్హం ప్రస్తుతం మస్క్ నికర సంపద 1.3 ట్రిలియన్ డాలర్లుగా ఉంది. టెస్లా, స్పేస్‌ఎక్స్‌లో ఆయనకున్న



వాటాలే ప్రధాన ఆదాయవనరుగా ఉన్నాయి.

**అమెజాన్‌ను అధిగమించిన స్పేస్‌ఎక్స్**

మరోవైపు.. మస్క్ షేర్లు పెరిగిన రోజే అంబానీకున్న స్టాక్స్ ధరలు పెరిగాయి. దాంతో ఆయన నికర ఆస్తుల విలువ 965 మిలియన్ డాలర్లు (1.09 శాతం) ఎగబాకింది. మామూలుగా అయితే ఈ లెక్కలు అద్భుతమే. కానీ మస్క్ ఒక్క రోజులో పొందిన దాంతో పోల్చుకుంటే మాత్రం పరిగణనలోకి తీసుకోలేనంత తక్కువ కావడం గమనార్హం. కొందరు నెటిజన్లు మరో పోలిక కూడా తెచ్చారు. అదేంటంటే.. భారతదేశ జీడీపీ విలువ 4.15 ట్రిలియన్ డాలర్లు. ఆయన వ్యక్తిగత సంపద భారత్ జీడీపీలో నాలుగో వంతుకు సమానం కావడం గమనార్హం.

శుక్రవారం నాస్‌డాక్‌లో స్పేస్‌ఎక్స్ షేరు 150 డాలర్ల వద్ద లిస్ట్ అయింది. పబ్లిక్ ఇష్యూ ధర(135 డాలర్లు)తో పోలిస్తే ఇది 11% అధికం. ఈ కంపెనీలో మస్క్‌కు 480 కోట్ల షేర్లు ఉన్నాయి. దాంతో మస్క్ వ్యక్తిగత సంపద ఒక ట్రిలియన్ డాలర్లు దాటేసింది.

**2140 వరకు ఖర్చు పెట్టినా..**

ఇప్పుడు మస్క్ సంపద ()లో పెరుగుదల టాక్ ఆఫ్ ది వరల్డ్‌గా ఉంది. ఆయనకున్న ఒక ట్రిలియన్ డాలర్లను ఒక మిలియన్ మిలియన్ డాలర్లుగా చూడొచ్చు. ప్రతి గంటకు ఒక మిలియన్ డాలర్లు ఖర్చు పెట్టినా.. 2140 సంవత్సరం వరకు ఆ సంపద తరగదట. ఇంకా మిగిలే ఉంటుందని నెటిజన్లు లెక్కలేస్తున్నారు.

### రిలయన్స్ జియో ఐపీఓ..

### AGవీకు ముందే సెబీకి

# ముసాయిదా పత్రాలు?




*రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన టెలికాం విభాగం జియో ఇన్ఫోకామ్ తొలి పబ్లిక్ ఇష్యూకు (Reliance Jio IPO) సిద్ధమవుతోంది. మార్కెట్ ప్రతికూలతల వల్ల ఆలస్యమైన ఈ ఐపీఓ.. త్వరలో పట్టాలెక్కనుంది. ఈ మేరకు మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీకి ఈ వారమే ముసాయిదా పత్రాలు సమర్పించే అవకాశం ఉందని 'ఫైనాన్షియల్ టైమ్స్' తన కథనంలో పేర్కొంది. ఈనెల 19న నిర్వహించబోయే రిలయన్స్ ఇండస్ట్రీస్ ఏజీఎంకు ముందే డ్రాఫ్ట్ పేపర్లను సమర్పించే అవకాశం ఉందని తెలిపింది. ఈ ఐపీఓ ద్వారా సుమారు 4 బిలియన్ డాలర్లు (సుమారు రూ.36– 40 వేల కోట్లు) మేర మార్కెట్ నుంచి సమీకరించనుంది.*

గతేడాది నిర్వహించిన రిలయన్స్ ఏజీఎం సందర్భంగా జియో ఐపీఓ గురించి ముకేశ్ అంబానీ ప్రకటన చేశారు. 2026కు తొలి అర్ధభాగంలోనే జియో ఐపీఓ ఉంటుందని తెలిపారు. అయితే, ఈ ఏడాదిలో ఇప్పటి వరకు రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు విలువ 15 శాతం మేర క్షీణించడం, పశ్చిమాసియా ఉద్రిక్తతల వల్ల రిలయన్స్ ప్రధాన ఆదాయ వనరు అయిన పెట్రోకెమికల్ వ్యాపారంపై ప్రభావం పడడంతో లాభంలో 13 శాతం క్షీణత నమోదైంది. మరోవైపు మార్కెట్ ఒడుదొడుకుల నేపథ్యంలో ఐపీఓ మార్కెట్ మందగించింది. ఇప్పుడిప్పుడే పరిస్థితులు కుదుటపడుతున్న వేళ జియో సహా పలు కంపెనీలు ఐపీఓకు సన్నద్ధమవుతున్నాయి.

రిలయన్స్ ఇండస్ట్రీస్ వార్షిక సాధారణ సమావేశం ఈ శుక్రవారం జరగనుంది. ఈ సమావేశంలో జియో ఐపీఓపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది. దీంతోపాటు రిలయన్స్ రిటైల్ వ్యాపార విస్తరణ, దాని ఐపీఓ టైమ్‌లైన్‌కు సంబంధించి కీలక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. 2025–26 ఆర్థిక సంవత్సరానికి ఒక్కో షేరుకు రూ.6 చొప్పున ప్రకటించిన డివిడెండ్‌ను ఈ ఏజీఎంలో ఆమోదించనున్నారు. దీంతోపాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో పెట్టుబడులు, భవిష్యత్ ప్రణాళికలు; డేటా సెంటర్ల విస్తరణ ప్రణాళికల గురించి ప్రకటనలు వెలువడే అవకాశం ఉంది.

స్టాక్ మార్కెట్ Stock Market

## నాలుగో రోజూ

# రాణించిన సూచీలు..


### IDBI షేర్లు 18% పైకి




***ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా నాలుగోరోజూ రాణించాయి. మెటల్, పీఎస్‌యూ, కన్జ్యూమర్ డ్యూరబుల్స్ స్టాక్స్ సూచీలకు దన్నుగా నిలిచాయి. వడ్డీ రేట్లపై అమెరికా ఫెడరల్ రిజర్వ్ ఈ రాత్రికి నిర్ణయం ప్రకటించనున్న వేళ మదుపర్లు అప్రమత్తత పాటించారు. ఈ క్రమంలోనే సెన్సెక్స్ 347.14 పాయింట్ల లాభంతో 77,155.62 వద్ద ముగిసింది. నిఫ్టీ 96.55 పాయింట్ల లాభపడి 24,085.70 వద్ద స్థిరపడింది.***

సెన్సెక్స్ 30 సూచీలో ట్రెంట్, బీఈఎల్, ఎటర్నల్, టాటా స్టీల్, ఇన్ఫోసిస్ షేర్లు లాభపడ్డాయి. బజాజ్ ఫిన్‌సర్వ్, యాక్సిస్ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా, మారుతీ సుజుకీ షేర్లు నష్టాలు చవిచూశాయి. డాలరుతో రూపాయి మారకం విలువ 94.52గా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 79 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4329 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

టాటా మోటార్స్ పాసింజర్ షేర్లు అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. ఓ దశలో 10 శాతం మేర క్షీణించాయి. చివరికి 8.10 నష్టంతో రూ.361.70 వద్ద ముగిశాయి. టాటా గ్రూపునకు చెందిన లగ్జరీ కార్ల బ్రాండ్ అయిన జాగ్వార్ ల్యాండ్ రోవర్ భవిష్యత్ వృద్ధి అంచనాలు, మేనేజ్‌మెంట్ కామెంటరీ టాటా మోటార్స్ షేర్లపై ప్రభావం చూపాయి.ఐడీబీఐ బ్యాంక్ షేర్లు నేడు దూసుకెళ్లాయి. ఓ దశలో 18శాతం వరకు లాభపడ్డాయి. వ్యూహాత్మక వాటాల విక్రయానికి ప్రభుత్వం సిద్ధమవుతోందని, వచ్చే ఆర్థిక సంవత్సరానికల్లా పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియ పూర్తవుతుందన్న వార్తల నేపథ్యంలో షేర్లు రాణించాయి. చివరికి 16 శాతం లాభంతో రూ.89.60 వద్ద ముగిసింది.



ప్రభాతనవ సింగిడి ప్రతి రంగూ ఓ నిజం



# గురువుకు వందనం.. జ్ఞానదాతకు సత్కారం



**భిక్కనూర్, (సింగిడి):** బిక్కనూర్ చైతన్య విద్యానికేతన్ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ ఉపాధ్యాయులు, తెలుగు పండితులు, కవి సుదర్శనం రాజయ్య గారిని పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు కలిసి శాలువాతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. తదుపరి విద్యార్థులు ప్రతి ఒక్క ఉపాధ్యాయులను పూల మాలలతో సత్కరించి గురువుల సేవలను గుర్తుచేసుకుంటూ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. గురువులు అందించే జ్ఞానం, మార్గదర్శకత్వం విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో కీలకమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ భూర్ల రేణు కుమార్, హెడ్‌మాస్టర్ అశోక్ యాదవ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విశ్వభారతిలో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం




**కమలాపూర్ (సింగిడి):** డా సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం మండల కేంద్రంలో గల విశ్వభారతి పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల లోని ఉపాధ్యాయులను విద్యార్థులు సాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రపంచంలో అన్ని వృత్తులను సృష్టించే ఏకైక వృత్తి ఉపాధ్యాయ వృత్తి అని అన్నారు. ఉపాధ్యాయులు ప్రపంచానికి మార్గదర్శకులుగా ఉంటారని పిల్లలంతా ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు విని క్రమశిక్షణతో ఉత్తమ పౌరులుగా ఎదగాలని,సమాజం లో పేరు ప్రతిష్టలు పొందాలని తెలిపారు. తల్లి తండ్రి తరవాత స్థానం గురువులదే అని అన్నారు. వారు చెప్పిన మాటలు విని ఉన్నత స్థానాలు అధిరోహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈరోజు కార్యక్రమం లో పాఠశాల ప్రిన్సిపాల్ ఐ మధుబాబు,కరస్పాండెంట్ ఐ రాజకుమార్ ,ఉపాధ్యాయులు శశికళ, లావణ్య, ప్రవీణ్, హరికృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

## కాశింపల్లె నుండి రోడ్డు నిర్మాణం ఆపాలని ఎమ్మెల్యేకు వినతి



**కమలాపూర్, (సింగిడి):** ఎచ్ పి సి ఎల్ బాట్లింగ్ ప్లాంట్ కు లారీలు వెళ్లుటకు కొత్త రోడ్డు కాశిం పల్లె నుండి వద్దని పల్లె వాసులు శని వారం హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిని కలిసి వినతిపత్రం అంద చేసినట్లు పల్లె వాసులు తెలిపారు. ఈ సందర్భంగా కాశింపల్లె వాసులు మాట్లాడుతూ గతంలో రోడ్డు వేస్తామంటే పల్లె లో 150మంది వరకు చిన్న పిల్లలు ఉన్నారని చాలా గుడిసెలు కోల్పోతున్నామని పాత రోడ్డు బాగానే ఉన్నా కొత్త రోడ్డు మా పల్లె నుండి వద్దని అధికారులకు విన్న వించగా పరిస్థితులు అర్థము చేసుకొని రోడ్డు వేయడం మానుకున్నారని తెలిపారు. మళ్లి ప్రధానమంత్రి సడక్ యోజన క్రింద కొత్త రోడ్డు నిర్మాణం మా కాశింపల్లె నుండి పర్కాల హుజురాబాద్ రోడ్డులకు అను సంధానం చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారని అలా చేస్తే మా పిల్లల ప్రాణాలు, మా ప్రాణాలు పోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తంచేశారు. కాశింపల్లె వాసుల కూలి పనులకు, బండ కొట్టి జీవనం సాగిస్తున్నామని మాకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా మా బాధలు అర్థము చేసుకుని రోడ్డు వేయకుండా చూసి న్యాయం జరిగే విదంగా చూడాలని ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని కోరినట్లు పల్లే వాసులు తెలిపారు. ఈ కార్య క్రమంలో ఇస్మాయిల్,ఖాసీం, అలీ,ఖాసీం, హెలీ, పలువురు పల్లె వాసులు పాల్గొన్నారు.

## గురువుల పాత్రపై విద్యార్థుల అక్షర యజ్ఞం



**భిక్కనూర్, (సింగిడి):** ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని పీఎం శ్రీ బాలికల పాఠశాలలో మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీరామ్ వెంకటేష్ ఆధ్వర్యంలో శుక్రవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 'సమాజ స్థాపనలో ఉపాధ్యాయుల పాత్ర' అంశంపై నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మండల విద్యాధికారి రాజా గంగారెడ్డి మాట్లాడుతూ.. ఇలాంటి పోటీలు విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆలోచనా శక్తిని పెంపొందిస్తాయని అన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన స్వాతి, విజ్ఞాన్, లావణ్య శ్రావణిలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## యోగాసన పోటీలను విజయవంతం చేయాలి

-తెలంగాణ యోగ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కరుణాకర్ రావు



**కాటారం, (సింగిడి):** కాటారం మండల కేంద్రంలోని ఆదర్శ హైస్కూల్‌లో ఈ నెల 6న (నేడు) నిర్వహించే జిల్లా స్థాయి యోగాసన పోటీలను విజయవంతం చేయాలని తెలంగాణ యోగ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు జనగామ కరుణాకర్‌రావు కోరారు. శనివారం కాటారం డీఎస్పీ కార్యాలయంలో జిల్లా స్థాయి యోగాసన పోటీల పోస్టర్లను డీఎస్పీ సూర్యనారాయణ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జనగామ కరుణాకర్‌రావు మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు, క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటాలని కోరారు. పోటీల్లో పాల్గొనే వారికి ఉచిత రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. యోగా సాధనతో శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని, విద్యార్థులు చిన్ననాటి నుంచే యోగాను అలవర్చుకోవాలని అన్నారు. జిల్లా స్థాయి యోగాసన పోటీలను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి జిల్లా అథ్లెటిక్స్ చైర్మన్ పంతకాని సమ్మయ్య, యోగ సాధకులు మధు, కుమార్ యాదవ్, డాక్టర్ రఫీ, అంగజాల అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## దివ్య-రాజుల నిశ్చితార్థ వేడుకకు హాజరైన ప్రముఖులు

– పెద్దతుండ్ల సర్పంచ్ నర్సింగం, వార్డు సభ్యుడు బండ విష్ణువర్ధన్ రెడ్డి,



**మల్హర్ (సింగిడి):** తాడిచెర్ల కందునూరి రజిత--సదయ్య దంపతుల కుమార్తె దివ్య, రాజుల నిశ్చితార్థవేడుక శనివారం కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, ఆత్మీయుల సమక్షంలో ఘనంగానిర్వహించారు. ఈ శుభకార్యానికి సర్పంచ్ నర్సింగం, వార్డు సభ్యుడు బండవిష్ణువర్ధన్ రెడ్డి, కుమారస్వామి, రాఘవచారి అయ్యగారు, రాంబాబు తదితరులుహాజరై నూతన జంటను ఆశీర్వదించారు. దివ్య--రాజులు సుఖసంతోషాలతో నిండునూరేళ్లు వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలోకుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు పాల్గొని నూతన జంటకు ఆశీస్సులు అందజేశారు.

## పురవీధుల్లో ఊరేగిన శ్రీకృష్ణుడు



**మహాదేవపూర్ (సింగిడి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంతో పాటు బొమ్మపూర్, బ్రాహ్మణపల్లి, గ్రామాలలో పురవీధుల్లో శ్రీకృష్ణుడు ఊరేగింపు ఘనంగా జరిగింది. శ్రీకృష్ణ జన్మాష్టమి మరుసటి రోజు మండల కేంద్రంలోని శ్రీ మందరగిరి ఆలయం నుండి భాజా భజంత్రీలతో శ్రీకృష్ణ రథయాత్ర పుర వీధులలో తిరగడం ఆనవాయితీగా వస్తుంది. శ్రీకృష్ణుడికి గ్రామాలలో మంగళ హారతులు ఇచ్చి స్వామివారి ఆశీర్వాదాన్ని తీసుకున్నాడు.

# ప్రజా సంక్షేమ లక్ష్యం...: ఎమ్మెల్యే రామచంద్రునాయక్



**మరిపెడ, (సింగిడి):** మహబూబాబాద్ జిల్లా మరిపెడ పట్టణంలో శనివారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గుగులోత్ రవి నాయక్ ఆధ్వర్యంలో ప్రజాపాలన 1000 రోజుల పాలనపై పట్టణంలోని ఖమ్మం,వరంగల్ జాతీయ రహదారిపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహిం చారు. ఈ యాత్రలో ప్రభుత్వ విప్-డోర్నకల్ శాసనసభ్యుడు డాక్టర్ జాటోతు రాంచంద్రు నాయక్,రాష్ట్ర పరిశీలకుడు అవీజ్ ఖాన్,జిల్లా కాంగ్రెస్ నాయకుడు ఒంటికొమ్ము యుగంధర్ రెడ్డి,మున్సిపల్ చైర్ పర్సన్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గం ఎమ్మెల్యే మాట్లాడుతూ 1000 రోజుల ప్రజా పాలనలో ప్రజా సంక్షేమనికై అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని,తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఇచ్చిన మాట ప్రకారం ఆరు(గ్యారంటీలు)హామీల అమలులో ముందుకు సాగుతోందని తెలిపారు. గత పాలకుల మాదిరిగా మాటలు మాత్రమే చెప్పకుండా ప్రజల మధ్య లో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ పార్టని అన్నారు.

**కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలు:**
మహాలక్ష్మి:మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం. గృహజ్యోతి:ప్రతి పేద కుటుంబానికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు,రైతు భరోసా ప్రతి ఏటా రైతులకు ఎకరాకు 12 వేల రూపాయలు,రుణమాఫీ ద్వారా రైతులకు భరోసా కల్పించింది. ఇందిరమ్మ ఇండ్లు ఇల్లు లేని నిరుపేదలకు అన్ని సౌకర్యాలతో ఇండ్ల నిర్మాణం చేపట్టమన్నారు. ర్యాలీలో భారీగా పాల్గొన్న నాయకులు,కార్యకర్తలు ఈ ర్యాలీలో పురపాలక సభ్యులు జాటోతు సురేష్,మెరుగు రాము,తిరుపతి,నీలా లచ్చిరాం,రాములు,కో ఆప్షన్ సభ్యులు గుండగాని వెంకన్న, షేక్ అజీజ్,సర్పంచులు పెండ్లి శ్రీనివాస్ రెడ్డి,తొట్టి గౌతమ్,తప్పెట్ల శ్రీనివాస్, సైదులు,రమేష్, అమృనాయక్,పట్టణ అధ్యక్షుడు పానుగోతు రాంలాల్,కే సముద్రం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఐలమల్లు,జిల్లా సభ్యుడు కుడితి నరసింహ రెడ్డి, తాజోద్దీన్,జిల్లా యువజన విభాగ ఉపాధ్యక్షుడు విజయ్,కొంపెల్లి సురేందర్ రెడ్డి,అఫ్జల్,గంధసిరి అంబరీష్,మహ్మద్ అప్సర్,అలువాల ఉపేందర్,గంధసిరి భిక్షపతి,దేవరశెట్టి లక్ష్మినారాయణ,నల్లు శ్రీకాంత్ రెడ్డి,ముదిరెడ్డి బుచ్చి రెడ్డి, గుండగాని వేణు,గంధసిరి సోమన్న,వెర్మరెడ్డి వెంకట్ రెడ్డి,కుడితి వెంకట్ రెడ్డి, బోడ రవి,మహేందర్,చీనా నాయక్,పడిదం రాధిక,యాకుబ్ పాషా, అనంతగిరి శ్రీను,సాయి,బుచ్చిరెడ్డి,గండి వీరభద్రం,బోడ రమేష్, రఘునందన్ రెడ్డి, సాజీద్, సయ్యద్ సర్వర్ పాషా,కారంపూడి ఉపేందర్,లక్ష్మణ్, కృష్ణమూర్తి, మేకల కృష్ణ, శంకర్,రంజిత్,లింగన్న,వీరన్న,చింతల వెంకన్న,అనంతగిరి రవి,పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆయా పాఠశాలల్లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం





**కాటారం, (సింగిడి):** భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త, విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ 138వ జయంతిని పురస్కరిం చుకుని కాటారం మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర కళాశాల, కస్తూర్బా పాఠశాల, ధన్వాడ జెడ్పి హెచ్ఎస్ పాఠశాల, ఆయా పాఠశాలల్లో శనివారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. పుష్పగుచ్ఛాలు అందించి, శాలు వాలతో సత్కరించి గురువుల పట్ల తమ కృతజ్ఞతాభా వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ తమ జీవితాలను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో గొప్పదని కొనియాడారు. డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యారంగానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకం



**కమలాపూర్, (సింగిడి):** సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకం అని మండల విద్యాశాఖ అధికారి ఈ శ్రీదర్ అన్నారు. శనివారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల వనరుల కేంద్రంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా విద్యారం గంలో విశేష సేవలు అందిస్తున్న ఎ చంద్రకళ,ఎం అన్నపూర్ణ, జిల్లా పరిషత్ బాలికల పాఠశాల, కమలాపూర్ ,జి సునీత జిల్లా పరిషత్ బాలుర పాఠశాలకమలాపూర్, రేవతి జిల్లా పరిషత్ బాలికల పాఠశాల ఉప్పల్, ఎ మల్లయ్య ఎం పి పి ఎస్ మర్రిపల్లి గూడెం, బి జ్యోష్ణ ఎం పి పి ఎస్ భీంపెల్లి, వి వెంకటరాజం, కె రజని ఎం పి పి ఎస్ పంగిడిపల్లి, టి వీరేశం ఆదర్శ పాఠశాల కమలాపూర్, పి శ్రీనివాస్ సి ఆర్ పి జిల్లా పరిషత్ బాలికల పాఠశాల ఉప్పల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు మండల ఉత్తమ ఉపాధ్యాయులు గా ఎంపిక కావడంతో వారిని శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ సంద ర్భంగా విద్యాశాఖాధికారి శ్రీదర్ మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధి, పాఠశాలల ప్రగతి, బోధనలో నూతన పద్ధతుల అమలు మరియు సమాజానికి అందిస్తున్న సేవలను గుర్తిస్తూ ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేశారని తెలిపారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ వారి భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం శివప్రసాద్, సన్మాన గ్రహీతలు, పలువురు ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఉపసర్పంచ్‌ల మహిళా విభాగం ఆవిర్భావ సదస్సు తరలిరండి

## ఉప సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షురాలు తుంగల శ్రీజ



**మహాదేవపూర్ (సింగిడి):** ఉప సర్పంచ్ చెక్ పవర్ భవిష్యత్తులో మహిళా ఉపసర్పంచ్లు కూడా రాజకీయంగా ఎదగాలని మహిళా విభాగం ఏర్పాటుచేసిన ఉపసర్పంచ్ ల ఫోరం తెలంగాణ రాష్ట్ర మహిళా విభాగం ఆవిర్భావ సభలో జిల్లా లోని మహిళా ఉపసర్పం చులు పాల్గొని విజయవంతం చేయాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల ఉపసర్పంచ్ ల ఫోరం అధ్యక్షురాలు తుంగల శ్రీజ సంతోష్ తెలిపారు. సందర్భంగా మాట్లాడుతూ కొందరు సర్పంచులు చేసేటువంటి అవినీతి పనులకు అడ్డుగా ఉంటున్నారు అంటూ ఉప సర్పంచ ల చెక్ పవర్ తొలగించడానికి సర్పంచులు చేస్తున్న కుట్రలను తిప్పి కొట్టడం, సిరాఫలకాలపై సర్పంచ్ తో పాటు ఉపసర్పంచ్ పేరు చేర్చడం, ఉప సర్పంచ్ కు 5000, వార్డు సభ్యులకు 3000 గౌరవ వేతనం, ఇందిరమ్మ కమిటీకి చైర్మన్గా సర్పంచ్ ఉండటం తో పాటు వైస్ చైర్మన్గా ఉపసర్పంచ్ చేర్చడం లాంటి డిమాండ్లతో సభ నిర్వహిస్తున్నారని అన్న వివరించారు. నేడు హైదరాబాదులో కంట్రీ క్లబ్ లో జరిగే ఈ ఆవిర్భావ సభను జిల్లాలోని మహిళ ఉపసర్పంచ్ లందరూ వచ్చి పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

## వడ్డేమాన్‌లో శ్రీశనేశ్వర స్వామికి వైభవంగా శ్రావణ నవమి తిలతైల అభిషేక పూజలు



**బిజినపల్లి (సింగిడి):** శ్రీ పరాభవ నామ సంవత్సరం శ్రావణ మాసం క్రిష్ణ పక్షం శ్రావణ నవమి శనివారం మృగశిర నక్షత్రము నాడు బీజీనేపల్లి మండలం పరిధిలోని నంది వడ్డేమాన్ గ్రామంలో గల శ్రీశనేశ్వర స్వామికి భక్తులచే శని గ్రహదోష నివారణకు స్వామివారికి తిలతైలా అభిషేకలు వేద మంత్రోచ్ఛారణల మధ్య భక్తి శ్రద్ధలతో జరిగాయి. శ్రీసార్థాసప్త జేష్టమాత సమేత శనేశ్వర స్వామికి శనివారం నాడు ప్రత్యేకంగా తిలతైల అభిషేకాల పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు డాక్టర్ గవ్వమఠం విశ్వనాథ శాస్త్రి మాట్లాడుతూ ఈ మాసంలో స్వామివారిని కొలిచిన సంతృప్తి పొంది విశేష ఫలితాన్ని భక్తులకు ఇస్తారని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరు జన్మ రిత్యా,గోచార రీత్యా శనిగ్రహ దోష నివారణకు స్వామివారిని శక్తిమేరకు పూజించాలని అన్నారు. ఈ ఆలయంలో గోన బుద్ధారెడ్డి కాలంనాటి బ్రహ్మసూత్రం గల పరమశివునికి భక్తులచే రుద్రాభిషేక పూజలు, అర్చనలు,దీపారాధన నందీశ్వర స్వామి వారికి ప్రత్యేక అర్చనపూజలు భక్తులచేనిర్వహించారు. అనంతరం భక్తులకు వేద ఆశీర్వచనం తీర్థ ప్రసాదాల పంపిణీ చేశారు. ఈకార్యక్రమం లో ఆలయ ఆలయ చైర్మన్ వెల్దండ గోపాల్ రావు, గ్రామ సర్పంచ్ టి. సుగుణమ్మ,కమిటీ సభ్యులు కెంచె రాజేష్, ప్రభాకరచారి,పుల్లయ్య, అడ్వకేట్ వీర శేఖర్ చారి, శ్రీకాంత్ రెడ్డి, ఆలయ అర్చకులు శాంతి కుమార్, ఉమమహేశ్వర్, సిబ్బంది గోపాల్ రెడ్డి భక్తులు,మహిళలు పాల్గొన్నారు.

## దస్తగిరిపల్లెలో ఉపాధ్యాయులకు సన్మానం

**నల్లబెల్లి, (సింగిడి):** నల్లబెల్లి మండలంలోని దస్తగిరిపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయులను గ్రామ ప్రజాప్రతినిధులు, పాఠశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి గ్రామ సర్పంచి పులి రమేష్, గ్రామ కార్యదర్శి శ్రావణ్ హాజరై ఉపాధ్యాయులను శాలువాలు, పూలమా లలతో సత్కరించారు. విద్యార్థుల జీవితాల్లో ఉపాధ్యాయులు మార్గదర్శకు లుగా వ్యవహరిస్తారని, విద్యార్థుల్లో జ్ఞానంతోపాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యతలను పెంపొందించడంలో వారి పాత్ర ఎంతో కీలకమని వారు పేర్కొన్నారు. ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు బలమైన పునాది వేయడం ద్వారా వారి భవిష్యత్తుకు ఉపాధ్యాయులు బాటలు వేస్తున్నారని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థుల విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమని తెలిపారు. విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడంతోపాటు, తల్లిదండ్రులతో సమన్వయం చేసుకుంటూ పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా తమను సన్మానించిన గ్రామ ప్రజాప్రతినిధులు, పాఠశాల సిబ్బందికి ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.



## సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించాలి



**బిక్నూర్, (సింగిడి):** రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించడంతో పాటు ఆరోగ్యకరమైన పంటలు పండించేందుకు సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహిం చాలని బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు సూచించారు. బిక్నూర్ మండలం రామేశ్వర్‌పల్లిలో శాశ్వత యోగి సేంద్రియ వ్యవసా యంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. సేంద్రియ పద్ధతులతో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడు లు సాధించే విధానాలను రైతులకు వివరించారు. అలాగే ధ్యానం ద్వారా మనస్సును ప్రశాంతంగా ఉంచుకుంటూ వ్యవసాయం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను తెలిపారు. బ్రహ్మకుమారీస్ ఓంశాంతి పార్క్, కామారెడ్డి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మౌంట్ అబూ నుంచి వచ్చిన రాజయోగి బీకే సుమంత్ భాయ్ జీ రైతులను ఉద్దేశించి ప్రసం గించారు. కార్యక్రమంలో బీకే సంతోషి, బీకే సమత, బీకే రాజు, బీకే నారాయణ, బీకే చక్రపాణి, బీకే స్పందన తదితరులు పాల్గొన్నారు.

## ఇండిగో పైలెట్‌గా ఎంపికైన మనోజ్ నాయక్..!

పైలట్ మనోజ్ నాయక్ ఎంపిక పట్ల హర్షం వ్యక్తం చేసిన గిరిజన నాయకులు.



**హుస్నాబాద్, (సింగిడి):** చిన్నప్పటినుండి పైలట్ గా మారాలని కోరికను నిజం చేసుకొని ఇండిగో పైలట్ కు ఎంపికైన మనోజ్ నాయక్ కు అభినందనలు వెలువెత్తుతున్నాయి. హుస్నాబాద్ మండలం బల్లు నాయక్ తండ గ్రామ పంచాయతీకి చెందిన లావుద్య బిక్షపతి గాయత్రిల కుమారుడు లావుద్య మనోజ్ నాయక్ చిన్నప్పటి నుండి పైలట్ కావాలనే బలమైన కోరిక ఉండేది. ఆ కోరికను నిజం చేసుకోవాలని పట్టుదలతో చదివి శిక్షణ పొంది ఇండిగో పైలెట్ గా ఎంపిక కావడం జరిగింది. మామూలు గిరిజన తండాకు చెందిన మనోజ్ నాయక్ తల్లిదండ్రులు వృత్తిరీత్యా ఉపాధ్యాయులు గిరిజన తండా నుంచి ఆకాశపు అంచుల దాకా ఎగిరి కలను నిజం చేసుకున్న పైలెట్ కు హుస్నాబాద్ నియోజకవర్గ గిరిజన నాయకులు అభినందనలు తెలిపారు. ఇంటర్మీడియట్ చదివిన తర్వాత ఎన్నో కష్టాలను అధిగమించి పైలెట్ గా శిక్షణ పొంది తర్వాత హుస్నాబాద్ ప్రాంతం నుంచి ఒక గిరిజన బిడ్డ పైలెట్‌గా మారడం పట్ల మాకు ఎంతో సంతోషంగా ఉందని తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.

పచ్చని హుస్నాబాద్ లక్ష్యంగా..

## ఇంటింటికీ మొక్కల పంపిణీ

వార్డు కౌన్సిలర్లతో కలిసి మొక్కలు పంపిణీ చేసిన చైర్మన్ దండి లక్ష్మి.



**హుస్నాబాద్ (సింగిడి):** హుస్నాబాద్ పట్టణంలో వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా 3వ, 13వ, 16వ వార్డుల్లో ఇంటింటికీ మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ దండి లక్ష్మి మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, పట్టణ ప్రజలందరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని కోరారు. మొక్కలు నాటడం ద్వారా పట్టణంలో పచ్చదనం పెరగడంతో పాటు భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. వన మహోత్సవాన్ని కేవలం ఒక కార్యక్రమంగా కాకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకుని మొక్కలను నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో 3వ వార్డు కౌన్సిలర్ కొండా రజిత, 13వ వార్డు కౌన్సిలర్ బుల్లి శ్రీనివాస్, 16వ వార్డు కౌన్సిలర్ వైద్యం కిరణ్ కుమార్, మున్సిపల్ అధికారులు, మెప్మా ఆర్పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

## కారుకొండ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

గురువులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత: సర్పంచ్ ఉషారాణి శేఖర్‌రావు



**బిజినపల్లి, (సింగిడి):** బిజినపల్లి మండలం కారు కొండ ప్రాథమికోన్నత పాఠశాలలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులను గ్రామ పెద్దలు, గ్రామ సర్పంచ్ ఉషారాణి శేఖర్‌రావు, ఉప సర్పంచ్ కాటగౌని శ్రీనివాస్‌గౌడ్ సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఉషారాణి శేఖర్‌రావు మాట్లాడుతూ సమాజంలో గురువుకు అత్యున్నత స్థానం ఉందని, ఉపాధ్యాయులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. సమాజాన్ని మార్చడంతో పాటు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే శక్తి గురువులకు ఉందని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవిత విశేషాలను వివరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్ద గడ్డంపల్లి రాధాకృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు ఇంద్రాణి, భాగ్యలక్ష్మి, శ్రీకాంత్, లావణ్య, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడికి ఘన సన్మానం.



**నల్లబెల్లి, (సింగిడి):** ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని నల్లబెల్లి మండలం నాగరాజు పల్లి పంతులుపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు కర్ణకంటి రామ్మూర్తి, కూనమళ్ల రాజన్‌బాబులను శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికైన కర్ణకంటి రామ్మూర్తిని ప్రత్యేకంగా అభినందిస్తూ శాలువా, పూలమాలతో సత్కరించారు. నాగరాజుపల్లి గ్రామ సర్పంచి ఎరుకల లలిత రఘు, ఉపసర్పంచి శోభన, మద్ది మేడారం చైర్మన్ పబ్బు రాజేష్‌గౌడ్, వార్డు సభ్యుడు ఊటుకూరు కృష్ణ, ఎం.వి.పల్లి మాజీ సర్పంచి ఆసం చంద్రమౌళి, కార్యదర్శి రాకం విష్ణు తదితరులు పాల్గొని రామ్మూర్తిని ఘనంగా సత్కరించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ వారి భవిష్యత్తునుతీర్చి దిద్దడంలో రామ్మూర్తి అందిస్తున్న సేవలు అభినందనీయమని వారు పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా గుర్తింపు పొందడం గ్రామానికి గర్వకారణమన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు.

### లక్ష్మీ వెంకటేశ్వర కళామండలి

## కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



**కమలాపూర్, (సింగిడి):** మండల కేంద్రంలోని లక్ష్మీ వెంకటేశ్వర కళామండలి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు ఈటల సమ్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం లక్ష్మి వెంకటేశ్వర కళామండలి సభ్యు లు శనివారం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన అధ్యక్షులు పబ్బు రాజు, ఉపాధ్యక్షులు తోడేటి సుధాకర్, ప్రధాన కార్యదర్శి మేడిపల్లి రాంబాబు, కోశాధికారి పచ్చిమట్ల శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులు మార్క మొగిళి, తోడేటి చిన్న సదానందం, గౌరవ సలహాదా రులు జక్కు రాజబోసు, తోడేటి రాజు లను లక్ష్మీ వెంకటేశ్వర కళామండలి సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని సమ్మయ్య తెలిపారు.

### మాజీ వార్డ్ సభ్యురాలు మల్లవ్వకు నివాళులు



**హుస్నాబాద్ (సింగిడి):** అక్కన్నపేట మండలం గౌరవెల్లి మాజీ వార్డు సభ్యురాలు దున్నపోతుల మల్లవ్వ అనారోగ్యంతో శనివారం మరణించారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ పాంద్రాల దాము ఆమె పార్థివ దేహానికి నివాళులర్పించి వారి కుటుంబానికి అన్ని విధాల భరోసా కల్పిస్తానని హామీ ఇచ్చారు. మల్లవ్వ వార్డు సభ్యులుగా ఉన్నప్పుడు వడ్డెర కాలనీ సమస్యల మీద తన గలం వినిపించేదని అన్నారు. ఆమె మరణం తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంట వార్డు సభ్యులు దండుగుల సురేష్, మాజీ వార్డు సభ్యులు కొమ్ముల శ్రీను, కుంచం కనకయ్య, మల్లేష్, తదితరులు, పాల్గొన్నారు.

### నన్ను విమర్శించే స్థాయి నీకు లేదు

## ఇంటికొచ్చి తేల్చుకో

### ఎమ్మెల్సీ దండే విఠల్‌కు కోనేరు కోనప్ప సవాల్



**కాగజ్‌నగర్ (సింగిడి):** ఉమ్మడి ఆదిలాబాద్ కాంగ్రెస్ ఎమ్మెల్సీ దండే విఠల్ నిన్నటి రోజున విలేకరుల సమావేశంలో చేసిన వ్యాఖ్యలపై సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. శనివారం కాగజ్‌నగర్‌లోని తన నివాసం లో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేసిన ఆయన, ఎమ్మెల్సీ విఠల్‌కు బహిరంగ సవాల్ విసిరారు. రాజకీయ నేపథ్యంపై దండే విఠల్ నువ్వు కేవలం చెంచాగిరి చేసి ఎమ్మెల్సీ పదవి సంపాదించావు. నన్ను విమర్శించే ముందు నీ స్థాయి ఏంటో గుర్తుంచుకో. నీ రాజకీయ నేపథ్యం ఏంటో, ప్రజల్లో నీకున్న ఆదరణ ఏంటో అందరికీ తెలుసు అని తీవ్రంగా దుయ్యబట్టారు. 2024 లోక్‌సభ ఎన్నికల గణాంకాలను గుర్తుచేస్తూ నువ్వు బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు నీకు దక్కింది కేవలం 17 వేల ఓట్లే. కానీ నేను అదే సమయంలో కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు ప్రజలు నాకు 63 వేల ఓట్ల మెజారిటీ కట్టబెట్టార అని వ్యాఖ్యా నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు మళ్లింపు వ్యవహారంలో ఎమ్మెల్సీ వైఖరిని కోనప్ప తీవ్రంగా తప్పుపట్టారు. 2024 వరకు తుమ్మిడి హెట్టి లేదా కాళేశ్వ రం ప్రాజెక్టుల తరలింపు పై ఎందుకు పెదవి విప్పలేదు కనీసం అధికారుల కు లేదా ప్రభుత్వానికి ఒక వినతిపత్రం కూడా ఎందుకు ఇవ్వలేకపోయా రని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు మిన్నకుండి, ఇప్పుడు పెద్ద పెద్ద మాటలు మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు.

**ఇంటికొచ్చి తేల్చుకో ..**

విఠల్ చేసిన హెచ్చరికలపై కోనప్ప స్పందిస్తూ నా నాలుక కోస్తానని విలేకరుల సమావేశంలో విర్రవీగావు. ఖబర్దార్ బిడ్డా నా వెంట్రుక కూడా పీకలేవు నాకు ఇప్పుడు ఎలాంటి గన్‌మెన్లు లేరు, నీకు మాత్రం భద్రత ఉంది. అయినా సరే నేను భయపడే ప్రసక్తే లేదు. నేను నా ఇంట్లోనే ఉంటా. దమ్ముంటే రా, ఎవరి సత్తా ఏంటో ప్రత్యక్షంగా తేల్చుకుందాం అని ఘాటుగా సవాల్ చేశారు. ప్రజల ఆశీర్వాదమే తన కొండంత బలమని, స్థాయికి మించి మాట్లాడటం మానుకోవాలని ఎమ్మెల్సీని హెచ్చరించారు

# పెండింగ్ కేసుల పరిష్కారంలో వేగం పెంచాలి

### హుస్నాబాద్ డివిజన్‌లో కేసులపై ఏసీపీ సదానందం సమీక్ష



**హుస్నాబాద్ (సింగిడి):** హుస్నాబాద్ డివిజన్ పరిధిలోని పోలీస్ స్టేషన్లలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను పారదర్శకంగా, చట్టబ ద్ధంగా, త్వరితగతిన పరిష్కరించాలని హుస్నాబాద్ ఏసీపీ సౌదారపు సదానందం అధికారులను ఆదేశించారు. స్థానిక ఏసీపీ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్సైలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. తీవ్రమైన నేరాలకు సంబంధించిన కేసుల్లో ప్రాథమిక ఆధారాలను వెంటనే సేకరించి, నిర్ణీత గడువులోగా కోర్టుల్లో చార్జిషీట్లు దాఖలు చేయాలని సూచించారు. రాజీపడదగిన చిన్నపాటి సివిల్, క్రిమినల్ కేసులను గుర్తించి, జాతీయ లోక్ అదాలత్ ద్వారా ఇరువర్గాల అంగీకారంతో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మహిళలు, వృద్ధులు, చిన్నారులపై జరిగే నేరాల విచారణను వేగవంతం చేసి బాధితులకు తక్షణ న్యాయం అందేలా చూడాలని ఆదేశించారు. సైబర్ నేరాలు, ఆర్థిక మోసాల కేసుల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించి నిందితులను పట్టుకోవాలని సూచించారు. రాత్రి వేళల్లో పోలీస్ గస్తీని మరింత పెంచాలని, కోర్టులు జారీ చేసిన ఎన్‌బీడబ్ల్యూలను పెండింగ్‌లో ఉంచకుండా నిందితులను వెంటనే కోర్టు ముందు హాజరుపరచాలని స్పష్టం చేశారు. బాధితు లకు సత్వర న్యాయం అందించడమే పోలీస్ శాఖ ప్రథ మ కర్తవ్యమని, విధుల్లో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాధితులు నిర్భయంగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసేలా ప్రజాహిత వాతావరణాన్ని కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో హుస్నాబాద్ సీఐ శ్రీధర్, చేర్యాల సీఐ రమేష్, ఎస్సైలు లక్ష్మారెడ్డి, అభిలాష్, ప్రశాంత్, అసిఫ్, మహేష్, అపూర్వ పాల్గొన్నారు.

### మహిళా ఉపాధ్యాయులకు ఘన సన్మానం



**బోధన్ ప్రతినిధి, (సింగిడి):** బోధన్ పట్టణంలో లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ అయ్యప్ప సేవ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులు ఇందూరు లలిత , వంచ సునీత లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు లయన్ కుమ్మరి పోశెట్టి, సెక్రెటరీ లయన్ గుడిపల్లి గంగారెడ్డి, కోశాధికారి లయన్ సురా బత్తుని శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# ముల్కనూర్ పీహెచ్‌సీలో వైద్యం కరువు!

### పెరుగుతున్న రోగులు.. అందుబాటులో లేని వైద్యులు! .. నామమాత్రంగా సేవలు!



**ప్రైవేటు ఆసుపత్రులే దిక్కా?**

ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండి, అవసరమైన సౌకర్యాలు కల్పిస్తే పేద, మధ్యతరగతి ప్రజలు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన అవసరం ఉండదని స్థానికులు అంటున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా, ప్రజాప్రతినిధులు మారుతున్నా ముల్కనూర్ ఆసుపత్రి పరిస్థితుల్లో మాత్రం మార్పు రావడం లేదని వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వైద్య సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించి, అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు ముల్కనూర్ పీహెచ్‌సీని ఉన్నతీకరించి 24 గంటల వైద్య సేవలు అందించాలని ప్రజలు సంబంధిత ఉన్నతాధికారులను కోరుతున్నారు.

**24 గంటల వైద్యం ఎప్పుడొస్తుంది?**

ముల్కనూర్ మండలంలోని మేజర్ గ్రామం కావడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కూడా ఈ ఆసుపత్రిపై ఆధారపడుతున్నారు. పీహెచ్‌సీని ఉన్నతీకరించి 24 గంటల వైద్య సేవలు అందించాలని స్థానికులు గత కొంతకాలంగా డిమాండ్ చేస్తున్నప్పటికీ, ఇప్పటివరకు ఆ దిశగా ఆశించిన స్థాయిలో చర్యలు కనిపించడం లేదని విమర్శిస్తున్నారు.

**భీమదేవరపల్లి (సింగిడి):** మండలంలోని ప్రధాన గ్రామమైన ముల్కనూర్‌లో ప్రజలకు మెరుగైన వైద్యం అందించాల్సిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. రోజురోజుకూ వైద్య సేవల కోసం వచ్చే రోగుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ, అందుకు అనుగుణంగా వైద్య సిబ్బంది, మౌలిక సదుపాయాలు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శనివారం ఉదయం 11 గంటల సమయంలో పీహెచ్‌సీకి వైద్యం కోసం పలువురు రోగులు రావడంతో ఆసుపత్రి వద్ద రద్దీ కనిపించింది. అయితే వైద్యులు అందుబాటులో లేకపోవడంతో అక్కడ ఉన్న నర్సు, ఫార్మాసిస్టు మాత్రమే రోగులను పరిశీలించి మందులు అందించినట్లు రోగులు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో వైద్యుడు అందుబాటులో లేకపోవడం ఆందోళన కలిగిస్తోందని వారు పేర్కొన్నారు.





## భూ హక్కుల కోసం పోరుబాట.. మహాదీక్షకు కదిలిన కాటారం బీజేపీ శ్రేణులు


### చల్ల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు తరలివెళ్లిన నాయకులు, కార్యకర్తలు

**కాటారం, (సింగిడి):** తెలంగాణలో పేదల భూ హక్కుల పరిరక్షణ, భూ సమస్యల పరిష్కారం కోసం భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద శనివారం నిర్వహించిన 'భూ భారతి మహాదీక్ష'కు కాటారం మండలం నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చల్ల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ ముఖ్య నేతలు, ప్రతినిధులు ఉదయాన్నే హైదరాబాద్‌కు బయలుదేరారు. ఈ సందర్భంగా చల్ల నారాయణరెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో పేదల భూ హక్కులను పరిరక్షించడంతో పాటు, భూ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న బాధితులకు అండగా నిలిచేందుకే మహాదీక్ష చేపట్టామని తెలిపారు. ప్రజలకు న్యాయం జరిగే వరకు బీజేపీ పోరాటం ఆపదని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు బొమ్మన భాస్కర్‌రెడ్డి, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు కేతిరి రాజయ్య, యువ మోర్చా మండల అధ్యక్షుడు సాయిరెడ్డి, ఎస్సీ



మోర్చా అధ్యక్షుడు జాడి లక్ష్మణ్, మండల ప్రధాన కార్యదర్శి గోగుల రాజేష్, దుర్గం సురేష్, ప్రభాస్ తదితరులు పాల్గొన్నారు.



## ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైర్ తగిలి మూడేళ్ల బాలుడి మృతి

### వీరభద్రనగర్‌లో విషాద ఘటన.. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది

**భీమదేవరపల్లి (సింగిడి):** నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విషాద ఘటన చోటుచేసుకుంది. ఎర్త్ వైర్ తగలడంతో మూడేళ్ల బాలుడు మృతి చెందిన ఘటన హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వీరభద్రనగర్‌లో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. తండాకు చెందిన బానోతు సంపత్ కుమారుడు రిషి (3) నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలోకి వెళ్లగా ఎర్త్ వైర్ తగిలినట్లు తెలిపారు. విద్యుత్ షాక్‌కు గురైన బాలుడు మృతి చెందినట్లు స్థానికులు పేర్కొన్నారు. ఈ ఘటనతో కుటుంబ సభ్యులు, స్థానికుల్లో విషాదం నెలకొంది. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



## ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

**భీమదేవరపలి (సింగిడి):** మండలం లోని ముత్తారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు లక్కిరెడ్డి రాజిరెడ్డి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శనివారం ముత్తారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఊరడి భారతి జైపాల్ రెడ్డి, ఉపసర్పంచ్ మాట్ల హరికుమార్, ముల్కనూర్ క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు వసంత రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రియదర్శిని తదితరులు రాజిరెడ్డిని శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు పాఠశాల అభివృద్ధికి ఆయన చేస్తున్న సేవలను కొనియాడారు. అనంతరం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన లక్కిరెడ్డి రాజిరెడ్డిని ఘనంగా సన్మానించి అభినందించారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా గుర్తింపు పొందడం ముత్తారం గ్రామానికి, పాఠశాలకు గర్వకారణమని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరేష్, సిఆర్పి మాదుగుల హిమసాగర్, అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షురాలు మాదుల నిర్మల, వార్డు సభ్యురాలు పొర్నందుల నవిత, ఫీల్డ్ అసిస్టెంట్ మహేందర్, గ్రామస్తులు బుసుమల్ల రాజు, రేణిగుంట్ల విద్యాసాగర్, అనూష, కోమల, మమత తదితరులు పాల్గొన్నారు.



## నారాయణ స్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

**నిజామాబాద్ ప్రతినిధి, (సింగిడి):** నగరంలోని సుభాష్ నగర్‌లోని నారాయణ స్కూల్ లో భారతదేశ మాజీ రాష్ట్రపతి, గొప్ప తత్వవేత్త, విద్యావేత్త డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయుల వేషధారణలో తరగతులను నిర్వహిస్తూ, ఒకరోజు ఉపాధ్యాయులుగా తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుత భావన ఉపాధ్యాయ వృత్తిపై గౌరవాన్ని పెంపొందించేలా సాగింది. అనంతరం పాఠశాల ఏజీఎం సూర్యవంశి శివాజీ పటేల్ పాఠశాల ఉపాధ్యాయులను ఘనంగాసన్మానించి, ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని, వారి సేవలు సమాజానికి ఎంతో విలువైనవని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చందన, పాఠశాల సిబ్బంది పాల్గొని ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించడం ద్వారా వారి బాధ్యతలను అర్థం చేసుకోవడంతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకుంటారని తెలిపారు. వేడుకల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## కేబుల్ దొంగల ముఠా అరెస్ట్..

### బిక్కనూర్ పోలీసులకు ఎస్పీ అభినందన



**భిక్నూర్, సెప్టెంబర్5(నినాదం)** భిక్నూర్ మండలంలోని వ్యవసాయ పొలాల్లో బోర్ మోటార్ కేబుల్ వైర్లను దొంగిలిస్తున్న నలుగురు వ్యక్తులను భిక్నూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. దొంగిలించిన కేబుళ్లను కాల్చి రాగి తీగలను వేరు చేసి స్క్రాప్ షాపుల్లో విక్రయిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఉగ్రవాయి, బస్వాపూర్, అంతంపల్లి శివారుల్లో కేబుల్ వైర్లను దొంగిలించినట్లు విచారణలో వెల్లడైంది. మరిన్ని దొంగతనాలకు వెళ్తుండగా భిక్నూర్ బస్టాండ్ వద్ద అనుమానాస్పదంగా కనిపించిన నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి కట్టర్లు, ఇనుప రాడ్, మొబైల్ ఫోన్, రాగి తీగలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని కోర్టులో హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. దొంగతనాలను ఛేదించడంలో చురుకుగా వ్యవహరించిన భిక్నూర్ సీఐ నరేశ్, ఎస్సై అనిల్, సీసీఎస్ కామారెడ్డి, భిక్నూర్ పోలీసు సిబ్బందిని కామారెడ్డి ఎస్పీ అభినందించారు.

### పారిశుధ్యం పడకేసింది...

### గ్రామాల్లో సమస్యలపై గంప గోవర్ధన్ పర్యటన



**బిక్కనూర్, సెప్టెంబర్5(నినాదం)** గ్రామాల్లో నెలకొన్న పారిశుధ్య సమస్యలను పరిశీలించేందుకు మాజీ ప్రభుత్వ విప్, బీఆర్ఎస్ పార్టీ కామారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి గంప గోవర్ధన్ ఆదివారం జిల్లాలో పర్యటించనున్నారు. గ్రామపంచా యతీల పరిధిలో పారిశు ధ్య నిర్వహణ సరిగా లేకపోవడం, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా పరిశీలించి సంబంధిత అంశాలపై ప్రజలతో మాట్లాడనున్నట్లు మాజీ మండల పార్టీ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి తెలిపారు. బిక్కనూర్ మండలం లోని జంగంపల్లి గ్రామంలో ఆదివారం ఉదయం 10:30 గంటలకు కార్యక్రమం ప్రారంభం కానుందని, గ్రామాల్లో పారిశుధ్య పరిస్థితులు, ప్రజల సమస్యలను పరిశీలించడమే ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

### మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు

### రుద్రగూడెం క్రాస్ వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు.



**నల్లబెల్లి, (సింగిడి):** మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్న వారిపై నల్లబెల్లి పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా నల్లబెల్లి ఎస్ఐ సాయి ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది శనివారం రుద్రగూడెం క్రాస్ వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన రహదారిపై రాకపోకలు సాగిస్తున్న వాహనాలను పోలీసులు ఆపి తనిఖీ చేశారు. వాహనదారులు మద్యం సేవించి వాహనం నడుపుతున్నారా అనే విషయాన్ని పరిశీలించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల డ్రైవింగ్‌పై నియంత్రణ కోల్పోయి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు. మద్యం సేవించి వాహనం నడపడం ద్వారా సొంత ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పు వాటిల్లుతుందని ఎస్ఐ సాయి ప్రసన్నకుమార్ హెచ్చరించారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపకుండాబాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం కొనసాగిస్తామని ఎస్ఐ తెలిపారు.

ప్రభాతనవ
సింగిడి
SINGIDI తెలుగు దినపత్రిక
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
ఆదివారం
6-9-2026

## విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేది గురువులే

### ఎంఈఓ రాజీ మంజూషా



**బోధన్ ప్రతినిధి,(సింగిడి):** విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేది గురువులేనని సాలురా ఎంఈఓ రాజీ మంజుషా అన్నారు. సాలూరా మండల కేంద్రంలోని పియంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమైనదని, విద్యార్థులను భావి భారత ఉత్తమ పౌరులుగా తీర్చి దిద్దడంలో గురువులే మార్గదర్శకులని కొనియాడారు. అనంతరం ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## దశాబ్దాలుగా సాగు.. పాస్‌పుస్తకాలు మాత్రం లేవు!

### నిరుపేద రైతులకు తక్షణమే యాజమాన్య హక్కులు కల్పించాలి: చెప్యాల ప్రకాష్




**భీమదేవరపల్లి(సింగిడి):** తరతరాలుగా భూమిని సాగు చేసుకుంటూ జీవిస్తున్న నిరుపేద రైతులకు వెంటనే పట్టాదారు పాస్‌పుస్తకాలు జారీ చేసి సంపూర్ణ యాజమాన్య హక్కులు కల్పించాలని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
శనివారం ముల్కనూర్ లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన పేదలు దశాబ్దాలుగా సీలింగ్, ఇనాం, అసైన్డ్, అటవీ, ప్రభుత్వ భూములను కష్టపడి సాగులోకి తెచ్చుకున్నప్పటికీ, నేటికీ పాస్‌పుస్తకాలు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పాస్‌పుస్తకాలు లేకపోవడంతో బ్యాంకు రుణాలు, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందడం లేదన్నారు. ప్రజా ప్రభుత్వం పేదల పక్షపాత పాలన అని చెప్పుకుంటున్న రేవంత్ సర్కారు, అసైన్డ్ కమిటీని పునరుద్ధరించి అర్హులైన పేదలకు యాజమాన్య హక్కులు కల్పించాలని, భూమిలేని నిరుపేదలను గుర్తించి భూ పంపిణీ చేపట్టాలని కోరారు. ఈ అంశంపై శాసనసభలో ప్రత్యేక తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే బాధితుల తరపున ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

## బీరంగూడ డివిజన్ కాలనీల సమస్యలు పరిష్కరించాలి

### జోనల్ కమిషనర్ నారాయణ అమిత్ ఐఏఎస్‌కుశశిధర్ రెడ్డి వినతి



**అమీన్‌పూర్, (సింగిడి):** బీరంగూడ డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలలో పెండింగ్‌లో ఉన్న మౌలిక వసతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ అమీన్‌పూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శశిధర్ రెడ్డి, కాలనీ వాసులతో కలిసి సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ శేరిలింగంపల్లి జోన్ జోనల్ కమిషనర్ నారాయణ అమిత్ ఐఏఎస్‌ను కలిశారు. ఈ సందర్భంగా బీరంగూడ డివిజన్ పరిధిలోని మల్లారెడ్డి కాలనీ, మారుతి నగర్ కాలనీ, లక్ష్మీ సాయి మెడోస్, వందనపురి కాలనీ, బీహెచ్ఎల్ మెట్రో, ఎన్ఎస్ఎల్ కాలనీ, లింగమయ్య కాలనీ, సృజన లక్ష్మీనగర్ కాలనీ, ఉసుకేబావి తదితర ప్రాంతాల్లో నెలకొన్న పలు సమస్యలను జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.
కాలనీలలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పరిశీలించి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా రోడ్లు, డ్రైనేజీ, పారిశుధ్యం, ఇతర మౌలిక వసతుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. పెండింగ్ పనులకు అవసరమైన చర్యలు తీసుకుని పనులను సత్వరమే ప్రారంభించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కాలనీ వాసులతో కలిసి సమస్యల వివరాలతో కూడిన వినతిపత్రాన్ని జోనల్ కమిషనర్ నారాయణ అమిత్ ఐఏఎస్‌కు అందజేశారు. సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చినట్లు శశిధర్ రెడ్డి తెలిపారు.

## విద్యార్థుల భవిష్యత్తుకు ఉపాధ్యాయులే దిక్సూచి: శ్రీరాములు



**రాజేంద్రనగర్,(సింగిడి):** డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని మనికొండ ఎంపీపీఎస్ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మనికొండ కాంగ్రెస్ పార్టీ డివిజన్ నాయకులు బుధోలు శ్రీరాములు పాఠశాల ఉపాధ్యాయులను శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. బుధోలు శ్రీరాములు మాట్లాడుతూ.. సమాజ నిర్మాణంలో, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమైందని అన్నారు. బాల్యం నుంచే పిల్లలకు నాణ్యమైన విద్యతో పాటు మంచి విలువలు, క్రమశిక్షణను అందిస్తూ వారిని ఉన్నత శిఖరాలకు చేర్చడంలో ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. విద్యార్థుల జీవితంలో తొలి అడుగు నుంచే సరైన మార్గనిర్దేశం చేస్తూ వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తున్న గురువుల సేవలు మరువలేనివని పేర్కొన్నారు. అనంతరం ఉపాధ్యాయులందరికీ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకల్లో నార్సింగి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎర్పులా కుమార్, కాంగ్రెస్ నాయకులు శ్రవణ్ కుమార్, సంతోష్, సురేష్ గౌడ్, శివగంగ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పుట్ట మధు వ్యాఖ్యలను ఖండించిన కాంగ్రెస్ నేతలు



కాటారం, (సింగిడి): మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు శుక్రవారం కాటార మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలి వద్ద చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని కాటారం సబ్‌డివిజన్‌లోని ఐదు మండలాల కాంగ్రెస్ నాయకులు అన్నారు. శనివారం కాటారంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ పుట్ట మధు ప్రతిపక్ష నాయకుడిగా ప్రజా సమస్యలను ప్రస్తావించాల్సింది పోయి వ్యక్తిగత ఆరోపణలు, అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఐదేళ్లు ఎమ్మెల్యేగా, ఐదేళ్లు పెద్దపల్లి జెడ్పీ చైర్మన్‌గా పనిచేసిన పుట్ట మధు హయాంలో జరిగిన అభివృద్ధి, పాలనపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుపై పుట్ట మధు చేసిన వ్యాఖ్యలను ఖండించారు. శ్రీధర్‌బాబు తండ్రి దుద్దిళ్ల శ్రీపాదరావు చేసిన సేవలను కూడా గుర్తుంచుకోవాలని సూచించారు.

**అభివృద్ధి కనిపించడం లేదా?**

కాంగ్రెస్ ప్రజాపాలన ప్రభుత్వం 1000 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను పుట్ట మధు కళ్లుమూసుకుని మాట్లాడుతున్నారని విమర్శించారు. మంథని నియోజకవర్గంలో మంత్రి శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో చేయలేని అనేక పనులను కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు రైతుభరోసా, రేషన్ కార్డుల పంపిణీ వంటి పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో పెండింగ్‌లో ఉన్న రేషన్ కార్డుల పంపిణీని ప్రజాపాలనలో చేపట్టామని పేర్కొన్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధి, కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని కాంగ్రెస్ నాయకులు సవాల్ చేశారు. కాటారం అంబేద్కర్ కూడలి వద్దకు పుట్ట మధు వస్తే కాంగ్రెస్ నాయకులు కూడా చర్చకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శీను బాబుపై అనుచిత వ్యాఖ్యలు చేయడం పుట్ట మధు అజ్ఞానానికి నిదర్శనమని విమర్శించారు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని, ఇకనైనా వ్యక్తిగత ఆరోపణలు మానుకోవాలని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఐదు మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు, జిల్లా కాంగ్రెస్ నాయకులు, సీనియర్ నాయకులు, మహిళా కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## విధి నిర్వహణలో అప్రమత్తతతో పాటు వ్యక్తిగత భద్రత కూడా ముఖ్యం

### తొర్రూరు పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్





**తొర్రూరు, (సింగిడి):** విధి నిర్వహణలో అప్రమత్తతతో పాటు పోలీస్ సిబ్బంది వ్యక్తిగత భద్రతకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని మహబూ బాబాద్ జిల్లా ఎస్పీ డా. శబరీష్ సూచించారు. శనివారం తొర్రూరు పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన స్టేషన్‌లోని వివిధ విభాగాలను పరిశీలించారు. స్టేషన్ పరిసరాలు, నిర్బంధ గది, రైటర్స్ గది తదితర ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణ, సిబ్బంది విధులు, బాధ్యతలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిధిలో నిశాంతిభద్రతలు, నేర నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై సబ్‌ఇన్‌స్పెక్టర్‌తో సమీక్ష నిర్వహించారు. నేర సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియలు, డిజిటల్ విధానాల వినియోగం, సీసీ కెమెరాల పర్యవేక్షణ, రాత్రి వేళల్లో గస్తీ, గ్రామాల సందర్శన తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. అనుమానితుల జాబితాలు, రౌడీ షీట్ల నిర్వహణతో పాటు అందులో ఉన్న వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని, అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. గంజాయి అక్రమ రవాణా, వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాలని, నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ చట్టపరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గుడుంబా తయారీ, విక్రయాలపై కఠినంగా వ్యవహరించాలని, అక్రమ మద్యం నియంత్రణకు నిరంతర తనిఖీలు నిర్వహించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై తనిఖీలు క్రమం తప్పకుండా నిర్వహించాలని ఆదేశించారు. మద్యం సేవించి వాహనం నడిపే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రమాదాలకు అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి రాత్రి వేళల్లో గస్తీ, వాహన తనిఖీలను మరింత పటిష్టం చేయాలని ఆదేశించారు. వినాయక చవితి సందర్భంగా గణేష్ విగ్రహాల ఏర్పాటు, అనుమతులు, భద్రతా చర్యలు, నిర్వాహకులతో సమన్వయం తదితర అంశాలపై కూడా వివరాలు తెలుసుకున్నారు. పండుగ సందర్భంగా శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది సంఖ్య, వారి విధులు, బాధ్యతలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్థానిక బందోబస్తు విధుల్లో పాల్గొనే ప్రతి పోలీస్ సిబ్బంది తప్పనిసరిగా రక్షణ పరికరాలు, విధి నిర్వహణకు అవసరమైన లాఠీ, ఇతర భద్రతా సామగ్రిని వెంట తీసుకెళ్లాలని సూచించారు. ప్రజల భద్రత ఎంత ముఖ్యమో విధులు నిర్వహించే పోలీస్ సిబ్బంది భద్రత కూడా అంతే ముఖ్యమని ఎస్పీ స్పష్టం చేశారు. విధి నిర్వహణలో అప్రమత్తతతో పాటు వ్యక్తిగత భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని, విధుల పట్ల పూర్తి బాధ్యత, అంకితభావంతో పనిచేయాలని సిబ్బందికి సూచించారు. ఈ తనిఖీలో తొర్రూరు డీఎస్పీ కృష్ణ కిషోర్, తొర్రూరు సీఐ గణేష్, ఎస్ఐలు మహేందర్‌రెడ్డి, ఖాదర్ పాషా, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బాచుపల్లి ఐదు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు సన్మానం.

### సమాజాభివృద్ధిలో గురువు పాత్ర ఎనలేనిది: మాజీ సర్పంచ్ కార్పొరేటర్ ఆగం పాండు ముదిరాజ్.









**కుత్బుల్లాపూర్(సింగిడి):** కుత్బుల్లా పూర్ నియోజక వర్గం నిజాంపేట మున్సిపల్ కార్పొ రేషన్ మాజీ సర్పంచ్, మాజీ కార్పొరేటర్ ఆగం పాండు ముదిరాజ్ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బాచుపల్లి పరిధిలోని మొత్తం 5 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన సుమారు 100 మంది ఉపాధ్యాయులను ఆయన శాలువాలతో సత్కరించి, మేమెంటో అందజేసి మిఠాయిలు తినిపించి ఘనంగా సన్మానించారు. వాటిలో భాగంగా బాచు పల్లిలో 2 పాఠశాలలు, ఇందిరానగర్ లో 1, రాజీవ్ గాంధీ నగర్ లో 1 పాఠశాల, సాయినగర్ కాలనీలో 1 పాఠశాల ఉపాధ్యాయులను సత్కరించి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజాభివృద్ధిలో గురువు పాత్ర చిరస్మరణీయమని పేర్కొన్నారు. గురువులను గౌరవిస్తేనే పెద్దలను గౌరవించిన వారు అవుతామని ఆగం పాండు ముదిరాజ్ తెలిపారు. గురుబ్రహ్మ, గురుర్విష్ణుః గురుదేవో మహేశ్వరః గురు సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీ గురవే నమః అనే శ్లోకాన్ని ప్రతి విద్యార్థి స్మరణ చేసు కుంటూ తమకు విద్య నేర్పిన గురువులను త్రిమూర్తు లతో సమానంగా గౌరవిస్తూ ఆరాధించాలని సూచించారు.

## ఘనంగా శ్రీ ఆత్మలింగ మహాగణపతి దేవస్థానంలో ధ్వజస్తంభ ప్రతిష్టాపన







**మల్కాజిగిరి, (సింగిడి):** మల్కాజిగిరి లోని బాల సరస్వతి నగర్ లో గల శ్రీ ఆత్మ లింగ మహాగణపతి దేవస్థానంలో శనివారం ఆలయ అర్చకులు శివ శర్మ ఆధ్వర్యంలో ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచనం, రక్షబంధనం, మూల మంత్ర హోమం, యంత్ర ప్రతిష్టాపన, ధ్వజస్తంభ ప్రతిష్టాపన, ఆలయ దిగ్బలి, మహా పూర్ణాహుతి నిర్వహించి, ధ్వజస్తంభ ప్రతిష్టాపన చేపట్టారు. ఈ మహా అద్భుతమైనటువంటి కార్యక్రమాలలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విఘ్నేశ్వరునికి పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టగా పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ వారు పులిపాక కృష్ణమూర్తి, పులిపాక కాంతారావు, దేశం యాదగిరి గౌడ్, గుజ్జుక వెంకటేష్, బోడికే మనోహర్, బి మహేష్, ఎస్ వి కృష్ణారెడ్డి, శ్రీనివాస్, గోపాల్, డి మహేష్, మధు గౌడ్, సంపత్, అంబదాస్, సురేందర్, మహిళా భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కర్ నాయక్





**పెబ్బేరు, (సింగిడి):** పెబ్బేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ భాస్కర్ నాయక్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని సాధారణ రోగుల నమోదు పుస్తకం, ప్రసవాల నమోదు పుస్తకం, ఆసుపత్రిలో చేరిన రోగుల నమోదు పుస్తకం, సిబ్బంది హాజరు పట్టికలను పరిశీలించారు. ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్యను మరింత పెంచేందుకు వైద్య సిబ్బంది కృషి చేయాలని డీఎంహెచ్ఓ సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వ్యాప్తిని అరికట్టేందుకు ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు ప్రతి మంగళవారం, శుక్రవారం తప్పనిసరిగా పొడి దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టి దోమల వృద్ధికి అడ్డుకట్ట వేయాలని ఆదేశించారు. పెబ్బేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నర్సింగ్ అధికారుల కొరతను గుర్తించినట్లు డాక్టర్ భాస్కర్ నాయక్ తెలిపారు. ఇప్పటికే ఇద్దరు నర్సింగ్ అధికారులను నియమించినట్లు వెల్లడించారు. త్వరలోనే కొత్త వైద్యుడిని కూడా నియమించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలకు వైద్య సేవలు మరింత మెరుగ్గా అందేలా ఆసుపత్రి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ తనిఖీలో పల్లె దవాఖాన వైద్యురాలు డాక్టర్ సుధారాణి, ఆరోగ్య విస్తరణ అధికారి దామోదర్, నర్సింగ్ అధికారి రావు, ఆరోగ్య పర్యవేక్షకురాలు పార్వతి, ఆరోగ్య సహాయకుడు రాజశేఖర్, ఔషధ విక్రేత కుమారి, నర్సింగ్ అధికారి లక్ష్మి, ప్రయోగశాల సాంకేతిక నిపుణుడు విక్టర్ రాజు తదితర వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

### ఫారం పొండు గుంతల నిర్మాణంతో

## భూగర్భజాలాలను పెంచుకోవచ్చు ఏపీవో



**కోడేరు (సింగిడి):** కోడేరు మండల పరిధిలోని నర్సాయిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ ఖాజా అన్వర్ బేగం అధ్యక్షతన సమావేశం నిర్వహించారు ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఏపీవో నాగరాజు హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫారంపొండ్ గుంతల నిర్మాణం ఏర్పాటు చేసుకోవడం వల్ల భూగర్భజాలాలను పెంచుకోవచ్చని రైతులకు సూచించారు రైతులు తమ వ్యవసాయ పొలాల్లో వివిజి రాంజీ పథకం కింద అర్హులైన లబ్దిదారులు ఫారం పొరుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలని ఆయన అన్నారు ఫారంపొడు గుంతలను తీసుకోవడం నీరు భూమి లోపల నిల్వ ఉండి భూగర్భ జలాలు పెరుగుతాయని ఆయన సూచించారు ప్రతి ఒక్కరైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు

## ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలి



**బోధన్ ప్రతినిధి,(సింగిడి):** బోధన్ మండలంలోని బిక్నెల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను తెలంగాణ విద్యార్థి పరిషత్ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా తెలంగాణ విద్యార్థి పరిషత్ బోధన్ డివిజన్ అధ్యక్షులు మీసాలె నాగేష్ పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్యా సౌకర్యాలు, మౌలిక వసతులు, తరగతి గదుల పరిస్థితి, విద్యార్థుల సమస్యలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు, విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచాలని సంబంధిత అధికారులను కోరారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ విద్యార్థి పరిషత్ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి వీరేష్, తదితరులు పాల్గొన్నారు

## రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం



**రాజేంద్రనగర్, (సింగిడి):** శంషాబాద్ విమానా శ్రయం అప్రోచ్ రోడ్డులో శనివారం ఉదయం జరిగిన భయానక రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ ప్రాణాలు కోల్పోయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పుల్లమోని రాధిక (33) అనే మహిళ సెప్టెంబర్ 5, 2026 ఉదయం సుమారు 06:43 గంటల ప్రాంతంలో ద్విచక్రవాహనం (నెంబర్: TS07HX0918) పై వెనుక కూర్చొని ప్రయాణిస్తోంది. ఈ క్రమంలో ఎయిర్‌పోర్ట్ అప్రోచ్ రోడ్డులోని ఆర్‌ఓబీ యూ-టర్న్ సమీపంలోకి రాగానే, అతివేగంగా, నిర్లక్ష్యంగా దూసుకొచ్చిన ఒక కారు (నెంబర్: TG07X8636) బైక్‌ను వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాధిక కిందపడిపోవడంతో ఆమె తల, ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు హుటాహుటిన ఆమెను సమీప ఆసుపత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు ఆమె అప్పటికే మృతి చెందినట్లు ధృవీకరించారు. ఈ ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌పై చట్టపరమైన చర్యలు చేపడుతున్నారు.

## పాఠశాల విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన

### ట్రాఫిక్ నిబంధనలు పాటించడం అందరి బాధ్యత



**రాజేంద్రనగర్,(సింగిడి):** ఉన్నతాధికారుల సూచనల మేరకు నార్సింగి ప్రభుత్వ పాఠశాలలో శనివారం విద్యార్థులకు ట్రాఫిక్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్' ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ట్రాఫిక్ అధికా రులు మాట్లాడుతూ, ప్రయాణంలో ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా సబ్ ఇన్స్పెక్టర్లు రాజేష్ గౌడ్, గంగా నరసయ్య మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా నాణ్యమైన హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాపాయం నుంచి రక్షణ పొందుతారని వివరించారు. సిగ్నల్స్ పాటించడం, ఓవర్ స్పీడింగ్ నియంత్రణ, రాంగ్ రూట్ డ్రైవింగ్ చేయకపోవడం గురించి అవగాహన కల్పించారు. పాదచారులు రోడ్డు దాటేటప్పుడు జెబ్రా క్రాసింగ్ ఉపయోగించడం మరియు రోడ్డు నిబంధనలపై చిన్నతనం నుంచే అవగాహన కలిగి ఉండటం అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీస్ కానిస్టేబుల్స్ ఇబ్రహీం, మహేష్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


## నూతన వదు వరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే బండారి



**మల్కాజిగిరి, (సింగిడి):** చక్రిపురం చౌరస్తా శ్రీ సాయి గార్డెన్స్ లో శనివారం బి ఆర్ ఎస్ వి నాయకులు, అడ్వకేట్ ఎం సంపత్ కుమార్, శ్రావణి ల వివాహ మహోత్సవం కు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొని నూతన వదు వరులను ఆశీర్వదించి, వివాహ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లో కుటుంబ సభ్యులు, బి ఆర్ ఎస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరి ఫామ్స్ నింపి ఓటు నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలి

### మాజీ కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్



**మల్కాజిగిరి, (సింగిడి):** ప్రతి ఒక్కరి ఫామ్స్ ను నింపి, ఓటు నమోదయ్యేలా జాగ్రత్తలు తీసుకోవాలని మాజీ కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్ బిఎల్ఓ లకు సూచించారు . మల్కాజిగిరి సర్కిల్ ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని పి వి ఎన్ కాలనీ సెయింట్ ఆన్స్ స్కూల్ వద్ద శనివారం నిర్వహిస్తున్న ఎస్ ఐ ఆర్ ఏనుమలేషన్ ఫామ్స్ ఫీల్లింగ్ సెంటర్ ను మాజీ కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ నోటీసులు జారీ అయిన వారు సరైన పత్రాలను జత చేసి మార్పులు ఉంటే చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఎల్ఓ లు నర్సింగ్ రావు, రోజా రమణి, ప్రతాప్, రజినీకాంత్, సంపత్ రావు, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభాతనవ సింగిడి ప్రతి రంగూ ఓ నిజం
Singidi
ఆదివారం 6-9-2026

# ఎస్ఐఆర్ ఫేజ్-2పై బిఎల్ఎలకు సూపర్‌వైజర్లకు శిక్షణ

### శాంతినగర్‌లో అలంపూర్ నియోజకవర్గ బిఎల్ఎల సమావేశం

**గద్వాల ప్రతినిధి (సింగిడి):** జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గంలోని బి ఎల్ ఎలు, సూపర్‌వైజర్లకు ఎస్ ఐ ఆర్ ఫేజ్-2పై శిక్షణ కార్యక్రమాన్ని శాంతినగర్ క్యాంపు కార్యాలయంలో అలంపూర్ మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ సంపత్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గత నెల రోజులుగా ప్రతి బూత్‌లో బిఎల్ఎలు కీలకంగా పని చేస్తున్నందుకు వారిని నాయకులు అభినందించారు. ఎస్ఐఆర్ మొదటి విడత అనంతరం ఫేజ్-2లో చేపట్టాల్సిన కార్యక్రమాలు, నింపాల్సిన ఫారాలు, పాటించాల్సిన నిబంధనలపై అవగాహన కల్పించారు. ఓటర్ల వివరాల పరిశీలనలో బి ఎల్ ఏలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని నాయకులు పిలుపునిచ్చారు. అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్న ఓటర్లను గుర్తించి, వారి ఓటు హక్కును కాపాడే బాధ్యత బిఎల్ఎలపై ఉందని తెలిపారు. కార్యక్రమానికి అలంపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, జాతీయ కిసాన్ సెల్ కోఆర్డినేటర్ శ్రీకాంత్ దులిపూడి హాజరయ్యారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఇన్‌చార్జి సిద్ధేశ్వర్‌తో పాటు నియోజకవర్గంలోని బి ఎల్ ఎలు, ఇన్‌చార్జిలు, మండల అధ్యక్షులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



## ఉత్తనూర్ పాఠశాలలో విద్యార్థులకు
# రక్త గ్రూప్, హీమోగ్లోబిన్ పరీక్షలు



**గద్వాల ప్రతినిధి (సింగిడి):** జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండల పరిధిలోని ఉత్తనూర్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం రక్త గ్రూప్, హీమోగ్లోబిన్ పరీక్షా కార్యక్రమం నిర్వహించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సంజీవని మొబైల్ మెడికల్ యూనిట్, భవిష్య భారత్ సంస్థల సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టారు. ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పవన్‌కుమార్ రెడ్డి భవిష్య భారత్ సంస్థ లక్ష్యాలు, సేవా కార్యక్రమాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధతో పాటు నివారణాత్మక ఆరోగ్య సంరక్షణపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఇందు మైత్రి రక్త గ్రూప్ తెలుసుకోవడం, హీమోగ్లోబిన్ ప్రాధాన్యతను వివరించారు. సమతుల్య పోషకాహారం తీసుకోవడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రక్త గ్రూప్ గుర్తింపు, హీమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. హెడ్‌మాస్టర్ సోమశేఖర్ రెడ్డి, శివ శంకర్ రెడ్డి, బయో-సైన్స్ ఉపాధ్యాయుడు వీరన్న కార్యక్రమాన్ని అభినందించారు. పాఠశాల తరఫున భవిష్య భారత్ సంస్థకు వారు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్య భారత్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థుల సహకారంతో కార్యక్రమం విజయవంతంగా జరిగిందని పేర్కొన్నారు.

# రైల్వే సమస్యల పరిష్కారానికి జీఎంను కలిసిన ఖమ్మం ఎంపీ రఘురామ్ రెడ్డి



**ఖమ్మం ప్రతినిధి (సింగిడి):** ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పరిధిలో నెలకొన్న రైల్వే సమస్యల పరిష్కారానికి ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి చర్యలు చేపట్టారు. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవను సికింద్రాబాద్‌లో కలిసి జిల్లాలకు సంబంధించిన పలు కీలక రైల్వే అంశాలపై చర్చించారు. ఖమ్మం రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులను వేగవంతం చేయడంతో పాటు, కోవిడ్ సమయంలో నిలిచిపోయిన రైళ్లను పునరుద్ధరించాలని ఎంపీ కోరారు. మధిర, తడికలపూడి వంటి ప్రాంతాల్లో మరిన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపింగ్‌లు కల్పించాలని విజ్ఞప్తి చేశారు భద్రాచలం రోడ్ రైల్వే స్టేషన్ పేరును భద్రాద్రి కొత్తగూడెం లేదా కొత్తగూడెం రైల్వే స్టేషన్‌గా మార్చాలని కోరారు. శ్రీరాముడు కొలువైన భద్రాచలం వరకు రైల్వే లైన్‌ను పూర్తి చేసి, భద్రాద్రి కొత్తగూడెం నుంచి తిరుపతికి 'భద్రాద్రి ఎక్స్‌ప్రెస్'ను ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. డోర్నకల్--మిర్యాలగూడ రైల్వే లైన్‌ను సారవంతమైన వ్యవసాయ భూములకు నష్టం కలగకుండా ప్రత్యామ్నాయ మార్గంలో చేపట్టాలని సూచించారు. కారేపల్లి, గాంధీపురం ప్రాంతాల్లో ఆర్వోబీల నిర్మాణం, అగ్రహారం వద్ద అసంపూర్తిగా ఉన్న అండర్‌పాస్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ఖమ్మం నగరంలోని కస్బాబజార్--గాంధీచౌక్ ప్రాంతంలో వరద ముంపు సమస్య పరిష్కారానికి డ్రైనేజీ వ్యవస్థను విస్తరించాలని విజ్ఞప్తి చేశారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పెండింగ్‌లో ఉన్న అన్ని రైల్వే ప్రాజెక్టులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రైల్వే జీఎంను ఎంపీ రఘురాం రెడ్డి కోరారు.

## ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో
# ప్రజలకు స్వచ్ఛమైన తాగు నీరు



**కల్వకుర్తి (సింగిడి):** తలకొండపల్లి మండలంలోని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఆదేశాల మేరకు తలకొండపల్లి మండలంలోనీ చౌదర్ గ్రామ పంచాయతీలోనీ జర్మనీ సాంకేతిక పరిజ్ఞానంతో వాటర్ ట్యాంక్‌ను ప్రత్యేక పద్ధతిలో శుభ్రపరిచారు. గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. మేరేగా భారతమ్మ గోపాల్, ఉప సర్పంచ్ జ్యోతి ప్రదిప్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, వార్డు సభ్యులు మహేష్ గ్రామ ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. వర్షకాలం సందర్భంగా ప్రతి ఒక్కరూ ఇంటి చుట్టూ పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంచుకోవాలి అని సూచించారు. ప్రతి ఒక్కరూ గ్రామంలోని తాగునీటి నిల్వ ట్యాంకును ఆధునిక జర్మన్ టెక్నాలజీతో పూర్తిస్థాయిలో శుభ్రపరచడం వల్ల నీటి నాణ్యత మెరుగుపడి, ప్రజలకు ఆరోగ్యకరమైన తాగునీరు అందుతుందని నిర్వాహకులు తెలిపారు. గ్రామాల్లో పరిశుభ్రతతో పాటు తాగునీటి భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని స్థానికులు అభినందిస్తూ, ఎల్లప్పుడూ ఆయనకు రుణపడి ఉంటామని రానున్న రోజుల్లో ఆయనకు మా సహాయ సహకారాలు ఉంటాయని వారు అన్నారు ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని గ్రామాల్లో కూడా నిర్వహించాలని ఐక్యత ఫౌండేషన్‌ను చైర్మన్ సుశీకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి కి గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

# సత్తుపల్లి అభివృద్ధికి మంత్రి పొంగులేటి శ్రీకారం

### కలెక్టర్ దివాకర్‌తో కలిసి అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు



**సత్తుపల్లి, (సింగిడి):** సత్తుపల్లి పట్టణ అభివృద్ధిలో మరో ముందడుగు పడింది. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్, ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్ ఐఏఎస్‌తో కలిసి గురువారం పట్టణంలో పలు అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని శివసాయినగర్‌లో బహుళార్థ సాధక కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. స్థానిక ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలకు ఉపయోగపడేలా కమ్యూనిటీ హాల్ నిర్మించనున్నట్లు అధికారులు తెలిపారు. అనంతరం ఎన్టీఆర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్, కలెక్టర్ దివాకర్ కలిసి ప్రారంభించారు. పట్టణ ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలను మరింత చేరువ చేయడంతో పాటు అత్యవసర సమయాల్లో సకాలంలో వైద్య సేవలు అందించేందుకు ఈ కేంద్రం దోహదపడుతుందని అధికారులు తెలిపారు. సత్తుపల్లి నియోజకవర్గంలో



ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, వైద్య సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని నాయకులు పేర్కొన్నారు. అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. కార్యక్రమం లో జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, అడిషనల్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఏసీపీ వసుంధర యాదవ్, సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ రిహానా బేగం, కమల్ పాషా, డీఎంహెచ్ఓ, అడిషనల్ డీఎంహెచ్ఓ, హెల్త్ ఈఈ, గంగారం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అవినాష్, సత్తుపల్లి మున్సిపల్ కమిషనర్ నరసింహ, మున్సిపల్ వైస్ చైర్మన్ బొంతు సుమలత వేణు, సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, సత్తుపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుబ్బారెడ్డి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాదె చెన్నారావు, కౌన్సిలర్ తోట సుజలారాణి గణేష్, మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# డీ-8 కెనాల్‌ను పరిశీలించిన మంత్రి జూపల్లి..

### కాల్వలు, డిస్ట్రిబ్యూటరీలకు నీటి విడుదలపై ఆరా

**నాగర్ కర్నూల్ (సింగిడి):** కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన డీ-8 కెనాల్ పరిధిలోని కాల్వలను పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు బైక్‌పై తిరుగుతూ స్వయంగా పరిశీలించారు. తూడుకుర్తి వద్ద ప్రధాన కాల్వ నుంచి సాకర్‌పల్లి, ఏదుట్ల, గోపాలపేట, రేమద్దుల, సింగాయిపల్లి, తురకపల్లి, గోపులపురం కాల్వలను పరిశీలించి నీటి ప్రవాహం, కాల్వల పరిస్థితిని పర్యవేక్షించారు. కాల్వలు, డిస్ట్రిబ్యూటరీలకు విడుదల చేస్తున్న నీరు, ఆయకట్టు పరిస్థితిపై సాగునీటిపారుదల శాఖ అధికారులను మంత్రి ఆరా తీశారు. ఆయకట్టు చివరి భూముల వరకు నీరు చేరుతున్న తీరును తెలుసుకున్నారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ప్రతి నీటి బొట్టునూ ఒడిసిపట్టి, వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు. అందుబాటులో ఉన్న నీటితో అధిక విస్తీర్ణంలో పంటలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాల్వలు, డిస్ట్రిబ్యూటరీలకు నీటి విడుదల, ప్రవాహం, ఆయకట్టు పరిస్థితిపై అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, నీరు వృథా కాకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయకట్టు చివరి భూములకు సైతం సక్రమంగా నీరు అందేలా చూడాలని ఆదేశించారు. మంత్రి వెంట వనపర్తి జిల్లా గ్రంథాలయ చైర్మన్ గోవర్ధన్, కోడేరు మాజీ ఎంపీపీ రామ్మోహన్ రావు, సాగునీటిపారుదల శాఖ అధికారులు తదితరులు ఉన్నారు.



# జీఓ 97ను వెంటనే రద్దు చేయాలి

### బిఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు దారమోని గణేష్



**కల్వకుర్తి (సింగిడి):** కల్వకుర్తి పట్టణంలోని రోడ్లు భవనాల శాఖ కార్యాలయంలో తెలంగాణ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు దార మోని గణేష్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో పాలిటెక్నిక్ విద్యను నిర్వీర్యం చేసే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన జి ఓ 97ను వెంటనే రద్దు చేయాలని భారత రాష్ట్ర సమితి విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు దారమోని గణేష్ డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్ విద్యపై ఆధారపడుతున్న వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసేలా ప్రభుత్వం వ్యవహరించడం సిగ్గుచేటని, ప్రతి ఏటా అన్ని వర్గాలకు చెందిన వేలాది మంది విద్యార్థులు సాంకేతిక విద్యలో నైపుణ్యం కోసం పాలిటెక్నిక్ విద్యను అభ్యసిస్తున్నారని, డిప్లమా పూర్తి చేసిన వారికి సాంకేతిక రంగంలో మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని తెలిపారు. అలాంటి విద్యా వ్యవస్థను బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం, దానికి విరుద్ధంగా జి ఓ 97 తీసుకురావడం విద్యార్థులకు తీవ్ర అన్యాయం చేయడమేనని అన్నారు. రాష్ట్ర సాంకేతిక విద్యా పరిధిలో కొనసాగుతున్న పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను యూనివర్సిటీల పరిధిలోకి మార్చే ప్రయత్నాలు చేయడం ద్వారా పాలిటెక్నిక్ కోర్సులను క్రమంగా నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతోందని గణేష్ ఆరోపించారు. ఇప్పటికే రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదలలో జాప్యం, విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతుల కొరత వంటి సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించ కుండా పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థనే దెబ్బతీసే నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. విద్యార్థుల భవిష్యత్తు, పేద మధ్యతరగతి కుటుంబాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని పాలిటెక్నిక్ విద్యను యథావిధిగా కొనసాగించాలని ప్రభుత్వాన్ని దారమోని గణేష్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం తన ఆలోచనా విధానాన్ని మార్చు కొని జి ఓ 97 ను తక్షణమే రద్దు చేయాలని కోరారు. విద్యార్థుల ప్రయోజనాలకు భంగం కలిగించే నిర్ణయాలను ప్రభుత్వం వెనక్కి తీసుకోకపోతే, విద్యార్థుల పక్షాన బిఆర్ఎస్వి ఆధ్వర్యంలో అవసరమైన ఆందోళన కార్యక్రమాలు చేపడతామని దారమోని గణేష్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు కంఠం రవీందర్, విష్ణు, పెరు మాళ్ళ కృష్ణ, వికాస్ తదితరులు పాల్గొన్నారు.

# తిరుమల శ్రీవారిని దర్శించుకున్న సర్పంచ్ సునీత ప్రభాకర్ రెడ్డి దంపతులు

**కల్వకుర్తి (సింగిడి):** తలకొండపల్లి మండలంలోని పడకల్ గ్రామ సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి దంపతులు పెళ్లిరోజు సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానానికి వెళ్లి కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారి ఆశీస్సులు పొందుతూ ప్రత్యేక పూజలు నిర్వహించి, కుటుంబ సభ్యులతో కలిసి భక్తిశ్రద్ధలతో శ్రీవారిని దర్శించుకున్నారు. తమ దాంపత్య జీవితంలో మరో మధురమైన సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా తిరుమల శ్రీవారి సన్నిధిలో ప్రత్యేకంగా ప్రార్థనలు చేయడం ఆనందంగా ఉందని సర్పంచ్ సునీత ప్రభాకర్ రెడ్డి దంపతులు తెలిపారు. స్వామివారి ఆశీస్సులతో కుటుంబ సభ్యులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, గ్రామ ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని వారు ఆకాంక్షించారు. పెళ్లిరోజును పురస్కరించుకుని పవిత్రమైన తిరుమల క్షేత్రంలో శ్రీవారిని దర్శించుకోవడం తమకు ఎంతో ప్రత్యేకమైన అనుభూతిని కలిగించిందని తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాల్లో భక్తులతో కలిసి ఆధ్యాత్మిక వాతావరణంలో గడిపారు. శ్రీవారి ఆశీస్సులతో తమ దాంపత్య జీవితం మరింత ఆనందమయంగా సాగాలని, గ్రామ ప్రజలకు ఎల్లప్పుడూ సేవ చేస్తూ పడకల్ గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని సర్పంచ్ దంపతులు సంకల్పించారు. పెళ్లిరోజు సందర్భంగా శ్రీవారి దర్శనం చేసుకున్న డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి దంపతులకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామ ప్రజలు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.



# వాసవి క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

**కల్వకుర్తి (సింగిడి):** కల్వకుర్తి పట్టణ కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర నాయకులు జూలూరి రమేష్ బాబు జన్మది నాన్ని పురస్కరించుకుని వాసవి క్లబ్ ఆధ్వ ర్యంలో ఘనంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమంగా నిర్వహిస్తూ రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ సభ్యులు, యువత, అభిమానులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని 50 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అత్యవసర సమయాల్లో రక్తం అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్న వారికి రక్తదానం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఒక్కొక్కరు ముందుకు వచ్చి రక్తదానం చేయడం ద్వారా మరొకరి ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. జూలూరి రమేష్ బాబు జన్మదినాన్ని పురస్కరిం చుకుని ఇలాంటి సేవా కార్యక్రమం చేపట్టడం అభినందనీయమని పలువురు కొనియాడారు. సమాజ సేవలో భాగంగా రక్తదానం, ఆరోగ్య అవగాహన వంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. రక్తదాన శిబిరానికి సహకరించిన వాసవి క్లబ్ సభ్యులకు, రక్తదాతలకు, నిర్వాహకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరినీ ఈ సందర్భంగా సన్మానించి అభినందించారు. జన్మదిన వేడుకలకు సేవా కార్యక్రమాన్ని జోడించి సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాన్ని నిర్వహించడం ద్వారా జూలూరి రమేష్ బాబు జన్మదిన వేడుకలు ఆదర్శంగా నిలిచాయని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షుడు, మరియు కార్యదర్శి, సభ్యులు పాల్గొన్నారు.





# కళ్యాణలక్ష్మి అమలు కోసం బీఆర్ఎస్ మహాధర్నా







### హామీలు అమలు చేయని సీఎం ప్రజలకు క్షమాపణ చెప్పాలి:
### నాగర్ కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి.

**నాగర్ కర్నూల(సింగిడి):** నాగర్‌కర్నూల్: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయని ముఖ్యమంత్రి, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రజల ముందుకు వచ్చి ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాలని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి డిమాండ్ చేశారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల రద్దులో రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురువారం మినీ ట్యాంక్‌బండ్ కూడలిలో మహాధర్నా నిర్వహించారు.

మర్రి మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, కొత్త పథకాలు అమలు చేయడం పక్కనపెట్టి కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ విషయంలో ప్రభుత్వం కోర్టులో సరైన వాదనలు వినిపించకపోవడం వల్లే పథకం రద్దు పరిస్థితికి వచ్చిందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ పథకాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ హయాంలో రైతుబంధు, రైతుబీమా, కేసీఆర్ కిట్, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, హాస్టల్ విద్యార్థులకు సన్నబియ్యం వంటి పథకాలు అమలు చేశారని, వాటిని కొనసాగించలేక కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేసిందని విమర్శించారు. సంక్షేమ పథకాల కోసం ప్రజలు ప్రశ్నించకపోతే ఉన్న పథకాలన్నింటినీ రద్దు చేస్తారని, ప్రజలు చైతన్యవంతులై ప్రభుత్వాన్ని నిలదీయాలని పిలుపునిచ్చారు.

**తులం బంగారం హామీ ఏమైంది?**

కళ్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఉన్న కళ్యాణలక్ష్మి పథకాన్ని కూడా నిర్వీర్యం చేసిందని మర్రి ఆరోపించారు. కేసీఆర్ హయాంలో నెలలోపే కళ్యాణలక్ష్మి సాయం అందేదని, ఇప్పుడు ఏళ్ల తరబడి ఆలస్యం చేస్తున్నారని విమర్శించారు. ఆడపిల్లల సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వానికి ప్రజల ఆగ్రహం తప్పదన్నారు.

**ఎమ్మెల్యేపై ఆరోపణలు..**

సంక్షేమ పథకాల కోసం సంతకాలు చేసే విషయంలో నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే పార్టీలు చూస్తున్నారని మర్రి ఆరోపించారు. పేదలకు పార్టీలు చూడకుండా సంక్షేమ పథకాలు అందించాలని అన్నారు. మున్సిపాలిటీలో పేదలను రాజకీయ కారణాలతో తొలగిస్తున్నారని ఆరోపించారు.

**పేదలకు బువ్వ పెట్టడం పాపమా ?**

మర్రి అన్న క్యాంటీన్ ద్వారా పేదలకు భోజనం అందిస్తుంటే మున్సిపాలిటీ నోటీసులు ఇవ్వడం సరికాదన్నారు. నెలకు రూ. 10 నుంచి రూ. 15 లక్షలు తన సొంత డబ్బు ఖర్చు చేస్తున్నానని, అయినా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. పేదలకు బుక్కెడు బువ్వ పెట్టడం కూడా పాపమా అని ప్రశ్నించారు.

**24 గంటల విద్యుత్‌పై మరో ధర్నా..**

కేసీఆర్ హయాంలో 24 గంటల విద్యుత్ అందేదని, ప్రస్తుతం వ్యవసాయంతో పాటు గృహ విద్యుత్‌కు కూడా కోతలు పెడుతున్నారని మర్రి విమర్శించారు. 24 గంటల విద్యుత్ కోసం త్వరలో మరో ధర్నా చేపడతామని ప్రకటించారు.

**సీఐతో వాగ్వాదం..**

ధర్నా ప్రాంగణంలో సీఐ అశోక్‌రెడ్డి కార్యకర్తలను పక్కకు జరపడంతో మర్రి జనార్దన్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. పోలీసులు కాంగ్రెస్‌కు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ "ఒంటిపై ఖాకీ డ్రెస్సు.. మనసంతా కాంగ్రెస్" అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ర్యాలీగా ఆర్డీవో కార్యాలయానికి వెళ్లే సమయంలోనూ పోలీసులు, బీఆర్ఎస్ నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.

**ఆర్డీవో కార్యాలయం గేటు వద్ద పోలీసులు..**

అడ్డుకోవడంతో కార్యకర్తలు లోపలికి వెళ్లి కార్యాలయం ముందు బైఠాయించారు. అనంతరం సంక్షేమ పథకాలను కొనసాగించాలని నినాదాలు చేస్తూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రోడ్డెక్కిన పూల కొట్టు..!

### వాహనదారులకు తీవ్ర ఇక్కట్లు
### ఫుట్‌పాత్ దాటి రహదారిపైనే దందా.. పట్టించుకోని అధికారులు


**కొత్తగూడెం(సింగిడి):** జిల్లా కేంద్రమైన కొత్తగూడెం ఎంజీ రోడ్డులో పూల వ్యాపారులు రోడ్డునే వ్యాపార వేదికగా మార్చుకోవడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు నగరంలో ఆరు లైన్ల రహదారిని నిర్మించినప్పటికీ, ఆక్రమణల కారణంగా ప్రయోజనం లేకుండా పోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎంజీ రోడ్డులో పూల వ్యాపారులు ఫుట్‌పాత్ పరిధికే పరిమితం కాకుండా ఏకంగా ప్రధాన రహదారిపైకి వచ్చి దుకాణాలు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు సాగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పూల బుట్టలు, ఇతర సామగ్రిని రోడ్డుపై ఉంచడంతో వాహనాలు వెళ్లేందుకు స్థలం తగ్గిపోతోంది. దీంతో ముఖ్యంగా రద్దీ సమయాల్లో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడి వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు.

**ప్రశ్నిస్తే దురుసు సమాధానాలు**

రోడ్డుపై వ్యాపారం చేయడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఎవరైనా ప్రశ్నిస్తే కొందరు వ్యాపారులు దురుసుగా సమాధానం ఇస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిబంధనలు పాటించాల్సిన వ్యాపారులు రహదారినే ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు.

**ట్రాఫిక్ పోలీస్ దృష్టి సారించాలి**


రహదారి ఆక్రమణలపై సంబంధిత ట్రాఫిక్ పోలీస్ అధికారులు తక్షణమే దృష్టిసారించి ఫుట్‌పాత్‌లు, ప్రధాన రహదారులను పూలకొట్ల ఆక్రమణల నుంచి విముక్తి చేయాలని జిల్లా వాసులు కోరుతున్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే వ్యాపారాలపై చర్యలు తీసుకుని, పాదచారులు, వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.





# నువ్వెవరికి తెలుసు అన్నారు..

## నటి వైష్ణవి చైతన్య



ఒకప్పుడు తనకు ఎదురైన ప్రశ్న తననెంతో బాధపెట్టిందని అన్నారు నటి వైష్ణవి చైతన్య ఆనంద్ దేవరకొండతో కలిసి 'ఎపిక్: ఫస్ట్ సెమిస్టర్'తో సందడి చేసేందుకు ఆమె సిద్ధమయ్యారు. ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో నటి మాట్లాడుతూ.. కెరీర్ ప్రారంభంలో తనకు ఎదురైన అనుభవాలను గుర్తుచేసుకున్నారు.

"నిన్ను ఎవరైనా గుర్తుపడతారా?, నువ్వు ఎవరికైనా తెలుసా?, గూగుల్‌లో నీ పేరు కొడితే నీ గురించి ఏమైనా వస్తుందా?'.. ఇలా ఒకప్పుడు నన్ను చాలా ప్రశ్నలు అడిగారు. ఆరోజు నేను ఉన్న స్థాయి ఏంటో నాకు తెలుసు. అయినా ఎందుకో బాధేసింది. చాలా రోజులు అది నన్ను వెంటాడింది. ఇప్పుడు ఆ ప్రశ్నలన్నిటికీ సమాధానం దొరుకుతుంది. గూగుల్‌కు వెళ్లి నా గురించి వెతికితే.. నా వివరాలు వస్తాయి. నేను చేసిన సినిమాలు వస్తాయి. నా కెరీర్ మొత్తం కనిపిస్తుంది. ఇది నాకు ఎపిక్ మూమెంట్" అని వైష్ణవి చెప్పారు.

'గూఢచారి 2' ఫస్ట్ రివ్యూ ఇచ్చిన దర్శకుడు.. ఇక, ఈవెంట్‌కు అతిథిగా వచ్చిన రష్మికపై ఆమె ప్రశంసలు కురిపించారు. రష్మిక కెరీర్ ఎంతోమంది అమ్మాయిలకు స్ఫూర్తి అని తెలిపారు. ఆదిత్య హాసన్ తెరకెక్కించిన 'ఎపిక్'ను సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. శివాజీ, వాసుకి తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ నెల 11న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.




# అతి పెద్ద టైటిల్‌తో వస్తున్న తెలుగు మూవీ..

పేర్లతోనే ఆసక్తిని పెంచిన సినిమాలెన్నో. ఇక సినిమా టైటిల్స్ విషయంలో మన దర్శక-రచయితల శైలే వేరు. ఒక అక్షరంతో మొదలుకొని ఎన్నో రకాలు టైటిల్స్ వచ్చాయి. ఇప్పుడు తెలుగు సినీ చరిత్రలోనే అతిపెద్ద టైటిల్‌తో సినిమా రాబోతోంది. 'ఆ నలుగురు' మూవీతో భావోద్వేగాలను పంచిన దర్శకుడు చంద్ర సిద్ధార్థ్. ఆయన దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతోంది. దీనికి 'ఈ పాట కోరినవారు నెమలిపాలెం నుండి రమ, జ్యోత్స్న, నందు, మురళి, కబీర్, ఢోల్ రవి మొదలగువారు' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. 'ఎ ఫర్‌బిడెన్ రాగ ఫ్రమ్ ఎ ఫర్‌గాటెన్ సాగా' అనేది దీనికి ఉప శీర్షిక.

దర్శక-రచయిత మదన్ కథ అందించారు. హర్ష హీరోగా అమైరా గోస్వామి, సుజనా రెడ్డి, ఇనాయా సుల్తానా, రవివర్మ, అశోక్‌వర్ధన్, రేఖా నిరోషా తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీని సెప్టెంబరు 18న విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. దీన్నొక మిస్టరీ మ్యూజికల్‌గా తీర్చిదిద్దారు. సౌండ్ థెరపీ, బ్రెయిన్ మ్యాపింగ్, జ్ఞాపకాలు, అపరాధ భావన వంటి అంశాలను మిస్టరీ కథనంతో మేళవించినట్లు చిత్ర బృందం చెబుతోంది

# Mahima Nambiar

# ఆమె లేకపోతే నా జీవితం వృథా..

## అదితిపై ప్రేమను కురిపించిన సిద్ధార్థ్



ఇటీవల స్ట్రీమింగ్‌కు వచ్చిన 'ఆపరేషన్ సఫేద్ సాగర్' వెబ్ సిరీస్ విజయంతో ఉత్సాహంగా ఉన్న సిద్ధార్థ్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. తన సతీమణి అదితిపై ప్రశంసలు కురిపించారు. ఆమె లేకపోతే తన జీవితం వ్యర్థమని భావోద్వేగానికి గురయ్యారు.

"నేను ప్రేమని నమ్మాను కాబట్టే అదితి నాకు దొరికింది. ఆమె నా సోల్‌మేట్. అదితి పుట్టినందుకు నేను రోజూ కృతజ్ఞతలు చెబుతుంటాను. ఆమె లేకపోతే నా జీవితాన్ని ఊహించుకోలేను. 'రంగ్ దే బసంతి' తర్వాత 20 ఏళ్లకు 'సఫేద్ సాగర్' లాంటి విజయం దక్కినందుకు ఎంత ఆనందంగా ఉందో.. అదితి నా జీవితంలోకి వచ్చినందుకు అంతే సంతోషంగా ఉంది" అని ఆయన చెప్పుకొచ్చారు.

మరోవైపు, బాలీవుడ్ కొరియోగ్రాఫర్ ఫరా ఖాన్ వ్లాగ్‌లో పాల్గొన్న అదితి కూడా సిద్ధార్థ్ గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. సిద్ధార్థ్‌ను పెళ్లి చేసుకోవాలని ఎప్పుడు అనిపించిందన్న ప్రశ్నకు ఆమె బదులిస్తూ.. 'ఆ నిర్ణయం తీసుకోవడానికి నాకు ఒక్కక్షణం కూడా పట్టలేదు. సిద్ధార్థ్ చాలా మంచి వ్యక్తి. ఆయనలో ఎలాంటి కల్మషం ఉండదు. చాలా సహజంగా ఉంటాడు. అన్నింటికీ మించి నా కుటుంబాన్ని ఎంతో ప్రేమిస్తాడు. నాకు కావాల్సిన వాళ్లందరినీ ఒక్కచోట చేర్చుతాడు. ఆ తత్వమే నాకు బాగా నచ్చింది" అని అదితి తెలిపారు.

సినిమా సింగిడి
Cinma Singidi
ఆదివారం
6-9-2026

# శ్రీవిష్ణు 'కామ్రేడ్ కళ్యాణ్'.. టీజర్ వచ్చేసింది

శ్రీవిష్ణు కథానాయకుడిగా నటిస్తున్న కొత్త చిత్రం 'కామ్రేడ్ కళ్యాణ్' మహిమా నంబియార్ కథానాయిక. జానకిరాం మారెల్ల దర్శకత్వంలో రానుంది. కోన ఫిల్మ్ కార్పొరేషన్, స్కంధ వాహన మోషన్ పిక్చర్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. దాదాపు చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ అక్టోబరు 9న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా టీజర్ విడుదలైంది. విశాఖ జిల్లా మాడుగుల ప్రాంతంలో 1992లో జరిగిన సంఘటన ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కించారు.

Printed and Published by Mohan Pusala on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Pusala mohan, PRGI.REGN.NO. TGTEL/26/A4370. Cell 91 89199 18737